మంగళవారం 25-6-2019


'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 94


**వివాదాల 'విరాళ్'... గుడ్‌బై**

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా విరాళ్ ఆచార్య రాజీనామా
- బిజినెస్‌లో


**బంగ్లా పైపైకి...**

షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన. అఫ్గానిస్తాన్‌పై బంగ్లాదేశ్ గెలుపు
- స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



## విదేశాల్లోని నల్లధనం 34 లక్షల కోట్లు

**భారతీయులు దాచినట్లు గుర్తింపు**

- భారతీయులు తమ నల్లధనాన్ని భారీ మొత్తంలో విదేశాల్లో దాచినట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. విదేశాల్లో భారతీయుల నల్లధనం రూ.15 లక్షల కోట్ల నుంచి రూ.33.9 లక్షల కోట్ల వరకు ఉంటుందని స్పష్టమైంది. ఇదంతా కేవలం 1980–2010 సంవత్సరాల మధ్య దాచిన మొత్తమే అని తేలింది.

- వివరాలు 5లో

## ఓరుగల్లు జిల్లాల పునర్వ్యవస్థీకరణ

- హన్మకొండ జిల్లాగా వరంగల్ అర్బన్
- వరంగల్ జిల్లాగా వరంగల్ రూరల్
- రెండు జిల్లాల కూర్పు, పేర్లలో మార్పు
- ప్రజా విజ్ఞప్తుల నేపథ్యంలో సీఎం కేసీఆర్ నిర్ణయం
- ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు జారీ చేసే అవకాశం
- యథాతథంగా గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్

2 లో





## పాలకులం కాదు.. సేవకులం

- మేనిఫెస్టోనే ప్రభుత్వ జీవనాడి: ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి
- జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సీఎం దిశా నిర్దేశం
- ఎన్నికల వరకే రాజకీయాలు.. ఇప్పుడు అందరూ మనవాళ్లే
- ఉగాది నాటికి ఇంటి స్థలాలు లేనివారందరికీ పట్టాలు
- అక్రమ కట్టడాల కూల్చివేత 'ప్రజా వేదిక'తోనే ప్రారంభం

- వివరాలు 2లో

# మున్సి 'పోల్స్'కు ముందడుగు




**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గణన షురూ.. వచ్చే నెల 19న తుది జాబితా.. ఆ తర్వాత ఎప్పుడైనా ఎన్నికలు**

సాక్షి, హైదరాబాద్

మున్సి'పోల్స్'కు ముందడుగు పడింది. ఎన్నికల క్రతువులో కీలక ఘట్టానికి తెరలేచింది. రిజర్వేషన్ల ఖరారుకు ప్రాతిపదికగా భావించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు ప్రక్రియను ప్రభుత్వం చేపడుతోంది. ప్రస్తుత పురపాలికల పదవీకాలం వచ్చే నెల 2వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో పురపాలక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కృతనిశ్చయంతో ఉన్న సర్కారు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపునకు ఇంటింటి సర్వే మొదలుపెట్టింది. వాస్తవానికి గత ఫిబ్రవరిలోనే ఈ సామాజికవర్గాల ఓటర్లను పురపాలక శాఖ గుర్తించింది. తాజాగా గుర్తించిన ఓటర్లను పరిశీలించి జాబితా సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. శనివారం ప్రారంభమైన డోర్ టు డోర్ సర్వే వచ్చే నెల నాలుగో తేదీ వరకు కొనసాగనుంది. ఆ తర్వాత ఐదో తేదీన జాబితాను పరిశీలించి ఆరో తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రదర్శించనున్నారు. మున్సిపాలిటీ/నగర పాలక సంస్థ, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శించడమే కాకుండా.. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ప్రతిని అందజేయనున్నారు.

**5 రోజులు అభ్యంతరాల స్వీకరణ..**

ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను జూలై 7 నుంచి 11వ తేదీ వరకు స్వీకరించనున్నారు. ఈ అభ్యంతరాలు/క్లెయిమ్స్‌ను 12 నుంచి 14వ తేదీలలో పరిశీలించి 15, 16వ తేదీలలో క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించనున్నారు. ఆ తర్వాత ఓటర్ల జాబితాలో

మిగతా 2వ పేజీలో ▶

## 'హుజూర్‌నగర్' తర్వాతే?

- ఉప ఎన్నిక తర్వాతే టీపీసీసీ చీఫ్ మార్పు.. కాంగ్రెస్ సంకేతాలు
- మున్సిపల్ ఎన్నికలను కూడా దృష్టిలో ఉంచుకునే నిర్ణయం
- ఎన్నికల సమయంలో మారిస్తే సమన్వయం ఉండదనే యోచన
- రాహుల్ అంశం తేలాకే టీపీసీసీ చీఫ్‌పై నిర్ణయమన్న కుంతియా
- ఎన్నికల దృష్ట్యా మార్చొద్దని జగ్గారెడ్డి సూచన



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడి మార్పు ఇప్పట్లో ఉండదా..? త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు ఉంటాయనే ప్రభుత్వ సంకేతాలు... ఆరు నెలల్లో హుజూర్‌నగర్ అసెంబ్లీకి అనివార్యంగా జరగాల్సిన ఉప ఎన్నిక నేపథ్యంలో అవి పూర్తయిన తర్వాతే ఉత్తమ్‌ను మారుస్తారా..? అంటే అవుననే అంటున్నాయి కాంగ్రెస్ పార్టీ వర్గాలు. ఇప్పటికిప్పుడు టీపీసీసీ అధ్యక్షుడిని మార్చాల్సిన పనిలేదని, ఎన్నికలకు ముందు అధ్యక్షుడిని మారిస్తే పార్టీలో సమన్వయానికి కొంత ఇబ్బంది అవుతుందనే ఆలోచనతో టీపీసీసీ అధ్యక్షుడి ఎంపిక కసరత్తును అధిష్టానం ప్రస్తుతానికి నిలిపివేసినట్టు తెలుస్తోంది. దీనికి అనుగుణంగానే సోమవారం విలేకరులతో మాట్లాడిన కుంతియా ఇప్పట్లో టీపీసీసీ అధ్యక్షుడి మార్పు ఉండదని, రాహుల్‌గాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉండాలా?.. వద్దా?.. అన్నది తేలిన తర్వాతే

మిగతా 2వ పేజీలో ▶

## ఇక నుంచి ఒంటరి పోరే

**బీఎస్పీ నేత మాయావతి**



- ఇక ముందు జరిగే ఎన్నికల్లో తాము ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగానే పోటీ చేస్తామని బీఎస్పీ అధినేత్రి మాయావతి స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికలు చిన్నవైనా, పెద్దవైనా ఒంటరిగానే పోటీ చేస్తామని లక్నోలో ఆమె ప్రకటించారు.

- వివరాలు 5లో




## 200% పెరగనున్న ఇంజనీరింగ్ ఫీజు!

- టీఏఎఫ్‌ఆర్‌సీకి సీబీఐటీ ప్రతిపాదన.. అదే బాటలో మిగతా కాలేజీలు
- ఈ నెల 27 నుంచి వెబ్ ఆప్షన్లు ప్రారంభమయ్యేనా?
- 6 కాలేజీల్లో 'యాజమాన్య' ఫీజుల అమలుకు హైకోర్టు ఆదేశాలు!
- అదే తమకూ వర్తింపజేయాలంటున్న మరో 75 కాలేజీలు

- 2లో

## అంబులెన్స్‌కు దారివ్వకుంటే 10 వేల ఫైన్

- హెల్మెట్ లేకుంటే రూ. వెయ్యి జరిమానా, 3 నెలలు లైసెన్స్ రద్దు
- మైనర్లు యాక్సిడెంట్ చేస్తే తల్లిదండ్రులే దోషులు
- కేంద్ర కేబినెట్ నిర్ణయం

- 5లో

## గుర్తింపు ధ్రువీకరణగా ఆధార్ కార్డు

- ఆధార్ చట్టం–2016కు సవరణలతో లోక్‌సభలో బిల్లు
- ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన శిక్షలకు వీలు
- ఇక బ్యాంకు ఖాతా, మొబైల్ కనెక్షన్లకు ఆధార్‌ను వాడుకోవచ్చు
- ఉభయసభల్లో ఆమోదం పొందితే చట్టం అమల్లోకి..

- 5లో






# రానున్న మూడ్రోజులు రాష్ట్రంలో వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తూర్పు మధ్యప్రదేశ్, దాని పరిసర ప్రాంతాల్లో 3.1 కి.మీ. నుంచి 3.6 కి.మీ. మధ్య ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొంది. అలాగే రాష్ట్రంలో నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, కొమురం భీం, సంగారెడ్డి జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది.

**24 గంటల్లో నమోదైన వర్షపాతం**

మక్లూర్ (నిజామాబాద్) 11 సెం.మీ., దిలావర్‌పూర్ (నిర్మల్) 10 సెం.మీ., పిట్లం (కామారెడ్డి) 8 సెం.మీ., జైనూర్ (కొమురం భీం) 7 సెం.మీ., కోహిర్ (సంగారెడ్డి) 7 సెం.మీ., సిర్పూర్(కొమురం భీం) 7 సెం.మీ., లింగంపేట్ (కామారెడ్డి) 6 సెం.మీ., నేరేల్ (సంగారెడ్డి) 6 సెం.మీ., ఆర్మూర్ (నిజామాబాద్) 6 సెం.మీ., ఎడపల్లి (నిజామాబాద్) 6 సెం.మీ., జక్రాన్‌పల్లి (నిజామాబాద్) 5 సెం.మీ., నిజామాబాద్ 5 సెం.మీ., నిర్మల్ 5 సెం.మీ., కెరమెరి (కొమురం భీం) 5 సెం.మీ., దండెపల్లి (మంచిర్యాల) 4 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది.

## చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**నేడు ఢిల్లీలో తెలంగాణ నేతన్నల ఐక్య కార్యాచరణ కమిటీ ధర్నా**

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేతన్నల ఐక్య కార్యాచరణ కమిటీ మంగళవారం ఢిల్లీలో ధర్నాకు పిలుపునిచ్చింది. నేతన్నల ఆత్మహత్యలను నివారించి, వారు ఆత్మాభిమానంతో బతికేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి డిమాండ్ సాధన కోసం ధర్నా చేపట్టనున్నట్టు కమిటీ చైర్మన్ దాసు సురేశ్ సోమవారం ఢిల్లీలో మీడియాకు తెలిపారు.

## తెలంగాణకు 5 స్వచ్ఛ్ మహోత్సవ్ పురస్కారాలు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణను వివిధ విభాగాల్లో ఐదు స్వచ్ఛ్ మహోత్సవ్ పురస్కారాలు వరించాయి. మరుగుదొడ్ల వినియోగం, ఆకర్షణీయమైన రీతిలో వాటి నిర్మాణం, పరిశుభ్రత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ పలు రాష్ట్రాలు, జిల్లాలు, సంస్థలు, వ్యక్తిగత విభాగంలో అవార్డులు ప్రకటించింది. జిల్లాల స్థాయిలో పెద్దపల్లి, వరంగల్, ప్రత్యేక వ్యక్తిగత విభాగంలో ఎర్రవల్లికి చెందిన మొండి చిన్నవి, జగిత్యాల శాంతక్కపల్లికి చెందిన మొరపు రమక అవార్డులు దక్కాయి. ఇక రాష్ట్రాల స్థాయిలో రెండో స్థానంలో నిలిచిన తెలంగాణకు అవార్డు దక్కింది. సోమవారం ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా పంచాయతీరాజ్ కమిషనర్ నీతూ కుమారి ప్రసాద్, పెద్దపల్లి కలెక్టర్ అవార్డులు అందుకున్నారు.

## 28న విద్యుత్ ఉద్యోగుల భవిష్యత్ కార్యాచరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ప్రైవేటు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలపై పోరాట బాట పట్టడానికి ఈ నెల 28న సమావేశమై ఉద్యమ కార్యాచరణ ప్రకటించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ యూనియన్స్ ఫ్రంట్ (టీఈటీయూఎఫ్) నిర్ణయించింది. ఈమేరకు సోమవారం టీఈటీయూఎఫ్ ఆధ్వర్యంలో 18 కార్మిక సంఘాల నేతలు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. 1104 యూనియన్ అధ్యక్షుడు ఎన్.పద్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## బీబీనగర్‌లో ఎయిమ్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టండి

**కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌కు ఎంపీ కోమటిరెడ్డి వినతి**



కేంద్ర మంత్రి హర్షవర్ధన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: తన లోక్ సభ నియోజకవర్గ పరిధిలోని బీబీనగర్‌లో ఎయిమ్స్ ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర వైద్య, ఆరోగ్య మంత్రి డాక్టర్ హర్షవర్ధన్‌ను సోమవారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. రూ.1028 కోట్ల వ్యయ అంచనాతో భువనగిరిలో ఎయిమ్స్ ఏర్పాటుకు కేంద్రం హామీ ఇచ్చిందని, ఇందుకోసం బీబీనగర్‌లోని 200 ఎకరాల నిమ్స్ ప్రాంగణాన్ని రాష్ట్రం కేంద్రానికి అప్పగించిందని లేఖలో పేర్కొన్నారు. ఈ ఏడాది 50 ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులు కూడా ఎయిమ్స్‌లో విద్యను అభ్యసించనున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో హాస్టల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, రెగ్యులర్ బోధకులు, ఇతర సిబ్బందిని నియమించాలని, ప్రస్తుతం ఉన్న నిమ్స్ భవన ప్రాంగణంలో అవుట్ పేషెంట్ క్లినికల్ సదుపాయాలు కల్పించాలని, అవసరమైన శాశ్వత భవనాల నిర్మాణం వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఈ ఏడాది ఆగస్టులో జరగనున్న శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కావాలని కూడా హర్షవర్ధన్‌ను కోమటిరెడ్డి కోరారు.

## దూకుడు పెంచిన కమలనాథులు

- రాష్ట్రంలో ప్రధాన పార్టీగా బలపడేందుకు కార్యాచరణ
- 27న ఢిల్లీలో భారీ చేరికలు
- బీజేపీ తీర్థం పుచ్చుకోనున్న 30 మంది నేతలు
- జాబితాలో చాడ సురేశ్‌రెడ్డి, పెద్దిరెడ్డి, బోడ జనార్దన్

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి అనూహ్యంగా నాలుగు ఎంపీ సీట్లు గెలుచుకున్న బీజేపీ... రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీగా బలపడేందుకు దూకుడు పెంచింది. అధికార టీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు అనుసరించాల్సిన వ్యూహాన్ని, కార్యాచరణను సిద్ధం చేసుకుంటోంది. ముందుగా ప్రధాన ప్రతిపక్షంగా అవతరించేందుకు రాజకీయ బలాన్ని సమకూర్చుకోవడంలో నిమగ్నమైంది. ఒక వైపు టీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొనే ప్రజావ్యతిరేక నిర్ణయాలపై పోరాడేందుకు ఉద్యమ కార్యాచరణను అమలు చేస్తూనే రాజకీయంగా అన్ని స్థాయిల్లోనూ బలం సంతరించుకునేందుకు చర్యలు చేపట్టనుంది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలం క్రమంగా క్షీణిస్తున్నదనే అంచనాతో ఉన్న బీజేపీ జాతీయ నాయకత్వం... రాష్ట్రంలో ఆ పార్టీ విపక్ష స్థానాన్ని చేజిక్కించుకునేందుకు పావులు కదుపుతోంది. ఏపీలో టీడీపీ బలహీనపడటంతో అక్కడా ప్రధాన రాజకీయ పార్టీగా ఎదిగేందుకు ఇతర పార్టీల నుంచి చేరికలను కొనసాగిస్తోంది. తెలంగాణలోనూ కాంగ్రెస్‌తోపాటు టీడీపీకి చెందిన ముఖ్య నాయకులను, జిల్లాల్లో పార్టీ పటిష్టతకు ఉపయోగపడే నేతలను చేర్చుకునేందుకు ముహూర్తం ఖరారు చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీల స్థానాన్ని రాజకీయంగా భర్తీచేయడంతోపాటు టీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు అన్ని స్థాయిల్లో అనువైన నాయకులను, రాజకీయ పలుకుబడి, గుర్తింపు ఉన్న నేతల చేరికలను పెద్ద ఎత్తున చేపట్టనుంది. ఈ నెలాఖరులోగా భారీ సంఖ్యలో ఈ పార్టీల నుంచి చేరికలకు రంగం సిద్ధం చేసింది. ఈ నెల 27న ఢిల్లీలో జాతీయ నాయకుల సమక్షంలో ముఖ్యనేతలు చాడ సురేశ్ రెడ్డి, ఇనుగాల పెద్దిరెడ్డి, బోడ జనార్దన్, మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి సహా 30 మంది వరకు సీనియర్ నాయకులు బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ మేరకు రాష్ట్ర నాయకత్వం చేరికలకు ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల చివరలోగా మరికొందరు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా పార్టీలో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. వారే కాకుండా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో రాజకీయంగా పనికొచ్చే కాంగ్రెస్ నాయకులు ఎవరెవరు బీజేపీలో చేరేందుకు ఆసక్తిని కనబరుస్తున్న దానిపై ఆరా తీస్తున్నారు. త్వరలోనే కాంగ్రెస్ నుంచి పలువురు సీనియర్లు తమ పార్టీలో చేరే అవకాశాలున్నట్టు బీజేపీ ముఖ్యనేత ఒకరు 'సాక్షి'కి వెల్లడించారు.

# 200 శాతం పెరగనున్న ఇంజనీరింగ్ ఫీజు!

- టీఏఎఫ్ఆర్‌సీకి సీబీఐటీ ప్రాతిపాదనలు
- అదే బాటలో మిగతా కాలేజీల యాజమాన్యాలు
- ఈ నెల 27 నుంచి వెబ్ ఆప్షన్లు ప్రారంభమయ్యేనా?
- ఆరు కాలేజీల్లో యాజమాన్య ప్రతిపాదిత ఫీజుల అమలుకు హైకోర్టు ఆదేశాలు!
- అవే ఆదేశాలను తమకు వర్తింపజేయాలంటున్న మరో 75 కాలేజీలు
- యాజమాన్య ప్రతిపాదిత ఫీజు అమలు ఉత్తర్వులపై అప్పీల్‌కు అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కొన్ని ప్రధాన ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల మోత మోగనుంది. ఏకంగా 200 శాతానికి మించి ఫీజు పెంపును కాలేజీల యాజమాన్యాలు ప్రతిపాదించాయి. టాప్ కాలేజీల్లో ఒకటైన చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) ఏకంగా రూ.3 లక్షల వార్షిక ఫీజును ప్రతిపాదించింది. మిగతా 75 ప్రధాన కాలేజీలు కూడా ఫీజుల పెంపు ప్రతిపాదనలను తెలంగాణ ఫీజులు, ప్రవేశాల నియంత్రణ కమిటీకి (టీఏఎఫ్ఆర్‌సీ) అందజేశాయి. ఫీజుల పెంపు కోసం ఇప్పటికే ఆరు కాలేజీలు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం టీఏఎఫ్ఆర్‌సీకి చైర్మన్‌ను నియమించి, కాలేజీలవారీగా ఫీజులను ఖరారు చేసే వరకు యాజమాన్యాలు ప్రతిపాదించిన ఫీజును అమలు చేయాలని, ఫీజులు ఖరారయ్యాక మిగతా మొత్తాన్ని సర్దుబాటు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు ఉన్నత విద్యాశాఖ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో ప్రభుత్వవర్గాలు పడ్డాయి.

**ఫీజు ఖరారు గడువు ముగిసింది.**

2016లో ఖరారు చేసిన ఫీజుల గడువు 2018-19 విద్యా సంవత్సరంతో ముగిసింది. దీంతో 2019-20 విద్యా సంవత్సరం నుంచి వచ్చే మూడేళ్లపాటు ఫీజులను ఖరారు చేయాల్సి ఉంటుంది. హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని ఫీజుల కమిటీ ఖరారు చేస్తేనే వాటికి చట్టబద్ధత ఉంటుంది. వరుస ఎన్నికల కారణంగా టీఏఎఫ్ఆర్‌సీకి చైర్మన్ నియామకం అంశం మరుగున పడిపోయింది. చైర్మన్ నియామకం జరిగేలోగా టీఏఎఫ్ఆర్‌సీ సభ్య కార్యదర్శి హోదాలో విద్యాశాఖ కార్యదర్శి ఫీజుల ప్రతిపాదనల స్వీకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు. యాజమాన్య ప్రతిపాదిత ఫీజులను అమలు చేస్తే తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యే పరిస్థితి నెలకొంది. దీంతో ఆ ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళ్లాలని ప్రభుత్వం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చింది. అయితే ఇంకా కోర్టు ఆర్డర్ కాపీ అందలేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

**టీఏఎఫ్ఆర్‌సీ వర్గాల సమాచారం మేరకు కొన్ని కాలేజీ యాజమాన్యాలు ప్రతిపాదించిన ఫీజు..**

| విద్యా సంస్థ | పాత ఫీజు | ప్రతిపాదిత ఫీజు | విద్యా సంస్థ | పాత ఫీజు | ప్రతిపాదిత ఫీజు |
|---|---|---|---|---|---|
| సీబీఐటీ | 1,13,500 | 3,00,000 | గోకరాజు రంగరాజు | 95,000 | 1,82,000 |
| ఎంజీఐటీ | 1,00,000 | 2,30,000 | మాతృశ్రీ | 67,000 | 1,10,000 |
| వాసవి | 86,000 | 1,90,000 | కిట్స్ | 1,05,000 | 1,80,000 |
| వర్ధమాన్ | 1,05,900 | 1,89,000 | సీవీఆర్ | 90,000 | 1,40,000 |
| శ్రీనిధి | 91,000 | 1,76,500 | గీతాంజలి | 81,000 | 1,02,000 |
| వీఎన్ఆర్‌విజ్ఞాన్‌జ్యోతి | 98,500 | 2,72,000 | కేఎంఐటీ | 77,000 | 1,33,000 |
| ఎంవీఎస్ఆర్ | 95,000 | 1,57,000 | బీవీఆర్ఐటీ | 65,000 | 1,25,000 |
| జి.నారాయణమ్మ | 95,000 | 1,35,000 | సీఎంఆర్‌సీఈటీ | 75,000 | 1,30,000. |

## 27 నుంచి వెబ్ ఆప్షన్లు ప్రారంభమయ్యేనా?

ఆయా కాలేజీలన్నింటిలోనూ యాజమాన్య ప్రతిపాదిత ఫీజును అమలు చేయాల్సిన పరిస్థితి వస్తే సాధారణ కాలేజీల్లోనూ భారీగా ఫీజుల పెంపును అమలు చేయాల్సి వస్తుంది. టీఏఎఫ్ఆర్‌సీకి చైర్మన్ నియామకం తర్వాత కొత్త ఫీజులను ఖరారు చేశాక మిగులు ఫీజులను సర్దుబాటు చేయాలని పేర్కొన్నప్పటికీ ముందుగా ప్రతిపాదిత ఫీజును చూసి విద్యార్థులు ఆందోళనలో పడే ప్రమాదం నెలకొంది. ఇప్పటికే ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను ప్రవేశాల కమిటీ ప్రారంభించింది. ఈ నెల 27వ తేదీ నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్లను ప్రారంభించాలని నిర్ణయించింది. కోర్టు ఉత్తర్వులు కాపీ అందనప్పుడు, అప్పీల్‌కు వెళ్లనపుడు 27వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్లను ప్రారంభిస్తారా? లేదా? అనేది గందరగోళంగా మారింది. వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తే మాత్రం కచ్చితంగా కాలేజీల వారీగా ఫీజులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. 27వ తేదీలోగా ఉత్తర్వులు అందితే అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉంది. లేదంటే వెబ్ ఆప్షన్ల ప్రక్రియను వాయిదా వేసి, కోర్టు ఉత్తర్వుల కాపీ అందాకే అప్పీల్‌కు వెళ్లాలని, ఆ తరువాతే వెబ్ ఆప్షన్లను ప్రారంభించాలని భావిస్తున్నట్లు ఉన్నత విద్యా మండలి అధికారులు పేర్కొంటున్నారు.

# 'హుజూర్‌నగర్' తర్వాతే?

▶ మొదటి పేజీ తరువాయి

మార్పులుంటాయని చెప్పడం గమనార్హం.

**ఎన్నికలకు ముందు ఎందుకు..?**

రాష్ట్రంలో గత ఏడాది డిసెంబర్ నుంచి జరుగుతున్న అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలవుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 19 స్థానాలు, లోక్‌సభ ఎన్నికల్లో 3 స్థానాలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల ఎన్నికల్లో 20–25 శాతం స్థానాలు మాత్రమే గెలుచుకున్న ఆ పార్టీకి త్వరలోనే జరుగుతాయని భావిస్తున్న మున్సిపల్ ఎన్నికలు కీలకం కానున్నాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో విజయంతో బీజేపీ దూకుడు మీద ఉండటం, 32 జిల్లా పరిషత్‌ల్లో ఒక్క స్థానాన్ని కూడా కాంగ్రెస్ గెలుచుకోకపోవడంతో మున్సిపల్ ఎన్నికల్లో కంటితుడుపు విజయమైనా ఆ పార్టీకి అనివార్యం కానుంది. కనీసం జిల్లాకు ఒకటో, రెండో మున్సిపాలిటీల్లోనైనా గెలవకపోతే పట్టణ ప్రాంతాల్లో ఘోరంగా దెబ్బతినే అవకాశముంది. దీంతో మున్సిపల్ ఎన్నికలపై కసరత్తును కాంగ్రెస్ అప్పుడే ప్రారంభించింది కూడా. ఇక, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్ అసెంబ్లీకి ఆరు నెలల్లో ఏ క్షణంలోనైనా ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ గెలుపోటములు కూడా కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు టీపీసీసీ అధ్యక్షుడి మార్పు ప్రక్రియ జరిగితే సమన్వయం దెబ్బతింటుందని, ఈ రెండు ఎన్నికల తర్వాతే అధ్యక్షుడిని మారిస్తే బాగుంటుందని చాలా మంది నేతలు సూచిస్తున్నారు. ఇదే విషయాన్ని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి కూడా సోమవారం విలేకరులతో మాట్లాడుతూ చెప్పడం గమనార్హం.

**పెరుగుతున్న జాబితా..**

ఇక టీపీసీసీ అధ్యక్ష పదవి ఆశిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండటం ఆసక్తి కలిగిస్తోంది. రేవంత్ రెడ్డి, శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, విజయశాంతి, దామోదర రాజనర్సింహ, సంపత్ పేర్లు రేసులో వినిపిస్తుండగా ఇప్పుడు జగ్గారెడ్డి కూడా ఆ జాబితాలో చేరారు. నిన్నటివరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కావాలని అడిగిన జగ్గారెడ్డి ఆదివారం కుంతియాను కలిసి తనకు కూడా టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు. దీనికి తోడు అధ్యక్ష పదవి ఇస్తే పార్టీని అధికారంలోకి తెచ్చే మెడిసిన్ తన వద్ద ఉందని ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు కూడా చేశారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడి మార్పు ఉంటే జూలైలో ఉంటుందని, లేదంటే మరో ఏడాది కూడా ఉత్తమే అధ్యక్షుడిగా ఉంటారనే చర్చ పార్టీలో జరుగుతోంది.

### పీసీసీ చీఫ్‌గా ఉత్తమ్ కొనసాగుతారు: కుంతియా

పీసీసీ చీఫ్‌గా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కొనసాగుతారని ఏఐసీసీ ఇంచార్జీ కుంతియా స్పష్టం చేశారు. కొత్త అధ్యక్షుని నియామకంపై సమావేశంలో ఎలాంటి చర్చ జరగలేదని ఆయన అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. 'రాజగోపాల్ రెడ్డికి పార్టీ చాలా గౌరవం ఇచ్చింది. కానీ ఆయన ఎందుకు అలా చేస్తున్నారో తెలియడం లేదు. అతని మీద క్రమశిక్షణ కమిటీ చర్యలు తీసుకుంటుంది. ఎవరు క్రమశిక్షణ తప్పినా ఉపేక్షించేది లేదు' అని హెచ్చరించారు. రాహుల్‌గాంధీ ఏఐసీసీ అధ్యక్షునిగా కొనసాగాలని, ఆయన మంచి ఫైటర్ అన్న విషయం మొన్నటి ఎన్నికల్లో తేలిందన్నారు.

## 29న సాగర్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం

రాష్ట్ర కాంగ్రెస్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఈ నెల 29న నాగార్జున సాగర్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతుందని కుంతియా తెలిపారు. ఈ ఎన్నికల వ్యూహరచన కోసం పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో కమిటీ వేసినట్లు వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ 34 శాతానికి పెంచాలని కుంతియా డిమాండ్ చేశారు. ఇకపై ప్రతి నెల 1, 2, 3 తేదీల్లో మండల, జిల్లా, బ్లాక్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తామని, జూలై మొదటివారంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీలతో భేటీ ఉంటుందన్నారు. పార్టీ ఓటమిపై క్షేత్రస్థాయి నివేదికలు తెప్పించుకుని బలోపేతానికి కృషి చేస్తామని వివరించారు.

# ఓరుగల్లు జిల్లాల పునర్వ్యవస్థీకరణ

- వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల కూర్పు, పేర్లలో మార్పు
- ప్రజా విజ్ఞప్తుల నేపథ్యంలో సీఎం కేసీఆర్ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఓరుగల్లు జిల్లాల నామస్వరూపాలు మారనున్నాయి. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల కూర్పు, పేర్లను త్వరలో రాష్ట్ర ప్రభుత్వం మార్చబోతోంది. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ రెండు జిల్లాలను మళ్లీ పునర్వ్యవస్థీకరించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పరిపాలనా సౌలభ్యం, ప్రభుత్వ కార్యక్రమాలు సక్రమంగా, వేగంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2016 అక్టోబర్ 11న జిల్లాల పునర్వ్యవస్థీకరణ నిర్వహించి వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలతో సహా రాష్ట్రంలో 21 కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రంలోని మొత్తం జిల్లాల సంఖ్య 10 నుంచి 31కు పెరిగింది. ఇటీవల కొత్తగా ములుగు, నారాయణపేట జిల్లాలను ఏర్పాటు చేయడంతో మొత్తం జిల్లాల సంఖ్య 33కు చేరింది. అయితే స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలను మళ్లీ పునర్విభజించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. వరంగల్ తూర్పు, నర్సంపేట, పరకాల, వర్ధన్నపేట ప్రజలు తమకు వరంగల్ రాజధానిగా ఉండాలని కోరుకుంటున్నారు. వరంగల్ రూరల్ జిల్లా ప్రజలందరికీ వరంగల్ నగరంతోనే సంబంధాలున్నాయి. చదువులు, వ్యాపారాలు, వైద్యం, ఇతర అవసరాల కోసం వారు నిత్యం వరంగల్ వస్తుంటారు. వరంగల్ రాజధానిగానే చాలా ఏళ్లపాటు జీవనం సాగింది. ఇది ఇలాగే కొనసాగాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. వరంగల్‌లోనే రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, ఎంజీఎం ఆస్పత్రి, కేఎంసీ, ఎనుమాముల మార్కెట్ ఉన్నాయి. విమానాశ్రయం కూడా పునరుద్ధరణ జరిగే అవకాశం ఉంది. కాబట్టి వరంగల్ రూరల్ జిల్లాకు వరంగల్‌ను రాజధానిగా చేయాలనే డిమాండ్ స్థానికంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని కూడా వరంగల్ రూరల్ జిల్లాలో కలిపి వరంగల్ జిల్లాను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పేరుకు వరంగల్ అయినప్పటికీ వరంగల్‌లో ఒక్క ప్రభుత్వ కార్యాలయమూ లేకపోవడం వల్ల ఇక్కడ అభివృద్ధి కుంటుపడుతున్నది. కాకతీయల కాలం నుంచి వరంగల్ రాజధానిగా వెలుగొందింది. కాబట్టి వరంగల్ రాజధానిగా ఒక జిల్లా ఉండటం సముచితమని ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చింది. వరంగల్ తూర్పు నియోజకవర్గం అభివృద్ధి, వరంగల్–హన్మకొండ నగరాలకున్న ప్రాధాన్యత, ప్రజల సౌకర్యార్థం, ప్రజాభీష్టం మేరకు వరంగల్, హన్మకొండ జిల్లాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఉత్తర్వులు జారీ కానున్నాయి. వరంగల్ జిల్లా కార్యాలయాలన్నీ వరంగల్ తూర్పు నియోజకవర్గంలోనే ఏర్పాటు కానున్నాయి.

**హన్మకొండ జిల్లాగా వరంగల్ అర్బన్...**

వరంగల్ అర్బన్ జిల్లాను హన్మకొండ జిల్లాగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వరంగల్ మాదిరిగానే హన్మకొండకు కూడా చారిత్రక ప్రాధాన్యం ఉంది. హన్మకొండ నగరం కాకతీయుల తొలి రాజధాని. కానీ నేడు హన్మకొండ పేరే కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందని స్థానికుల్లో ఆందోళన నెలకొంది. హన్మకొండకు ఉన్న చారిత్రక ప్రాధాన్యత దృష్ట్యా హన్మకొండ కూడా ఒక జిల్లాగా ఉండాలని, వరంగల్ అర్బన్ జిల్లాను హన్మకొండ రాజధానిగా ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. వరంగల్ కేంద్రంగా ఏర్పడే జిల్లాకు వరంగల్ పేరును, హన్మకొండ కేంద్రంగా ఏర్పడే జిల్లాకు హన్మకొండ పేరును పెట్టాలని కోరారు. దీనివల్ల వరంగల్, హన్మకొండ నగరాలకున్న ప్రాధాన్యత, చారిత్రక గుర్తింపును పునరుద్ధరించినట్లు అవుతుందని భావించి సీఎం కేసీఆర్ సైతం సానుకూలంగా స్పందించారు. రెండు చోట్లా ప్రభుత్వ కార్యాలయాలు రావడం వల్ల నగరం నాలుగు దిక్కులా అభివృద్ధి చెందుతుందని, వరంగల్ నగరానికి వచ్చే వలసలు కూడా అన్ని ప్రాంతాలకు విస్తరిస్తాయని ముఖ్యమంత్రి భావిస్తున్నట్లు తెలిసింది.

### యథాతథంగా జీవీఎంసీ!

వరంగల్, హన్మకొండ జిల్లాలను ఏర్పాటు చేసినప్పటికీ వరంగల్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)ను మాత్రం యథాతథంగా అదే పేరుతో కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) ప్రస్తుతం 5 జిల్లాల్లో విస్తరించింది. ఢిల్లీ, ముంబై, చెన్నై లాంటి నగరాలు సైతం అనేక జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. వరంగల్ నగరం పరిధిలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. కాబట్టి వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎన్ని జిల్లాలు వచ్చినా నష్టం లేదనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చింది.

# పాలకులం కాదు.. సేవకులం

**జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశా నిర్దేశం**

సాక్షి, అమరావతి: 'మనం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం. ప్రజల ఆకాంక్షల మేరకు పని చేయాలి'అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. నవరత్నాల పథకాలు, మేనిఫెస్టోనే తమ ప్రభుత్వానికి జీవనాడి అని ఆయన స్పష్టం చేశారు. సాచ్యురేషన్ (సంతృప్తికర) విధానంలో అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అంది తీరాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలులో పార్టీలు, రాజకీయాలు చూడొద్దని, తమ పార్టీ ఎమ్మెల్యేలు చెప్పినాసరే వినొద్దని కలెక్టర్లకు తేల్చి చెప్పారు. అదే సమయంలో ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి ఎమ్మెల్యేల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఉగాది నాటికి రాష్ట్రంలో ఇంటి స్థలాలు లేని పేదలు ఉండకూడదని లక్ష్యాన్ని నిర్దేశించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో సోమవారం రెండు రోజుల ప్రారంభ సదస్సులో వారినుద్దేశించి మాట్లాడారు.

**మాట నిలబెట్టుకుందాం**

'మన మేనిఫెస్టోను కేవలం రెండు పేజీల్లో క్లుప్తంగా ఇచ్చాం. నవరత్నాల పథకాలు, మేనిఫెస్టో కాపీలు ప్రతి కలెక్టర్, హెచ్‌వోడీ, సెక్రటరీ, మంత్రుల వద్ద ఉండాలి. మేనిఫెస్టోను అమలు చేస్తామని నమ్మి ప్రజలు ఈ ప్రభుత్వానికి ఓటేశారు. అందరం కలసికట్టుగా పనిచేసి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందాం.

**ఇక్కడి నుంచే అక్రమ నిర్మాణాల కూల్చివేత**

ఇవాళ వ్యవస్థ ఏ స్థాయికి దిగజారిపోయిందో మనం చూడాలి. మనం ఇక్కడ 'ప్రజావేదిక'లో సమావేశమయ్యాం. ఈ సమావేశం జరుగుతున్న ఈ హాల్లో ఇంత మంది కలెక్టర్లు, కార్యదర్శులు, హెచ్‌వోడీలు, మంత్రులు, సాక్షాత్తు సీఎం ఇక్కడే కూర్చున్నారు. ఈ భవనం లీగల్‌గా, చట్టపరంగా సరైనదేనా? అంటే కాదు. నిబంధనలకు విరుద్ధంగా చట్టానికి వ్యతిరేకంగా అవినీతితో కట్టిన భవనం ఇది. అలాంటి ఒక అక్రమ నిర్మాణంలో మనం సమావేశం పెట్టుకున్నాం. నది వరద మట్టం స్థాయి 24 మీటర్లు. కానీ ఈ బిల్డింగ్ ప్రస్తుతం ఉన్న స్థాయి 19 మీటర్లు. గ్రీవెన్స్ హాల్ ఇక్కడ కట్టొద్దని కృష్ణా సెంట్రల్ డివిజన్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు గత ప్రభుత్వానికి లేఖ ఇచ్చారు. నదీ పరిరక్షణ చట్టం పట్టించుకోలేదు. లోకాయుక్త సిఫార్సులు కూడా పట్టించుకోలేదు. చివరికి దీని నిర్మాణంలో కూడా అవినీతే. భవనం నిర్మాణ వ్యయం అంచనాలు కూడా రూ.5 కోట్ల నుంచి రూ.8.90 కోట్లకు పెంచారు. ఇది చూపించడానికే, మన ప్రవర్తన ఎలా ఉండాలి అని ఆత్మపరిశీలన చేసుకోడానికే ఇక్కడ మీటింగ్ పెట్టండని చెప్పాను. ఒక అక్రమ నిర్మాణంలో కూర్చొని పర్యావరణ చట్టాలు, గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాలు, నదీ పరిరక్షణ చట్టాలు. ..అన్నీ కూడా ప్రభుత్వమే దగ్గరుండీ బేఖాతర్ చేయాల్సిన పరిస్థితి. ఎవరైనా చిన్నవాళ్లు ఇదే పనిచేసి ఉంటే మనం ఏం చేసేవాళ్లం? ఎందుకు అక్రమ నిర్మాణం చేపట్టారని అడిగేవాళ్లం. ఆ అక్రమ నిర్మాణాన్ని తొలగించే వాళ్లం. కానీ మనమే సీఎం స్థాయిలో ఉండీ, రూల్స్‌ను నిబంధనలను ఉల్లంఘిస్తున్నాం. మనం సరైన మార్గంలో ఉన్నామా అని ప్రతి ఒక్కరూ అంతరాత్మను ప్రశ్నించుకోవాలి. ఇందుకోసమే నాతో సహా అందర్నీ ఇక్కడకు రమ్మన్నాను. ఈ హాలు నుంచే మనం ఆదేశాలు ఇస్తున్నాం. ఈ హాలులో ఇదే చివరి మీటింగ్ అని చెబుతున్నా. రేపు జిల్లా ఎస్పీలతో సమావేశం తర్వాత రాష్ట్రంలో మొదటి అక్రమ కట్టడం కూల్చివేత ఇక్కడి నుంచే ప్రారంభం కావాలి' అని అన్నారు.

# మున్సి'పోల్స్'కు ముందడుగు

▶ మొదటి పేజీ తరువాయి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను గుర్తించేలా మార్కింగ్ చేసి జూలై 19వ తేదీన మున్సిపాలిటీల్లో ఓటర్ల తుది జాబితాను ప్రకటించనున్నారు. ఓటర్ల జాబితా అందుబాటులోకి రాగానే వార్డులు, మేయర్/చైర్‌పర్సన్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు.

**జూలైలోనే ఎన్నికలు..?**

కొత్త పురపాలక చట్టం తీసుకొచ్చిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ యాక్ట్ డ్రాఫ్ట్ కాపీని న్యాయశాఖకు పంపించింది. అయితే చట్టం తీసుకురావడంలో జాప్యం జరుగుతుండటంతో నిర్ణీత గడువులోగా ఎన్నికలు నిర్వహించలేమని ఇటీవల పురపాలకశాఖ హైకోర్టులో దాఖలు చేసిన కౌంటర్‌లో స్పష్టం చేసింది. పాలకవర్గాల కాలపరిమితి ముగుస్తున్నా ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలేదని రాష్ట్ర ఎన్నికల సంఘం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటు చేసినందున సకాలంలో ఎన్నికలు నిర్వహించలేమని, వార్డుల విభజన, ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల ఖరారుకు 151 రోజుల సమయం పడుతుందని, అందువల్ల ఎన్నికలకు వ్యవధి కావాలని ప్రభుత్వం కోరింది. అయితే అదేరోజు సీఎం కేసీఆర్ జూలై లో పురపోరు జరుగుతుందని, ఈ మేరకు రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను చేపట్టాలని పురపాలకశాఖ కార్యదర్శిని ఆదేశించినట్లు ప్రకటించారు. దీంతో ఎన్నికల నిర్వహణపై కొంత సందిగ్ధత కనిపించింది. ఒకవైపు దాదాపు ఐదు నెలలు కావాలని కోర్టులో కౌంటర్ దాఖలు చేస్తూనే మరోవైపు ఎన్నికలకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఒకింత అయోమయం నెలకొంది. అయి తే తాజాగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపునకు చకచకా షెడ్యూల్ ప్రకటించడం, ఇది వచ్చే నెల మూడో వారంలోగా ముగియనుండటంతో సీఎం మదిలో ఉన్నట్లు జూలై చివ ర్లో లేదా ఆగస్టు మొదటి వారంలో పురపోరుకు నగారా మోగే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల నిర్వహణకు ముందస్తు కసరత్తుకు ఐదు నెలల టైమ్‌లైన్ అవసరమని భావించినా ఓటర్ల గుర్తింపు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం, వార్డుల విభజనను ఏకకాలంలో పూర్తి చేసుకోవడం ద్వారా సమయం తగ్గించవచ్చని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. అదే సమయంలో రాజ్యాంగబద్ధంగా కొన్నింటికి మాత్రం గడువు కచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టం చేస్తున్నాయి. అయితే వార్డుల విభజన ప్రక్రియను అంతర్గతంగా పూర్తి చేయడంతో ఓటర్ల గణనను సర్కారు యుద్ధప్రాతిపదికన చేస్తోంది. ఆర్డినెన్స్ ద్వారా చట్టం తీసుకురావడమే తరువాయి రిజర్వేషన్లను ఖరారు చేయనుంది.

### జూలై 2న ముగియనున్న గడువు...

ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం జూలై 2వ తేదీతో ముగియనుంది. జీహెచ్ఎంసీ, గ్రేటర్ వరంగల్, సిద్దిపేట, ఖమ్మం, అచ్చంపేట మినహా మిగతా 53 మున్సిపాలిటీలు, మూడు నగర పాలక సంస్థల కాలపరిమితికి ఆ రోజు తెరపడనుంది. అయితే వేగంగా జరుగుతున్న పట్టణీకరణతో 68 కొత్త పురపాలికలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తాజాగా వాటికి కూడా పాలకవర్గాలను ఎన్నుకోవాల్సివుంది. అయితే జడ్చర్ల గ్రామ పంచాయతీని బాదేపల్లి మున్సిపాలిటీలో విలీనం చేయడం, నకిరేకల్‌కు వచ్చే ఏడాది చివరి వరకు కాలపరిమితి ఉండటంతో వాటికి మినహా మిగతా వాటికి ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉంది. గ్రేటర్ హైదరాబాద్, గ్రేటర్ వరంగల్, ఖమ్మం, సిద్దిపేట, అచ్చంపేట మున్సిపాలిటీలకు మాత్రం మరో రెండేళ్ల హయాం మిగిలి ఉంది.

**ఇదండీ సంగతి**



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మీ అన్న సీఎం అవుతారు.. మీ సోదరుడెవరన్నా టీఆర్ఎస్‌లో కూడా చేరితే బావుండు సార్!

# ఆయిల్‌ఫాం సాగుకు 2.78 లక్షల హెక్టార్లు అనువు

### ఉద్యాన శాఖకు నివేదించిన ఐఐఓపీఆర్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని 18 జిల్లాల పరిధిలోని 2.78 లక్షల హెక్టార్లు ఆయిల్‌ఫాం సాగుకు అత్యంత అనువైనవని భారత ఆయిల్‌ఫాం పరిశోధన కేంద్రం (ఐఐఓపీఆర్) సోమవారం ఉద్యాన శాఖ డైరెక్టర్‌కు నివేదిక అందజేసింది. రాష్ట్రంలో ఆయిల్‌ఫాం సాగు అవకాశాలపై అధ్యయనం చేసేందుకు ఐఐఓపీఆర్, ఆయిల్ ఫెడ్ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ ఈ ఏడాది ఏప్రిల్ 18న కడెంలోని ఆయిల్‌ఫాంను సందర్శించడంతో పాటు, పలు అంశాలపై అధ్యయనం చేసింది. ప్రస్తుతం కామారెడ్డి జిల్లా బొప్పాసపల్లిలో రెండు ఎకరాల్లో పామాయిల్ పంటను సాగు చేస్తున్నారు. ఈ క్షేత్రంలో సాగు విస్తీర్ణం పెంచేందుకు 26 ఎకరాలు కేటాయించాలని, సూక్ష్మ నీటి సేద్యం, నీటి కుంట ఏర్పాటు చేయాలని ఐఐఓపీఆర్ సూచించింది. దీంతో పాటు నిర్మల్ జిల్లా కడెం విత్తనోత్పత్తి క్షేత్రంలో పామాయిల్ ప్రదర్శన క్షేత్రం ఏర్పాటు చేసి, రైతులకు శిక్షణ ఇవ్వాలని నివేదికలో సూచించింది.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED IMMEDIATELY
A Leading MNC Two/ Four wheeler spare parts Production, ISO, Electrical / Electronics, Software / Hardware, Garments Textiles (P) Ltd. Co. Needs Male/ Female candidates Fresh / Exps. Age: 18 to 40.
QUALIFICATION All B.Tech, All Degree (UG/PG), All Diploma, All ITI, 5 to Intermediate (Results waiters can also apply) (All back class also apply)
JOB HR-Manager, Administrate, All Engineer, Production, QC Supervisor, Programmer, Designer, Accountant, System Operator, BPO, Call Center, Office Staff, All Technician, CNC Operator, Export Job.
SALARY Rs. 15,000 to Rs. 35,000 (Room, Mess, ESI, PF available)
WORKING PLACE Hyderabad, Chennai, Bangalore, Coimbatore
Apply to : By E-mail, Courier, Postal. | Apply within 7 days
SRM INDUSTRIAL - HR
Kalliappa Complex, Veerapandi Pirivu, Jothipuram (po), Coimbatore Dt. Pin - 641 047, Tamilnadu.
Email : srmindustrial72@gmail.com

DUBAI KUWAIT
MNC Company
CV Selection 29&30 June 2019@Vijayawada
Client Interview 29&30 June 2019@Vijayawada
Employment Visa within 7 Days
WAITERS, COOK
SUPERVISOR (WERE HOUSE)
STORE KEEPERS
BIKE DRIVERS (FOOD DELIVERY)
FOUR WHEELER DRIVERS
GENERAL HELPERS (120KD)
ELECTRICIANS (140-180 KD)
PLUMBERS (140-180KD)
AC TECHNICIANS (150-180 KD)
DIESEL MECHANIC (140-200 KD)
PAINTERS (130-150 KD)
LIFT MECHANIC (140-250KD)
CARPENTERS (130-160KD)
SUPERVISORS (220KD)
MASONS (130-160KD)
DHISA CAREERS
Cell : 9030 133 133, 7386 490 496, 79953 96778, 90105 92898
#31-23-1/1, 2nd Floor, Beside BSNL Office, Opp. Bharath Petrol Bunk, Eluru Road, Vijayawada
Accommadation + Medical + Transport + OT
AGE LIMIT 22-42
CV, Experience Certificate, Academics, Original Passport + Passport size Photos.
Licence No: AP-06-084-18-0511673

Applications are invited for the following positions for our client
VIT-AP University
Amaravati, AP
1. Resident Doctor (Job Code-RDR): MBBS from any recognized University with Registration from State Medical Council.
2. Clinical Psychologist (Job Code-CPS): M.Sc., Clinical Psychology,2+ yrs. exp in Clinical Psychology
3. Resident Nursing Assistant – Male & Female (Job Code-RNA): Diploma in Nursing or B.Sc. (Nursing), 2+ yrs exp
4. Librarian (Job Code-LIB): Ph.D in Library Sciences,6+yrs exp in a University
5. Library Assistant (Job Code-LAT): Diploma/ Bachelor degree in Library Sciences, 5+ yrs. exp.
6. Purchase Executive (Job Code-PEE): Diploma/MBA, 3+ yrs. exp.
7. Accountant (JobCode-ACT): B.Com / M.Com, 5+yrs experience in a college. Working knowledge in Tally essential
8. Lab Technician- Physics (Job Code-PLT): M.Sc. (Physics), 2+ yrs. exp in a college.
9. Lab Technician – Chemistry (Job Code-CLT): M.Sc. (Chemistry), 2+ yrs. exp in a college.
10. Hostel Resident Supervisor – Men's Hostel (Job Code-RSH): Work experience as warden/supervisor in a college. Ability to speak in Telugu, English and Hindi. Ex-servicemen preferred.
E-mail your detailed resume within 7 days to ahsguntur@gmail.com
Manager - HR, Amaravati HR Services, Guntur, AP

BHASKAR AGRO CHEMICALS LIMITED
Factory :94/1, Toophranpet Village, Choutuppal (M), Yadadri Bhuvangiri Dist.T.S 508252
Off. : 503, Riviera Apartment, 6-3-347/9, Dwarakapuri Colony, Panjagutta, Hyderabad-500 082
Executive Assistant : Diploma or relevant work exp., Excellent communication skills, Correspondence, MS Office.
Accountant : B.Com with Min 3-5 yrs exp. with Tally, GST, TDS, Book Keeping , Day to Day Accounts , Liasion with statutory department.
Accounts Officer : B.Com with Min 1-2 yrs. exp. with computer knowledge MS Office, Tally.
Office Assistant : Data Entry cum Office Assistant with experience in Word, Excel etc.
Trainee : Diploma/ITI Minimum 1-2 years experience in manufacturing industry.
Note : Positions are for both Office and Factory
Salary is negotiable for deserving candidates. Please send your resume to careers@bhaskaragro.com or post to our office address

WALK-IN INTERVIEWS
Covalent Laboratories Private Limited, A leading Bulk drug Manufacturing Industry requires the following candidates.
Production Chemist : The candidate should have B.Sc/M.Sc with 2 to 5 years experience in reputed chemical/Bulk Drug Industry.
Chemical Plant Operators: The candidate should have S.S.C and above with 2 to 5 years Experience in a reputed chemical/Bulk Drug Industry.
Chemical Engineers: The candidate should have B.Tech / Diploma (Chemistry) with 2 to 5 years Experience in solvent Recovery in a reputed chemical/Bulk Drug Industry.
R & D: The candidate should have M.Sc(Chemistry) with 1st class with 2 to 5 years Experience in a similar field in a reputed Chemical/Bulk Drug Industry.
QC/QA/RA Chemist : The candidate should have M.Sc(Chemistry) with 2 to 5 years Experience in a similar field in a reputed Chemical/Bulk Drug industry.
Male candidates are preferable (Need to work in shifts).
Note: Fresh SSC Passed and above can be taken as a Tr. Chemical Plant Operator and Freshers are eligible to attend interview for the said posts.
Walk-in-interview on 30-06-2019 (Sunday)
from 10.00 AM to 02.00 PM at the following address please bring updated Resume along with Original Certificates, set of Photo Copy's, Latest Pay slips & Photographs(2).
Candidates for QA/QC/R&D and whoever fails to attend walk in interview may please send their latest CV to below E-mail ID. E-mail: hr@covalentlab.com
Work Location & Interview Venue:
COVALENT LABORATORIES PVT LTD,
Gundla Machanoor (Village), Hathnoora (Mandal), Sangareddy (Dist) - 502 296, Telangana-India. PH:040-49483252/56.

VIRCHOWS Walk-in-interview
VIRCHOW PETROCHEMICAL PVT LTD., A leading Bulk Drug Manufacturing Industry requires the following Candidates:
1. Production Assistant Manager: The candidate should have B.Sc/M.Sc with 10 to 15 years experience in a reputed chemical / bulk drug industry. Preferable in Cephalosporin's
2. Production Chemist: The candidate should have B.Sc/M.Sc with 2 to 5 years experience in a reputed chemical / bulk drug industry. Preferable in Cephalosporin's
3. Production Operator: The candidate should have SSC & above with 2 to 5 years experience in a reputed chemical / bulk drug industry.
4. Chemical Engineer: The candidate should have B.Tech (Chem.)/Diploma with 2 to 5 years experience Solvent recovery in a reputed chemical / bulk drug industry.
5. R&D Chemist: The candidate should have M.Sc (Organic Chemistry) with 2 to 5 years experience in a similar field in a reputed API Units.
6. Q.C.Chemist: The candidate should have M.Sc (Chemistry) with 2 to 5 years experience in a similar field in a reputed chemical/bulk drug industry.
7. Fitter : The candidate should have ITI with 2 to 5 years experience in a similar field in a reputed chemical/bulk drug industry.
Work Location: Unit - II Jadcherla, Mahabubnagar Dist.
Only Male candidates are eligible
Freshers having good academic background are also eligible to attend interview for the said posts.
Walk-in-interview on 29.06.2019 from 1:00 PM onwards. at the following Address Please bring Bio-data along with Original Certificates and set of Xerox copies, Latest Pay Slip
GENERAL MANAGER
VIRCHOW PETROCHEMICAL PVT LTD
PLOT NO.17A,PHASE-1,IDA PATANCHERU, SANGAREDDY DIST. PH:08455-240092,244898
E-Mail: Vpcpl@virchows.com

# విత్తన ఎగుమతికి అవకాశాలు

- 'విత్తనోత్పత్తి' వర్క్‌షాప్‌లో అసెంబ్లీ స్పీకర్ పోచారం
- అధిక విత్తనోత్పత్తికి రాష్ట్రంలో అనుకూల వాతావరణం: గుత్తా
- విత్తన వ్యాపారంలో భారత్ వాటా 4.4 శాతమే: పార్థసారథి




'విత్తనోత్పత్తి' వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో గుత్తా సుఖేందర్‌రెడ్డి, పార్థసారథి తదితరులు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ నుంచి ఆఫ్రికా, దక్షిణాసియా దేశాలకు నాణ్యమైన విత్తనాల ఎగుమతికి విస్తృత అవకాశాలున్నాయని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో జరిగిన విత్తనోత్పత్తి, నాణ్యత, మార్కెటింగ్ వర్క్‌షాప్‌ను.. రాష్ట్ర రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. విత్తన ఎగుమతులతో రాష్ట్ర రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని పోచారం వెల్లడించారు. సరిహద్దులతో సంబంధం లేకుండా విత్తన ఎగుమతులు, మార్కెటింగ్‌కు అన్ని దేశాలు అంగీకరించాలని రైతు సమన్వయ సమితి రాష్ట్ర కో ఆర్డినేటర్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో అధిక విత్తనోత్పత్తికి అత్యంత అనుకూల వాతావరణం ఉందన్నారు.

**దక్షిణాసియా దేశాలకు ఎగుమతి చేసే చాన్స్: పార్థసారథి**

వివిధ దేశాల సాగు పరిస్థితులు, పంటల తీరును ఆకళింపు చేసుకుని విత్తనోత్పత్తి చేయాలని.. భారత్, ఆఫ్రికా, ఇతర దక్షిణాసియా దేశాల్లో ఒకే రకమైన పంటలు సాగులో ఉన్న విషయాన్ని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారథి ప్రస్తావించారు. ఆయా దేశాల్లో తెలంగాణ విత్తనాలకు మంచి మార్కెట్ ఉందని, ప్రపంచ విత్తన వ్యాపారంలో భారత్ కేవలం 4.4 శాతం వాటాను మాత్రమే కలిగి ఉందన్నారు. ఈ వాటాను పది శాతం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని వెల్లడించారు. గత రెండేళ్లలో ఓఈసీడీ ద్వారా విత్తన ధ్రువీకరణ పొంది, ఎగుమతులు చేసిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. ఫిలిప్పీన్స్, సూడాన్, ఈజిప్ట్ దేశాలకు రాష్ట్రం నుంచి విత్తనాలు ఎగుమతి అవుతున్నాయన్నారు. దక్షిణాసియా దేశాలైన మయన్మార్, థాయ్‌లాండ్, పాకిస్తాన్, నేపాల్, భూటాన్, శ్రీలంక దేశాల్లో సాగయ్యే పత్తి విత్తనాలు.. తెలంగాణ నుంచి ఎగుమతి చేసే వీలుందని పార్థసారథి తెలిపారు. ప్రపంచ విత్తన పరిశ్రమ వృద్ధిరేటు 7 శాతం కాగా, భారత్‌లో ఇది 17 శాతంగా ఉందని.. 2027 నాటికి జనాభా పెరుగుదలతో చైనాను భారత్ మించుతున్న నేపథ్యంలో ఆహార భద్రత కోసం విత్తనోత్పత్తి పెరగాల్సిన అవసరముందని సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ కేశవులు, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు, ఇస్టా అధ్యక్షుడు క్రెయిగ్ మాక్‌గిల్, ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ ప్రతినిధి చికెలు బా, ఆఫ్రికాలోని వివిధ దేశాల నుంచి 35 మంది ప్రభుత్వ, ప్రైవేటు రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడు, రేపు సీపీఐ ప్రాజెక్టుల బాట

### గోదావరి ప్రాజెక్టులను పరిశీలించనున్న పార్టీ ప్రతినిధుల బృందం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో చేపడుతున్న నీటిపారుదల ప్రాజెక్టు పనుల క్షేత్రస్థాయి పరిశీలన నిమిత్తం మంగళ, బుధవారాల్లో సీపీఐ ప్రతినిధి బృందం ప్రాజెక్టుల బాట చేపట్టనుంది. ఈ పర్యటనను మంగళవారం (25న) ఉదయం కన్నెపల్లి పంపుహౌస్ (మేడిగడ్డ) నుంచి ప్రారంభించి, సుందిళ్ల పంపుహౌస్ (అన్నారం బ్యారేజీ), సుందిళ్ల బ్యారేజీ (రామగుండం పంపుహౌస్) ఎల్లంపల్లి రిజర్వాయర్‌ను సందర్శించి రాత్రికి కరీంనగర్‌లో బసచేస్తుంది. ఇక బుధవారం ఉదయం మిడ్‌మానేరు రిజర్వాయర్, అనంతగిరి పంపుహౌస్, మల్లన్నసాగర్ రిజర్వాయర్, కొండపోచమ్మ రిజర్వాయర్లను సందర్శించి.. అనంతరం హైదరాబాద్‌కు చేరుకుంటుంది. బృందంలో చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, గుండా మల్లేశ్, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, పశ్య పద్మ, ఎన్.బాలమల్లేశ్, కె.శ్రీనివాసరెడ్డి సభ్యులుగా ఉన్నారు. తెలంగాణ సాధనకు ప్రత్యేక భూమికగా నిలిచిన నీళ్లు, నిధులు, నియామకాలు ఎంతవరకు వచ్చాయి? వాటి వాస్తవ పరిస్థితులు, టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపడుతున్న ప్రాజెక్టులు రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలకు ఉపయోగపడతాయా.. లేదా తెలుసుకునేందుకు దీన్ని చేపడుతున్నట్లు సీపీఐ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి 'సాక్షి'కి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న విధంగా ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుందా? వాటి వల్ల ఒనగూరే ప్రయోజనాలు ఏమిటీ? ప్రాజెక్టుల రీడిజైన్ వల్ల ఆశించిన ప్రయోజనం నెరవేరిందా? అన్న అంశాలను పరిశీలిస్తామన్నారు. తెలంగాణ సాగు, తాగు నీటి అవసరాలకు గోదావరి జలాలే శరణ్యమని 40 ఏళ్ల క్రితమే అసెంబ్లీలో, బయటా సీపీఐ తన వాణి వినిపించిందని తెలిపారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గోదావరి జలాల వినియోగానికి ప్రయత్నించిందన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో మేడిగడ్డ రిజర్వాయర్, కాళేశ్వరం ప్రాజెక్టు కింద సిద్ధమవుతున్న ప్యాకేజీల్లో సాగుతున్న పనులు, ఇతరత్రా అంశాల పరిశీలనకు పర్యటనను చేపడుతున్నట్టు తెలిపారు.

# ఆ పిల్లల్ని కలవనివ్వొద్దు

### పెంపుడు తల్లుల అనుబంధ పిటిషన్లను తోసిపుచ్చిన హైకోర్టు



**సాక్షి, హైదరాబాద్:** వ్యభిచార కూపం నుంచి విముక్తి లభించి సంరక్షణ గృహాల్లో ఉన్న బాలికలను పెంపుడు తల్లులు కలుసుకునేందుకు హైకోర్టు అనుమతి ఇవ్వలేదు. యాదాద్రిలోని వ్యభిచార గృహాలపై దాడుల సందర్భంగా దొరికిన పిల్లలను రక్షిత గృహాల్లో ఉంచారు. ఆ బాలికలను కలిసేందుకు అనుమతించే విధంగా పోలీసులకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ దాఖలైన అనుబంధ వ్యాజ్యాలను హైకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తప్పిపోయిన, కిడ్నాపైన పిల్లలను బలవంతంగా వ్యభిచార కూపాల్లోకి దించుతున్నారని పేర్కొంటూ పత్రికల్లో వచ్చిన వార్తలను హైకోర్టు సుమోటోగా ప్రజాప్రయోజన వ్యాజ్యంగా విచారణ చేపట్టింది. ఆ బాలికలను ప్రభుత్వ సంరక్షణ గృహాల్లో ఉంచింది. తమ పెంపుడు పిల్లలను కలుసుకునేందుకు వెళితే పోలీసులు అనుమతించడం లేదని, పిల్లలను కలుసుకునేందుకు అనుమతించాలని పలువురు పెంపుడు తల్లుల తరపు న్యాయవాది వసుధా నాగరాజ్ వాదించారు. ప్రైవేట్ రక్షిత గృహాల్లో ఉన్న 26 మంది పిల్లలకు సరైన వసతులు లేవన్నారు. సంరక్షణ గృహాలకు తీసుకువెళ్లాక వారి పట్ల శ్రద్ధ తీసుకోవడం తగ్గిందన్నారు. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్ కుమార్ అభ్యంతరం చెప్పారు. సంరక్షణ గృహాల్లో వసతులు ఉన్నాయని, గతంలో ధర్మాసనం పిల్లల్ని కలుసుకునేందుకు ఎవరినీ అనుమతించరాదని ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'పెంపుడు పిల్లల్ని చూసేందుకు అనుమతి కోరుతూ అనుబంధ పిటిషన్లు దాఖలు చేసిన వారిలో కొందరిపై క్రిమినల్ కేసులున్నాయి. వారు కలిస్తే పిల్లలపై ప్రభావం ఉంటుంది. సంరక్షణ గృహాల్లోని పిల్లల గురించి ఆందోళన అవసరం లేదు. పిల్లల యోగ క్షేమాల బాధ్యత ప్రభుత్వం తీసుకుంది. హైకోర్టు కూడా శ్రద్ధ తీసుకుంటోంది. వారికి ఏవిధమైన విద్యాబోధనలు అవసరమో కూడా హైకోర్టు చూసుకుంటుంది. పిల్లల్ని కలుసుకునేందుకు రాచకొండ కమిషనర్ ఎవ్వరినీ అనుమతించరాదు'అని ఉత్తర్వులు జారీ చేసింది. ఇంప్లీడ్ పిటిషన్లను తోసిపుచ్చిన ధర్మాసనం ప్రధాన వ్యాజ్యంపై విచారణను వాయిదా వేసింది.

# మళ్లీ హైకోర్టుకు సచివాలయం కూల్చివేత పిల్

- 2016లో కూల్చబోమన్న హామీకి విరుద్ధంగా చర్యలు
- హైకోర్టుకు విన్నవించిన పిటిషనర్ తరపు న్యాయవాది
- చట్టసభల కోసం చారిత్రక భవనాలు కూల్చొద్దంటూ మరో వ్యాజ్యం

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర సచివాలయ భవనాల కూల్చివేత వ్యవహారం మరోసారి హైకోర్టులో తెరపైకి వచ్చింది. భవనాల్ని కూల్చబోమని 2016లో హైకోర్టుకు ప్రభుత్వం తరపున అప్పటి అడ్వొకేట్ జనరల్ రామకృష్ణారెడ్డి ఇచ్చిన హామీకి విరుద్ధంగా కూల్చివేత చర్యలు తీసుకోబోతున్నందున ఈ వ్యాజ్యాన్ని అత్యవసరంగా విచారించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది సరసాని సత్యంరెడ్డి కోర్టును కోరారు. దీనిపై వచ్చే శుక్రవారం (28న) విచారణ జరుపుతామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం ప్రకటించింది. నూతన భవనాలన్నీ 1985 తర్వాత నిర్మించినవేనని, 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ భవనాలు వందేళ్ల వరకూ వినియోగించుకోవచ్చని, ఎర్రగడ్డలో కొత్త సచివాలయం నిర్మాణం, ఇతర వసతులు కల్పించేందుకు రూ.600 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేయాల్సి వస్తుందని జీవన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉండగా పిల్‌ను దాఖలు చేసిన విషయం గుర్తుండే ఉంటుంది.

**ఎర్రమంజిల్‌లోని భవనాల్ని కూల్చొద్దు**

హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని చారిత్రక భవనాల్ని కూల్చి ఆ ప్రదేశంలో కొత్తగా శాసనసభ, శాసనమండలి భవనాలను నిర్మించాలనే ప్రయత్నాలను నిలిపేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. కొత్త చట్టసభల భవనాల కోసం ఈ నెల 27న భూమి పూజ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, హైకోర్టు అడ్డుకోకపోతే చారిత్రక భవనాన్ని కూల్చివేసే ప్రమాదముందని జగిత్యాల జిల్లా ధర్మపురి వాస్తవ్యుడు జె.శంకర్ పిల్‌లో పేర్కొన్నారు. ఇందులో ప్రతివాదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సచివాలయ కార్యదర్శి, రోడ్లు,భవనాల శాఖ ముఖ్య కార్యదర్శులను చేర్చారు. 'ఎర్రమంజిల్ భవనాన్ని 1870లో నవాబ్ సఫ్దర్‌జంగ్ ముషీరుద్దౌలా ఫక్రుల్ ముల్క్ నిర్మించారు. చారిత్రక భవనానికి మరమ్మతులు చేయాలన్నా హెరిటేజ్ పరిరక్షణ కమిటీనే చేయాలి. అలాంటిది కమిటీ అనుమతి లేకుండానే కూల్చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్‌ల అభిప్రాయాలను తీసుకోవడంగానీ, సంప్రదింపులు జరపడం గానీ ప్రభుత్వం చేయలేదు. భూమి పూజ తర్వాత ఎప్పుడైనా చారిత్రక భవనాన్ని కూల్చివేసే అవకాశాలున్నందున వెంటనే హైకోర్టు స్పందించాలి..'అని పిల్‌లో పేర్కొన్నారు.

# సాక్షి జర్నలిజం స్కూల్ ఫలితాలు విడుదల

### జూలై 8 నుంచి బృంద చర్చలు, ఇంటర్వ్యూలు

**సాక్షి, హైదరాబాద్:** సాక్షి జర్నలిజం స్కూల్ ప్రింట్, టీవీ, వెబ్ జర్నలిజం విభాగాల్లో పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 9న నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలను స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి సోమవారం విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి రాతపరీక్షలో 175 మంది ఎంపికయ్యారు. వీరికి జూలై 8 నుంచి హైదరాబాద్, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 1లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో బృంద చర్చలు, ఇంటర్వ్యూలు జరుగుతాయి. అభ్యర్థులు ఈ నెల 28 నుంచి కాల్ లెటర్లను www.sakshischoolofjournalism.com,www.sakshieducation.com,sakshi.com వెబ్‌సైట్లలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు హాల్‌టికెట్, కాల్ లెటర్, 4 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, విద్యార్హతల సర్టిఫికెట్లు, వాటి జిరాక్స్‌లు, వయసు నిర్ధారణ కోసం పదో తరగతి మెమోను తప్పనిసరిగా తీసుకురావాలి. అభ్యర్థులు నిర్దేశిత తేదీన సూచించిన సమయానికి అరగంట ముందుగానే సాక్షి ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలి.

# గ్రూప్-2 ఇంటర్వ్యూలకు ఉచిత శిక్షణ



**సాక్షి, హైదరాబాద్:** గ్రూప్–2 ఉద్యోగాలకు ప్రాథమికంగా ఎంపికైన బీసీ అభ్యర్థులకు ఇంటర్వ్యూ సెషన్‌కు సంబంధించి ఉచిత శిక్షణ, మాక్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు అభ్యర్థులకు జూలై 1నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామని, ఈనెల 27నుంచి వారికి నమూనా ఇంటర్వ్యూలు నిర్వహించి ఇంటర్వ్యూ శిక్షణకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. నమూనా ఇంటర్వ్యూలను ఉస్మానియా యూనివర్సిటీలోని పీజీఆర్‌ఆర్ సీడీఈలో నిర్వహిస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు 6302427521, 04027077929 ఫోన్ నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

తెలంగాణ ఫుడ్స్
IDA- నాచారం, హైదరాబాద్-500076
టెండర్ ప్రకటన
Tender File No.TF/GG/Tenders/285/RM&Vitamins/2019-20 తేది : 24.06.2019
S–30 గ్రేడ్ సుగర్, RBD-RPO, శనగలు మరియు విటమిన్స్ & మినరల్స్ సరఫరా కోసం "తెలంగాణ ఫుడ్స్" ఆన్‌లైన్ టెండర్లు కోరుతోంది. తదుపరి వివరాల కోసం, వెబ్‌సైట్ : http://tender.eprocurement.gov.in ను 25.06.2019న మ.2.00గం. నుండి దర్శించండి. బిడ్ దాఖలు ముగింపు తేది 09.07.2019న మ.1.30గం.వరకు.
సం/– మేనేజింగ్ డైరెక్టర్
DIPR RO.No.188-PP/CL/Advt/1/2019-20, Dt:24.06.2019

తెలంగాణ ప్రభుత్వం
ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం, PR డివిజన్, పెద్దపల్లి జిల్లా
టెండరు నోటీసు
Tender Notice No. TO/02/DPRE/PDPL/2019-20, తేది : 17.06.2019
పెద్దపల్లి, PR డివిజన్‌లో స్వయం సహాయక బృంద భవనాలు, అంగన్ వాడి భవనాల నిర్మాణం మొ॥ పనులు చేపట్టుట కొరకు దిగువ సంతకం దారుచే సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV : 65 పనుల కొరకు రూ.559.56 లక్షలు. టెండరు షెడ్యూల్ జారీ కొరకు దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ : 01.07.2019, టెండరు షెడ్యూళ్ళ జారీకి చివరి తేదీ : 04.07.2019, టెండర్ల స్వీకరణకు చివరి తేదీ : 05.07.2019న మ॥ 3.00గం.వరకు, టెండర్లు తెరుచు తేదీ : 05.07.2019న మ॥ 3.30గం.కు. తదుపరి వివరాలు దిగువ సంతకందారు నుంచి పొందవచ్చును.
సం/– ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, DPRE, పెద్దపల్లి.
DIPR RO.No.417 - DP/CL/Advt/1/2019-20, Dt: 24-06-2019.

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ
లేఖ సంఖ్య : 1502/2019/డి2 స్వల్పకాలిక టెండర్ ప్రకటన తేది : 24.06.2019
కామారెడ్డి జిల్లా పరిధిలోని బాన్స్‌వాడ అటవీ డివిజన్‌లో గల నేషనల్ హైవే 161 సంగారెడ్డి నుండి నాందేడ్ - అకోలా వరకు రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపుల (14.916 కి.మీ॥) ఉన్న చెట్లను నరికి డిపోకు రవాణా చేయుటకు గాను అర్హత కలిగిన టెండర్ల నుండి సీల్డ్ టెండర్లు కోరడమైనది. కావున కాంట్రాక్టర్లు / సంస్థలకి తెలియపరుచునది ఏమనగా, టెండరు పత్రములు మరియు నియమనిబంధనల కొరకు రూ॥ 1000/- ఏదైనా జాతీయ బ్యాంకులో అటవీ మండలాధికారి, బాన్స్‌వాడ (Forest Divisional Officer, Banswada) గారి పేరున చెల్లించి తీసుకొనబడిన డి.డి. ఈ కార్యాలయములో సమర్పించి తేది. 26.06.2019 నుండి తేది 29.06.2019 వరకు కార్యాలయపు పని వేళల్లో స్వీకరించగలరు. పూర్తి చేసిన టెండర్లను ఈ కార్యాలయములో తేది : 29.06.2019 ఉ.12.00గం. లోపు సమర్పించగలరు సమర్పించబడిన, సీల్డ్ టెండర్లను తేది : 29.06.2019 రోజున మధ్యాహ్నం 3.00గం॥లకు తెరువబడును. టెండరు వెంట రూ.10,000/-లు (ఇ.ఎం.డి) ధరావత్తును అటవీ డివిజినల్ శాఖాధికారి, బాన్స్‌వాడ పేరున డి.డి. రూపములో చెల్లించవలెను. మిగతా వివరములకు జిల్లా అటవీ శాఖాధికారి, కార్యాలయము నందు లేదా 08468-222660 ఫోన్ నెంబరుయందు సంప్రదించగలరు.
సం/– జిల్లా అటవీ శాఖాధికారి కామారెడ్డి
DIPR RO.No.421-DP/CL/Advt/1/2019-20, Dt:24.06.2019


తెలంగాణ ప్రభుత్వము
రోడ్లు మరియు భవనముల శాఖ (NH వింగ్)
టెండర్లు కోరుతూ ప్రకటన
NIT No. SE(R&B)NH/HYD/11/2019-20 తేది : 22.06.2019
హైదరాబాద్, NH సర్కిల్‌లో ఒక పని కోసం ఇ–ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదార్లు టెండరు డాక్యుమెంట్లను ఇ–ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in నుండి 26.06.2019 మ. 3.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరు తేది : 11.07.2019న మ. 3.30 గం.వరకు. తదుపరి వివరాలను ఇ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/– సూపరింటెండింగ్ ఇంజినీర్ (R&B), NH సర్కిల్, హైదరాబాద్
DIPR RO No. : 189-PP/CL/Advt/1/2019-20, Dt : 24.06.2019

IREDA
ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ లిమిటెడ్
(భారత ప్రభుత్వ సంస్థ)
కోర్-4A, ఈస్ట్ కోర్ట్, ఇండియా హ్యాబిటేట్ సెంటర్, లోధిరోడ్, న్యూఢిల్లీ–110 003
టెలిఫోన్: 011–24682206–19, ఫ్యాక్స్: 011–24682202, వెబ్‌సైట్: www.ireda.in
SARFAESI చట్టం, 2002 క్రింద అమ్మకం ప్రకటనకు సవరణ
(మెసర్స్ నిడో ఎనర్జీ సిస్టమ్స్ (ప్రై) లిమిటెడ్ యొక్క కొలేటరల్ ఆస్తి అమ్మకం కోసం)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002తో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద మెసర్స్ నిడో ఎనర్జీ సిస్టమ్స్ (ప్రై) లిమిటెడ్ యొక్క కొలేటరల్ ఆస్తి అమ్మకానికి IREDA 27.06.2019న అమ్మకం నోటీస్ జారీచేసి 09.06.2019న వార్తాపత్రికలో ప్రచురించింది. సదరు ఆస్తి రిజర్వు ధర రూ.510.00 లక్షలను రూ.525.00 లక్షలకు మార్చబడింది. తదనుగుణంగా, బిడ్డరు కొత్త రిజర్వు ధరలో 10%తో రావలెను.
అమ్మకం ప్రకటనలోని ఇతర నియమ నిబంధనలన్నీ యధాతథం.
అధీకృత అధికారి
(SL బర్మన్)



## హైదరాబాద్ కాంక్రీట్ జంగిల్‌లా మారింది

### కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: జీహెచ్ఎంసీ మాస్టర్‌ప్లాన్‌లో రెసిడెన్షియల్ జోన్ కనిపించకుండా పోయిందని, హైదరాబాద్ కాంక్రీట్ జంగిల్‌లా మారిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఎం.కోదండరెడ్డి ఆరోపించారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికే నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. వర్షాకాల ప్రణాళికను తయారుచేసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎక్కడకు వెళ్లినా భారీ కట్టడాలతో కూడిన షాపింగ్‌మాల్స్, ప్యాలెస్‌లే కనిపిస్తున్నాయని, అసలు నివాస గృహాలే లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, ఈ ఐదేళ్లలో టీఆర్ఎస్ ఒక్క పైసా పని కూడా చేయలేకపోయిందని ఆరోపించారు. హైదరాబాద్ అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**బంతి ఏఐసీసీ కోర్టులో..**

షోకాజ్ నోటీసులు అందుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యవహారం ఇప్పుడు ఏఐసీసీ కోర్టులో ఉందని కోదండరెడ్డి చెప్పారు. షోకాజ్ నోటీసులు ఇచ్చిన రోజే మళ్లీ రాజగోపాల్‌రెడ్డి పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడారని, దీంతో ఆయన ఎప్పుడెప్పుడు ఏం మాట్లాడారన్న దానిపై నివేదిక తయారు చేసి ఏఐసీసీకి పంపామని తెలిపారు. వారి నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నామని ఓ ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు.

## సీపీఎం కార్యాలయాలకు స్థలాలివ్వండి

### రెవెన్యూ ముఖ్యకార్యదర్శికి తమ్మినేని విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ నిబంధనల మేరకు తమ పార్టీ కార్యాలయాల ఏర్పాటుకు సంబంధించి భూమిని కేటాయించేలా జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలివ్వాలని రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శికి సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విజ్ఞప్తి చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు నిర్దేశించిన ధరకు జిల్లాల్లో ఎకరం భూమి కేటాయింపుపై ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా 16 జిల్లాల్లో తమ పార్టీ దరఖాస్తు చేసుకున్నట్లు వినతిపత్రంలో తెలిపారు. అయితే జిల్లా అధికారులు తమ పార్టీకి భూకేటాయింపులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, తమతో పాటు దరఖాస్తు చేసుకున్న టీఆర్ఎస్‌కు మాత్రం 31 జిల్లాల్లో భూమిని కేటాయించి, స్వాధీనపరిచారని వివరించారు.

## 'అధికార దుర్వినియోగానికి పరాకాష్ట'

సాక్షి, హైదరాబాద్: జిల్లా కార్యాలయాలకు ఎకరాకు మించకుండా చదరపు గజానికి రూ.100 చొప్పున కేవలం అధికార టీఆర్ఎస్ పార్టీకే 31 జిల్లాల్లో స్థలాలు కేటాయించడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి విమర్శించారు. ఇది రాజ్యాంగ విరుద్ధమే కాకుండా అధికారికంగా జరుగుతున్న భూ ఆక్రమణ అని ఆరోపించారు. బీజేపీ కూడా పార్టీ కార్యాలయాల కోసం 25 జిల్లాల్లో దరఖాస్తు చేసినప్పటికీ ఒక్క జిల్లాలో కూడా స్థలం కేటాయించకపోవడం పక్షపాతానికి నిదర్శనమని మల్లారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## 26న చలో ఢిల్లీ: ఆర్.కృష్ణయ్య



హైదరాబాద్: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఈ నెల 26న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య వెల్లడించారు. ఇండియన్ బ్యాక్‌వర్డ్ పీపుల్ కమ్యూనిటీస్ (ఐబీసీ) జాతీయ అధ్యక్షుడు శ్రీరంగం అధ్యక్షతన సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా చలో ఢిల్లీ పోస్టర్‌ను కృష్ణయ్య ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి పెట్టిన బీసీ బిల్లుకు అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టేందుకు ఢిల్లీ వెళ్తున్నట్లు తెలిపారు. బీసీ బిల్లుకు పార్లమెంట్‌లో 37 రాజకీయ పార్టీలు మద్దతు పలకాలని కోరారు. మద్దతు ప్రకటించని పార్టీలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. విజయసాయిరెడ్డిని చూసి బీసీ ఎంపీలు నేర్చుకోవాలని సూచించారు. పార్లమెంట్‌లో ఉన్న 96 మంది బీసీ ఎంపీలు ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, వెంకటేష్, భూపేశ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



సోమవారం పార్టీ కార్యాలయంలో లక్ష్మణ్‌కు కేకు తినిపిస్తున్న ప్రేమేందర్‌రెడ్డి. చిత్రంలో పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు

## 'నిరుద్యోగం'పై బీజేపీ భారీ ఉద్యమం

- ప్రజాచైతన్య యాత్ర విజయోత్సవసభలో కె.లక్ష్మణ్
- టీఆర్ఎస్ ప్రభుత్వ నిర్బంధానికి వెరవం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలు, ఉద్యోగాల భర్తీ కోసం పెద్దఎత్తున ఉద్యమాలను చేపట్టనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ తెలిపారు. బీజేపీ ప్రజా చైతన్యయాత్ర చేపట్టి సోమవారంతో ఏడాది పూర్తి అయిన సందర్భంగా లక్ష్మణ్‌ను పార్టీ ఘనంగా సన్మానించింది. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల తరువాత డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి తదితర హామీల అమలులో వైఫల్యాలపై గతేడాది సెప్టెంబర్ 23న ప్రజాచైతన్య యాత్ర ప్రారంభించామన్నారు. 14 రోజుల పాటు 22 జిల్లాల్లోని 14 పార్లమెంట్ నియోజకవర్గాలు, 48 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,800 గ్రామాల్లో 2,868 కిలోమీటర్ల మేర యాత్రను నిర్వహించి ప్రజలను చైతన్య పరిచామన్నారు. ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లగలిగామని చెప్పారు. చంద్రగ్రహణం నుంచి తెలంగాణకు విముక్తి జరిగే వరకు యాత్రలు కొనసాగుతూనే ఉంటాయని, కల్వకుంట్ల కుటుంబం బారి నుంచి రాష్ట్రానికి విముక్తి లభించే వరకు పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని, 2023 సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. కేసీఆర్ పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించడం లేదని, ఆయన కుటుంబానికి మాత్రం ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు.

**ఆ కుటుంబాన్ని నిరుద్యోగిగా చేస్తేనే...**

కేసీఆర్ కుటుంబంలోని ఒక్కొక్కరిని రాజకీయ నిరుద్యోగులుగా చేస్తామని, కేసీఆర్ కూతురును అరవింద్ రాజకీయ నిరుద్యోగిగా చేశారని, వినోద్‌కుమార్‌ను కూడా నిరుద్యోగిగా చేశామని లక్ష్మణ్ చెప్పారు. ఆ కుటుంబాన్ని పూర్తిగా నిరుద్యోగిగా చేస్తే తప్ప నిరుద్యోగులకు న్యాయం జరగదన్నారు. సచివాలయానికి రాని సీఎం కేసీఆర్‌కు కొత్త సచివాలయం ఎందుకని ప్రశ్నించారు. కొత్త సచివాలయం పేరుతో రూ. 500 కోట్లు దుర్వినియోగం చేస్తున్న కేసీఆర్‌కు తెలంగాణ పేదల ఉసురు తగులుతుందన్నారు. వర్షం వస్తే మోకాళ్లలోతు నీళ్లు వచ్చినా, మ్యాన్‌హోల్ ప్రమాదాలు జరిగినా వారికి పట్టింపులేదన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో యువరాజు(కేటీఆర్) ప్రకటించిన 100 రోజుల ప్రణాళిక ఏమైందని లక్ష్మణ్ ప్రశ్నించారు. వరంగల్ పోలీసులు బీజేపీ కార్యకర్తలపై దౌర్జన్యం చేశారని, ప్రభుత్వ నిర్బంధ చర్యలకు బెదిరేది లేదన్నారు. ప్రజాస్వామిక తెలంగాణ కోసం ఉద్యమస్ఫూర్తితో ముందుకు సాగుతున్నామన్నారు. పేదలు, నిరుద్యోగులు, మహిళల పక్షాన సమరనాథం పూరించాలని, జనచైతన్య యాత్ర స్ఫూర్తిగా లక్ష్మణ్ నేతృత్వంలో ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్, రాష్ట్ర ఇన్‌చార్జి కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, చింతా సాంబమూర్తి, ధర్మారావు, కాసం వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి విజయరామారావు పాల్గొన్నారు.

# బలమైన రాజకీయ శక్తిగా టీఆర్ఎస్

- మూడేళ్లలో కాళేశ్వరం పూర్తి ఓ రికార్డు: కేటీఆర్
- 32 జెడ్పీల్లో గులాబీ జెండా ఎగరడం మరో రికార్డు
- 27 నుంచి రాష్ట్రంలో టీఆర్ఎస్ సభ్యత్వాల నమోదు
- సిరిసిల్లలో టీఆర్ఎస్ భవన నిర్మాణానికి భూమి పూజ



సిరిసిల్ల సభలో మాట్లాడుతున్న కేటీఆర్

సిరిసిల్ల: తెలంగాణలో బలమైన రాజకీయ శక్తిగా టీఆర్ఎస్ అవతరించిందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన టీఆర్ఎస్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ 2001లో పార్టీ ప్రారంభించినప్పుడు ఈ స్థాయికి చేరుకుంటుందని ఎవరూ ఊహించలేదన్నారు. రాష్ట్రంలో రెండోసారి టీఆర్ఎస్ అధికారంలోకి రావడంతోపాటు సీఎం కేసీఆర్ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేసి రికార్డు సృష్టించారని అన్నారు. కృష్ణా, గోదావరి జలాలను బీడు భూములకు మళ్లించేందుకు కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో టీఆర్ఎస్ అజేయమైన శక్తిగా నిలిచిందన్నారు. దేశ చరిత్రలోనే తొలిసారి 32 జెడ్పీ స్థానాల్లో గులాబీ జెండా ఎగరడం విశేషమన్నారు. ఈనెల 27 నుంచి టీఆర్ఎస్ సభ్యత్వాల నమోదు ఉంటుందని, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో భాగంగా అన్ని జిల్లా కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. బూత్ కమిటీల నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తామన్నారు. పండుగ వాతావరణంలో సభ్యత్వాల నమోదు జరుగుతుందని పేర్కొన్నారు.

**రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరితోనైనా తలపడతాం**

రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతోనే కాదు దేవుడితోనైనా తలబడేందుకు కేసీఆర్ సిద్ధంగా ఉన్నారని కేటీఆర్ అన్నారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వ పాలన సాగుతోందని చెప్పారు. బీడు భూములకు సాగునీరు వస్తే సీఎం ఫొటో ప్రతీరైతు గుండెలో ఉంటుందని, ఆయన ఫొటోను పెట్టుకుని మొక్కేరోజులు వస్తాయన్నారు. రైతు సంక్షేమంలో తెలంగాణ దేశానికి దిక్సూచి అయిందన్నారు. కోటి ఎకరాలకు సాగునీరు అందించి హరిత తెలంగాణ సాధిస్తామన్నారు. ఆకుపచ్చని తెలంగాణ లక్ష్యంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని కేటీఆర్ వివరించారు.

**వస్త్ర పరిశ్రమను విస్తరించాలి**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను విస్తరించాలని కేటీఆర్ కోరారు. సిరిసిల్ల పద్మశాలి నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారంలో ఆయన పాల్గొన్నారు. తమిళనాడులోని తిరువూరుకు దీటుగా కొత్త ఆలోచనలతో వస్త్రోత్పత్తి రంగాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చేనేత జౌళి శాఖకు రూ.70 కోట్లు ఉన్న బడ్జెట్ ఇప్పుడు తెలంగాణలో రూ.1,270 కోట్లకు చేరిందన్నారు. సిరిసిల్లలో అపెరల్ పార్కు నిర్మాణంతో 10 వేల మంది మహిళలకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. రాష్ట్రంలోని మరమగ్గాలు, చేనేత మగ్గాలకు జియో ట్యాగింగ్ చేశామని కేటీఆర్ తెలిపారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు చెన్నమనేని రమేశ్‌బాబు, సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కలెక్టర్ కృష్ణభాస్కర్ పాల్గొన్నారు.

### నిర్వాసితుల సమస్యలు సీఎంకు తెలుసు

ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితుల త్యాగం మరువలేనిదని కేటీఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ నిర్మాణ పనులను కేటీఆర్ పరిశీలించారు. సారంగం తవ్వకాలను ఆయన క్షేత్ర స్థాయిలో చూశారు. నిర్వాసితుల త్యాగాలతోనే ప్రాజెక్టులు నిర్మాణం అవుతున్నాయని, కొందరి త్యాగం కోట్ల మందికి ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# మా పార్టీలో సింగిల్ హీరోలుండరు

- అఖిల భారత స్థాయిలో రాహుల్ ఒక్కరే హీరో
- రాష్ట్రాల్లో పార్టీ నేతలంతా హీరోలే... నేను పదకొండో హీరోగా పీసీసీ అధ్యక్ష పదవి అడుగుతున్నా
- పార్టీని అధికారంలోకి తెచ్చే మెడిసిన్ నా దగ్గర ఉంది..
- సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో రాష్ట్రాల్లో సింగిల్ హీరోలు ఉండరని, అఖిల భారత స్థాయిలో రాహుల్ గాంధీ ఒక్కరే హీరో అని, రాష్ట్రాల్లో పార్టీలో ఉన్న నేతలంతా హీరోలేనని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. 'కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, భట్టి విక్రమార్క, షబ్బీర్‌అలీ.. ఇలా చాలా మంది నేతలు పీసీసీ అధ్యక్ష పదవి అడుగుతున్నారు. వీరంతా సమర్థవంతమైన నాయకులే. మా పార్టీలో అన్ని సామాజిక వర్గాల్లో సమర్థవంతమైన నేతలున్నారు. చాలా మంది హీరోలున్నారు. అందులో నేనూ ఒక హీరోనే. ఇప్పుడు పీసీసీ అధ్యక్ష పదవి అడుగుతున్న పది మంది హీరోలకు తోడు నేను కూడా పదకొండో హీరోగా ఆ పదవిని అడుగుతున్నా. నేను పీసీసీ అధ్యక్షుడిని కావాలనుకుంటున్నా.'అని ఆయన చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు, హుజూర్‌నగర్ ఉప ఎన్నికలు అయిపోయేంతవరకు పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డినే కొనసాగించాలని, ఉత్తమ్‌ను ఎప్పుడు మార్చినా తన పేరును కూడా పీసీసీ కోసం పరిగణనలోకి తీసుకోవాలని కుంతియాను కోరానని చెప్పారు. పార్టీ తన విజ్ఞప్తిని పరిగణించి ఆ అవకాశం ఇస్తే రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేస్తానన్నారు. పార్టీలో జవసత్వాలు నింపి అధికారంలోకి తీసుకువచ్చే మెడిసిన్ తన దగ్గర ఉందని చెప్పారు. మున్సిపల్ ఎన్నికలను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని, రాష్ట్రంలో 50శాతం మున్సిపాలిటీల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. 12 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌ను వీడి వెళ్లినా తాము బలంగానే ఉన్నామని చెప్పారు. అన్ని పార్టీల్లో అంతర్గత సమస్యలున్నాయని చెప్పిన జగ్గారెడ్డి టీఆర్ఎస్‌లో లేవా అని ప్రశ్నించారు. అంత చిన్న పార్టీలోనే అన్ని పంచాయతీలుంటే సముద్రం లాంటి కాంగ్రెస్‌లో ఎన్ని సమస్యలుంటాయో అర్థం చేసుకోవాలన్నారు. తమ పార్టీ గురించి టీఆర్ఎస్, బీజేపీ నేతలు ఎన్ని విమర్శలు చేసినా తాము పట్టించుకోబోమని, తమ పార్టీ బలమేంటో ప్రజలకు తెలుసునని అన్నారు.

## కేసీఆర్ రాజు అనుకుంటున్నారు..

### సచివాలయం కూల్చివేత కోర్టు ధిక్కరణే: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్‌వి రాచరికపు ఆలోచనలని, నియంతృత్వ ఆలోచనల్లో ఆయన ఇప్పటికైనా మార్పు తెచ్చుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి హితవు పలికారు. సచివాలయం, అసెంబ్లీ భవనాల కూల్చివేతపై సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ఆయనకు నెత్తిన కిరీటం ఒక్కటే తక్కువ. ప్రజాస్వామ్య యుగంలో కూడా తనను తాను రాజు అనుకుం టున్నారు. ఆయన రాజు కాదు. ప్రజలు ఎన్ను కొన్న ముఖ్యమంత్రి మాత్రమే.'అని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 2016లో సచివాలయం కూల్చివేతపై హైకోర్టుకు వెళ్లానని, ఆ కేసులో భాగంగా తాము సచివాలయాన్ని కూల్చడం లేదని ప్రభుత్వం కోర్టుకు చెప్పిందని, ఇప్పుడు సచివాలయం కూల్చివేత ఖచ్చితంగా కోర్టు ధిక్కరణే అవుతుందన్నారు. ఇప్పుడున్న సెక్రటేరియట్‌లో భవనాలు 30–40 ఏళ్ల లోపువేనని, ఇంకా 60–70 ఏళ్ల పాటు వాటిని వినియోగించుకునే అవకాశముందని అన్నారు. కానీ, ఇప్పుడు ఎవరూ అడగని సచివాలయం కూల్చివేత చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలకు కావాల్సిందేంటి... ప్రభుత్వం ఆలోచిస్తున్నదేంటి అని ప్రశ్నించారు. తన హయాంలో నిర్మించానని చెప్పుకునేందుకే కేసీఆర్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అసెంబ్లీ భవనాలను కూడా ఎర్రమంజిల్‌కు మారుస్తామని చెపుతున్నారని, ఇప్పుడు ఇవన్నీ ఎందుకని ప్రశ్నించారు.అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో కనీసం 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయలేని కేసీఆర్ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా తనకు నచ్చిన పనులు మాత్రమే చేస్తున్నారని విమర్శించారు.అసలు ఎర్రమంజిల్‌లో ఉండే ట్రాఫిక్ గురించి కేసీఆర్ ఆలోచించడం లేదని, కూకట్‌పల్లి నుంచి ఖైరతాబాద్ వరకు ఎంత ట్రాఫిక్ ఉంటుందో ఆలోచించాలని సూచించారు. అసలు ఎర్రమంజిల్‌లో అసెంబ్లీ భవనాలు కట్టేందుకు ట్రాఫిక్ క్లియరెన్స్ వచ్చిందా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేసీఆర్ తన ఆలోచనలను మార్చుకోవాలని, ప్రజలకు అవసరం లేనివి కాకుండా తక్షణావసరాలపై దృష్టి పెట్టి పాలన చేయాలని హితవు పలికారు.

# గోదావరి వరదకు అడ్డుకట్ట!

- ఇప్పటికే 954 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా ప్రాజెక్టుల నిర్మాణం
- ఇవి పూర్తికావస్తున్న నేపథ్యంలో వరద జలాలపై దృష్టి పెట్టిన ప్రభుత్వం
- కృష్ణా బేసిన్‌కు తరలిస్తే నల్లగొండ, పాలమూరుతో పాటు ఏపీలోని రాయలసీమ ప్రాంతాలు సస్యశ్యామలం
- గోదావరిని సాగర్, శ్రీశైలానికి తరలించే ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం కేసీఆర్ సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి వరప్రదాయిని అయిన గోదావరి జలాలతో రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీరందించే బృహత్తర ప్రణాళికకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. గోదావరిలో రాష్ట్రానికి ఉన్న నికర జలాల కేటాయింపులకు అనుగుణంగా ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగిరం చేసిన ప్రభుత్వం ఇక తన దృష్టంతా గోదావరి వరద జలాలపై పెట్టింది. ఏటా సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి జలాలకు అడ్డుకట్ట వేసి వాటిని నీటి లోటుతో కొట్టుమిట్టాడుతున్న కరువు ప్రాంతాలైన దక్షిణ తెలంగాణ జిల్లాలకు పారించేలా వ్యూహం రచిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతోనూ సమన్వయం చేసుకుంటూ, ఆ రాష్ట్ర సహకారంతో ఇరు రాష్ట్రాలకు లబ్ధి చేకూరేలా గోదావరి–కృష్ణా నదుల అనుసంధానం చేయాలని భావిస్తోంది.

**వరదను మళ్లిస్తేనే వరమాల...**


రాష్ట్రంలో ఇప్పటికే నిర్మితమవుతున్న ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు కొత్తవాటిని నిర్మించి.. మొత్తంగా 1.25 కోట్ల ఎకరాలకు నీరివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగా గోదావరి, కృష్ణా జలాల్లో లభ్యతగా ఉన్న నీటిలో గరిష్టం ఆయకట్టుకు మళ్లించే యత్నాలు చేస్తోంది. నిజానికి గోదావరిలో ఉమ్మడి రాష్ట్రానికి 1,486 టీఎంసీల నీటి కేటాయింపులు ఉండగా, ఇందులో తెలంగాణకు 954 టీఎంసీల వాటా ఉంది. అయితే ఇందులో ఇప్పటికే నిర్మాణం పూర్తయిన శ్రీరాంసాగర్, సింగూరు, నిజాంసాగర్ వంటి ప్రాజెక్టుల కింద ఏటా వినియోగం సరాసరిన 470 టీఎంసీల మేర ఉంది. మరింత వాటా నీటిని వినియోగంలోకి తెచ్చేలా కాళేశ్వరం (180 టీఎంసీ), దేవాదుల (60), తుపాకులగూడెం (100), సీతారామ (60) వంటి ఎత్తిపోతల పథకాలను చేపట్టింది. ఇవన్నీ వస్తే మరో 520 టీఎంసీల మేర నీరు వినియోగంలోకి రానుంది. ఇందులో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా ఈ ఏడాది నుంచే కనిష్టంగా 120 నుంచి 150 టీఎంసీల నీటిని ఎత్తిపోయాలని నిర్ణయించారు. నికర జలాల వినియోగం పోనూ గోదావరి నుంచి ప్రతిఏటా గరిష్టంగా 6వేల టీఎంసీలు, కనిష్టంగా 1,500 టీఎంసీల మేర నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది. ఇందులో గరిష్టంగా ఇంద్రావతిలోనూ 800 టీఎంసీలు, శబరిలో 550 టీఎంసీలు, ప్రాణహితలో 600 టీఎంసీల మేర నీరు వృథాగా సముద్రంలోకి వెళుతోంది. వీటిలో గరిష్టంగా వెయ్యి టీఎంసీల నీటిని వినియోగంలోకి తెచ్చినా తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు సస్యశ్యామలం అవుతాయని కేసీఆర్ పదేపదే చెబుతున్నారు. గోదావరిలో వృథాగా పోతున్న జలాలను కృష్ణా బేసిన్‌లో నీటి లోటు ఉన్న నల్లగొండ, పాలమూరు జిల్లాలతో పాటు ఏపీలోని రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు తరలించవచ్చని ఆయన చెబుతున్నారు. నిజానికి కృష్ణా బేసిన్‌లో ఇరు రాష్ట్రాలకు కలిపి 811 టీఎంసీలు ఉండగా ఇందులో తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీల నీటి కేటాయింపులున్నాయి. ప్రతి ఏటా కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు ఎగువ నుంచి నీటి ప్రవాహాలు లేకపోవడంతో ఇరు రాష్ట్రాలకు సమస్యలు ఎదురవుతున్నాయి. కృష్ణా బేసిన్‌లో తెలంగాణలో 90 లక్షల ఎకరాల సాగు చేయగల ఆయకట్టు ఉన్నా, ప్రస్తుతం కేవలం 15 లక్షల ఎకరాలకు మించి సాగవడం లేదు. ఈ నేపథ్యంలోనే గోదావరి వరద నీటిని కృష్ణా బేసిన్ ఆయకట్టుకు మళ్లించాలని ముఖ్యమంత్రి యోచిస్తున్నారు.

### శ్రీశైలం, సాగర్‌కు గోదావరి జలాలు..

సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి నీటికి అడ్డుకట్ట వేసి కృష్ణా బేసిన్‌కు తరలించి అక్కడ నీటి కటకటతో కొట్టుమిట్టాడుతున్న ఆయకట్టుకు నీరివ్వాలన్నది సీఎం లక్ష్యం పెట్టుకున్నారు. దీని కోసం గోదావరి నీటిని నాగార్జునసాగర్‌కు తరలించే అంశంపై ఆయన ఫోకస్ పెట్టారు. ఆదివారం ఇరిగేషన్‌శాఖ ఇంజనీర్ల భేటీలోనూ ఇదే అంశంపై ఎక్కువ సేపు చర్చించారు. దుమ్ముగూడెం టెయిల్‌పాండ్, ఇంద్రావతి దిగువన ఉన్న తుపాకులగూడెం నుంచి లేక మరేదైనా పాయింట్ నుంచి సాగర్‌కు నీటిని తరలించే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. దీంతో పాటే శ్రీశైలంపై ఆధారపడిన ఏపీ, తెలంగాణ ప్రాజెక్టులకు నీటి కొరత లేకుండా గోదావరి జలాలను ఎలా అనుసంధానించవచ్చనే అంశాలపైనా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. వివిధ బేసిన్‌ల మధ్య నీటిని బదిలీ చేసి సమతుల్యత సాధించాలని, ఇరు రాష్ట్రాలు సస్యశ్యామలం అయ్యేలా భవిష్యత్ ప్రణాళికలు ఉండాలని మార్గదర్శనం చేశారు. సీఎం సూచించిన అంశాలపై ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు, అధికారుల స్థాయి భేటీలో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

# ఆర్టీసీ నష్టాలు రూ.928 కోట్లు

- 2018–19 లెక్కలు తేల్చి ప్రభుత్వానికి నివేదించిన సంస్థ
- బ్యాంకు అప్పులు, ఐఆర్ చెల్లింపు, డీజిల్ ఖర్చు తడిసిమోపెడు
- జీతాలు చెల్లించలేని దుస్థితిలో సంస్థ
- వెంటనే చక్కదిద్దకుంటే మనుగడ కష్టమంటున్న కార్మిక సంఘాలు




సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీ రికార్డు సృష్టించింది. కాకపోతే నష్టాల్లో! రూ.వేయికోట్ల నష్టాల మార్కుకు చేరువైంది. 2018–19 ఆర్థిక సంవత్సరానికిగాని ఏకంగా రూ.928.67 కోట్ల నష్టాన్ని మూటగట్టుకున్నట్టు ప్రభుత్వానికి టీఎస్ ఆర్టీసీ నివేదించింది. ఆర్టీసీ ఆవిర్భవించిన 8 దశాబ్దాల చరిత్రలో ఇదే అతి భారీనష్టం. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తొలి ఏడాదిలో స్వల్ప లాభాలు నమోదు చేసిన ప్రగతిరథం నష్టాల బాట వీడనుందనే ఆశ కల్పించింది. కానీ, ఆ తర్వాత క్రమంగా ఏ యేటికాయేడు నష్టాల ఊబిలోకే పరుగులు పెట్టింది. దీంతో సిబ్బందికి జీతాలు చెల్లించటమే గగనంగా మారింది. దాదాపు ఆరేళ్లుగా సిబ్బంది నియామకాలు లేకపోవటంతో డ్రైవర్లకు తీవ్ర కొరత ఏర్పడింది. కొంతకాలంగా అద్దె బస్సులనే తీసుకుంటోంది. తాజాగా 600 బ్యాటరీ బస్సులు కేటాయించాలంటూ కేంద్రాన్ని కోరాలని నిర్ణయించిన ఆర్టీసీ... వాటిని కూడా అద్దె బస్సులుగానే ఏర్పాటు చేసుకోవాలనుకోవటం విశేషం. వెరసి ఆర్టీసీలో అద్దె బస్సుల సంఖ్య పెరిగి ప్రైవేటీకరణకు మార్గం సుగమమవుతుందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**రూ.312 కోట్ల ఆదాయం పెరిగినా...**

ఈసారి ఆర్టీసీలో ఏకంగా రూ.312 కోట్ల మేర ఆదాయం పెరిగినా నష్టాలు రికార్డుస్థాయిలో నమోదయ్యాయి. నియంత్రించలేని ఖర్చులు పెరగటంతో నష్టాలు కూడా నమోదయ్యాయి. 2017–18 ఆర్థిక సంవత్సరంలో ఆర్టీసీ రూ.4,570 కోట్ల ఆదాయం సమకూర్చుకుంది. గత మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఆ మొత్తం రూ.4,882 కోట్లుగా తేలింది. అంటే అంతకుముందు సంవత్సరం కంటే రూ.312 కోట్ల ఆదాయం పెరిగింది. బస్సుచార్జీలు పెంచకున్నా ఆదాయం పెరగడం విశేషం.

**కొంప ముంచిన వడ్డీ, డీజిల్, ఐఆర్**

ఆర్టీసీకి రూ.3,500 కోట్లకుపైగా బ్యాంకు అప్పులున్నాయి. వడ్డీ భారం రూ.181 కోట్లు. ఇది అంతకు ముందు సంవత్సరం కంటే రూ.16 కోట్లు ఎక్కువ. తాజా నష్టాల్లో డీజిల్ వాటా పెద్దదే. చమురు రూపంలో రూ.1,384 కోట్లు ఖర్చయింది. ఇది అంతకుముందు సంవత్సరం కంటే రూ.192.33 కోట్లు ఎక్కువ. గతేడాది ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బందికి మధ్యంతర భృతి(ఐఆర్)ని 16 శాతంగా ప్రకటించింది. ఇది వెంటనే అమలులోకి రావటంతో వేతన భారం కూడా పెరిగింది. ఆర్థిక సంవత్సరంలో వేతనాల రూపంలో రూ.2,381 కోట్లు చెల్లించారు. ఇది అంతకుముందు ఏడాదికంటే రూ.127.77 కోట్లు ఎక్కువ. మోటారు వెహికిల్ టాక్స్ రూ.174 కోట్లు. ఇలా అన్నీ కలిపి అంతకుముందు సంవత్సరం నష్టాల కంటే రూ.179.76 కోట్లను పెంచుకుని రూ.వేయి కోట్లకు చేరువైంది.

**ఈ సంవత్సరం అంతకంటే ఎక్కువగా...**

ప్రస్తుత ఆర్థిక సంవవత్సరం తొలి త్రైమాసిక నష్టాలను చూస్తే ఏప్రిల్‌లోనే రూ.38.23 కోట్లు, మేలో రూ.37.96 కోట్లు నష్టాలు నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ (రూ.34 కోట్లు), మే(రూ.26 కోట్ల) కంటే చాలా ఎక్కువ.

- రాష్ట్రంలో వేయి గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. వీటికి బస్సులు నడపాలంటే కనీసం 1,500 కొత్త బస్సులు కొనాలి. 3 వేల మంది అదనపు డ్రైవర్లు, కండక్టర్లు కావాలి.
- 3 వేల బస్సులు డొక్కుగా మారి నడవటానికి యోగ్యంగాలేవు. వాటిని రీప్లేస్ చేయాలంటే కొత్త బస్సులు కొనాలి.
- ప్రస్తుతం రెండువేలకుపైగా డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆరేళ్లుగా నియామకాలు లేవు. వారిని నియమిస్తే జీతాలు చెల్లించే స్థోమత ఆర్టీసీకి లేదు.
- బస్టాండ్లలో ప్రయాణికుల వసతులు మెరుగుపరచటంతోపాటు వాటిని ఆధునీకరించాలంటే కనీసం రూ.500 కోట్లు కావాలి. నిధుల్లేక వాటి జోలికి వెళ్లటం లేదు.
- ఎండాకాలం నిమ్మరసం సరఫరాకు కూడా నిధులు లేక కార్మికులే చందాలు వేసుకుని సరఫరా చేసుకోవాల్సి వచ్చింది.

**నష్టాల వివరాలు ఇలా... (రూ.కోట్లలో..)**

| | 2018–19 | 2017–18 |
|---|---|---|
| మొత్తం వ్యయం | 5,810.67 | 5,630.91 |
| మొత్తం ఆదాయం | 4,882.00 | 4,570.00 |
| నష్టాలు | 928.67 | 748.90 |

**తెలంగాణ ఆవిర్భావం నుంచి నష్టాలు ఇలా...**

| సంవత్సరం | నష్టాలు (రూ.కోట్లలో) | సంవత్సరం | నష్టాలు (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| 2014–15 | 420 | 2017–18 | 748 |
| 2015–16 | 710 | 2018–19 | 928 |
| 2016–17 | 770 | | |

## కోటి సభ్యత్వాలే టీఆర్ఎస్ లక్ష్యం..!

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు మొదలుకుని లోక్‌సభ, ప్రాదేశిక ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన టీఆర్ఎస్ పార్టీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించింది. ఈ నెల 27 నుంచి జూలై నెలాఖరు వరకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించాలని టీఆర్ఎస్ నిర్ణయించింది. 2017లో చేపట్టిన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పార్టీ శ్రేణుల నుంచి భారీ స్పందన వచ్చింది. తొలిసారిగా 75 లక్షల మంది పార్టీ క్రియాశీల, సాధారణ సభ్యులుగా నమోదయ్యారు. దీంతో దేశంలోనే ఎక్కువ మంది సభ్యులు కలిగిన పార్టీల జాబితాలో టీఆర్ఎస్ చేరింది. ఇప్పుడు కోటి మందిని సభ్యులుగా చేర్చడమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు చేపట్టాలని, ఇందులో 25 లక్షల మందిని క్రియాశీల కార్యకర్తలుగా, మరో 75 లక్షల మందిని సాధారణ సభ్యులుగా నమోదు చేయాలని నిర్ణయించింది. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన తీరుపై పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో ఈ నెల 27న తెలంగాణ భవన్‌లో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయనున్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ఈ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌లతోపాటు ముఖ్య నేతలు పార్టీ సభ్యత్వం స్వీకరిస్తారు. జూలై 20 నాటికి సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రతి 2 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకరు చొప్పున రాష్ట్ర కార్యవర్గంలోని నేతలకు సమన్వయ బాధ్యతలు అప్పగిస్తారు. నియోజకవర్గాల వారీగా సభ్యత నమోదు ఇన్‌చార్జిల పేర్లను 27న ప్రకటిస్తారు.

# మోదీ.. ఓ మురికి కాలువ!

- కాంగ్రెస్ లోక్‌సభ పక్షనేత అధిర్ రంజన్ చౌదరి వివాదాస్పద వ్యాఖ్య
- లోక్‌సభ నుంచి వెళ్లిపోయిన ప్రధాని
- తీవ్రంగా మండిపడ్డ బీజేపీ
- క్షమాపణలు కోరిన అధిర్



లోక్‌సభలో మాట్లాడుతున్న అధిర్ రంజన్. చిత్రంలో సోనియా గాంధీ, కాంగ్రెస్ సభ్యులు

**న్యూఢిల్లీ:** లోక్‌సభలో అధికార బీజేపీ, విపక్ష కాంగ్రెస్ పార్టీల మధ్య సోమవారం మాటలయుద్ధం నడిచింది. కేంద్ర పశుసంవర్ధక శాఖ సహాయ మంత్రి ప్రతాప్ చంద్ర సారంగి లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ అత్యంత అరుదైన రాజకీయ నేత అని, స్వామి వివేకానందుడి వంటివారని కితాబిచ్చారు. దీన్ని పలువురు కాంగ్రెస్ ఎంపీలు తప్పుపట్టారు. ఈ సందర్భంగా సహనం కోల్పోయిన కాంగ్రెస్ పక్షనేత అధిర్ రంజన్ చౌదరి ప్రధాని మోదీని 'మురికి కాలువ'గా అభివర్ణించారు.

**తుకడే తుకడే గ్యాంగ్‌లను సహించబోం..**

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి సారంగి లోక్‌సభలో మాట్లాడుతూ.. 'నాటి యూపీఏ సర్కారు ప్రభుత్వ వైఫల్యానికి పర్యాయపదంగా మారింది. కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి ఎంతలా సాగిలపడిపోయిందంటే ప్రధానిని కూడా యాక్సిడెంటల్ అని పిలిచేవారు' అని మాజీ ప్రధాని మన్మోహన్‌ను ప్రస్తావించారు. 'ఎవరైతే వందేమాతరం గేయాన్ని ఆలపించరో, వారికి భారత్‌లో ఉండే హక్కు ఉందా? దేశాన్ని ముక్కలుముక్కలుగా విభజించాలనుకునే తుకడే–తుకడే గ్యాంగ్‌లను సహించబోం. ప్రధాని మోదీని దూషించడం అంటే హిమాలయాలను తలతో ఢీకొట్టడమే. కొందరు ప్రతిపక్ష నేతలు పాకిస్తాన్‌లోని బాలాకోట్ ఉగ్రస్థావరాలపై చేసిన దాడులకు సాక్ష్యాలను అడుగుతున్నారు. 'నీ తండ్రి ఇతనే' అని తల్లి చెబితే అందుకు ఎవరైనా సాక్ష్యాలు చూపించమని అడుగుతారా?' అని వ్యాఖ్యానించారు.

**ఇందిర ఎక్కడ.. మోదీ ఎక్కడ?: కాంగ్రెస్**

మోదీ భజనలో తరించిన సారంగి అన్ని హద్దులు దాటేశారని కాంగ్రెస్ లోక్‌సభ పక్షనేత అధిర్ రంజన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ''బీజేపీ ప్రభుత్వం 'పొలిటికల్ ప్లాగరిజం సిండ్రోమ్' అనే వ్యాధితో బాధపడుతోంది. ఈ వ్యాధి ఉన్నవాళ్లు గత ప్రభుత్వం ఏమీ చేయలేదనీ, అన్నీ తామే చేశామని భ్రమపడుతుంటారు. హరిత విప్లవం(వ్యవసాయం), శ్వేత విప్లవం(పాల దిగుబడి పెంపు), టెక్నాలజీ విప్లవం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే వచ్చాయి. ఓఎన్జీసీ, ఐవోసీ, ఎన్టీపీసీ, ఎస్బీఐ, హాల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు మా హయాంలోనే ఏర్పడ్డాయి. చివరికి బీజేపీ ప్రభుత్వం పాక్‌పై ప్రయోగించిన క్షిపణులు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే తయారయ్యాయి. మన ప్రధాని పెద్ద సేల్స్‌మ్యాన్. మేం మా ఉత్పత్తులను సరిగ్గా మార్కెట్ చేసుకోలేకపోయాం. అందుకే సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయాం'' అని చెప్పారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ జోక్యం చేసుకుంటూ..'మేం ఇందిరానే ఇండియా.. ఇండియానే ఇందిర' అనేంతగా దిగజారిపోలేదు అని విమర్శించారు. దీంతో సహనం కోల్పోయిన రంజన్ చౌదరి 'గంగామాత ఎక్కడ? మురికికాలువ ఎక్కడ?' అని వ్యాఖ్యానించి సభలో ఒక్కసారిగా దుమారం రేపారు. ఈ వ్యాఖ్యలను బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా ఖండించారు. 125 కోట్ల మంది ప్రజలెన్నుకున్న ప్రధానిని కాంగ్రెస్ అవమానించిందనీ, ఈ అహంకారమే ఆ పార్టీని అంతం చేస్తుందని హెచ్చరించారు. దీంతో చివరికి అధిర్ స్పందిస్తూ..'నాకు హిందీ మరీ అంత బాగా రాదు. భారీ గంగానది ఎక్కడ? మామూలు కాలువ ఎక్కడ?' అని మాత్రమే నేను చెప్పబోయా. ఒకవేళ నా మాటలకు ప్రధాని నొచ్చు కుని ఉంటే క్షమాపణలు కోరుతున్నా' అని వివరణ ఇచ్చారు.

### నవభారతాన్ని మీరే తీసుకోండి

రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానం సందర్భంగా కాంగ్రెస్ పక్షనేత గులాంనబీ ఆజాద్ కేంద్ర ప్రభుత్వంపై సునిశిత విమర్శలు చేశారు. నవభారతంలో మనుషులు అడవిని చూసి కాకుండా తోటి మనుషుల్ని చూసి భయపడుతున్నారనీ, గాంధీజీ హంతకులను బీజేపీ ఎంపీ ప్రశంసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'మోదీ నవభారతంలో చిన్నారులపై అత్యాచారాలు అమాంతం పెరిగాయి. నిరుద్యోగం ఆల్‌టైం గరిష్టానికి చేరింది. కాబట్టి మీ నవభారతాన్ని(బీజేపీ ఎన్నికల నినాదం) మీరే ఉంచుకోండి. ప్రేమ, ఆప్యాయతలకు నిలయమైన మా ఇండియాను మాకు తిరిగిచ్చేయండి' అని వ్యాఖ్యానించారు.

# ఇక నుంచి ఒంటరి పోరే

- ఎన్నికల్లో పొత్తు పెట్టుకోం
- బీఎస్పీ నేత మాయావతి స్పష్టీకరణ

**లక్నో:** ఇక ముందు జరిగే ఎన్నికల్లో తాము ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా ఒంటరిగానే పోటీ చేస్తామని బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత మాయావతి స్పష్టం చేశారు. భవిష్యత్తులో వచ్చే ఎన్నికలు చిన్నవైనా, పెద్దవైనా తాము ఒంటరిగానే పోటీ చేస్తామని సోమవారం లక్నోలో ఆమె ప్రకటించారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్పీ, ఎస్పీలు కలిసి పోటీ చేశాయి. అయితే, అనుకున్న మేరకు ఫలితాలు దక్కలేదు. దాంతో వీరి పొత్తు కొనసాగే విషయం చర్చనీయాంశమైంది. మాయావతి తాజా ప్రకటనతో ఎస్పీతో పొత్తు ఉండదని తేలిపోయింది. '2012 నుంచి 2017 వరకు అధికారంలో ఉన్న సమాజ్‌వాదీ పార్టీ బీఎస్పీకి వ్యతిరేకంగా, దళితులకు వ్యతిరేకంగా పదోన్నతుల్లో రిజర్వేషన్ల వంటి పలు నిర్ణయాలు తీసుకుంది. ఎస్పీ పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయి. వాటినన్నిటినీ మరిచి దేశప్రయోజనాల కోసం సార్వత్రిక ఎన్నికల్లో ఎస్పీతో పొత్తు పెట్టుకున్నాం. అయితే, ఎన్నికల తర్వాత ఎస్పీ వైఖరి మమ్మల్ని ఆలోచించుకునేలా చేసింది. ఈ పొత్తుతో భవిష్యత్తులో బీజేపీని ఓడించడం సాధ్యం కాదనిపిస్తోంది. అందుకే ఇకపై పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుంది' అని మాయావతి హిందీలో ట్వీట్ చేశారు. దళితులు సమాజ్‌వాదీ పార్టీకి, ఆ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌కు చేరువవుతున్నారన్న కోపంతోనే మాయావతి తమకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఎస్పీ నేత రామ్‌శంకర్ అన్నారు. మాయవతి నిర్ణయంతో తమకేసంబంధం లేదని గఠ్‌బంధన్‌లో మరో భాగస్వామి రాష్ట్రీయ లోక్‌దళ్ పేర్కొంది.



### మాయావతి తీరింతే

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో ఢక్కామొక్కీలు తిన్న మాయావతి ఎప్పుడు ఎవరితో పొత్తు పెట్టుకుంటారో, ఎప్పుడు తెగతెంపులు చేసుకుంటారో అర్థం కాదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. తన మూడ్‌ను బట్టి ఆమె నిర్ణయాలు తీసుకుంటారని వారన్నారు. 1993లో ఆమె మొదటిసారి ఎస్పీతో పొత్తు పెట్టుకుని అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లారు. రెండేళ్ల తర్వాత కటీఫ్ చెప్పారు. 1995లో బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు. తర్వాత 4నెలలకే దానికి టాటా చెప్పేశారు. 1996లో కాంగ్రెస్‌తో జట్టు కట్టారు. 1997లో బీజేపీతో కలిసి పోటీ చేసి సీఎం అయ్యారు. 2002లో బీజేపీతో జతకట్టారు. మూడునెలల్లోపే పొత్తును విచ్ఛిన్నం చేశారు. 2018 ఉప ఎన్నికల్లో ఎస్పీతో పొత్తు పెట్టుకుని లాభం పొందారు. 2019లో ఆ పొత్తు కొనసాగించారు. ఈ ఎన్నికల్లో ఎస్పీ కంటే బీఎస్పీ ఎక్కువ లాభపడింది. అయినాసరే ఇప్పుడు ఎస్పీతో పొత్తును తెంచేసుకున్నారు.

# చిన్నారుల మృత్యువాతపై సుప్రీం దిగ్భ్రాంతి

- బిహార్ ఘటనలపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు నోటీసులు
- వారం రోజుల్లోగా సమాధానమివ్వాలని ఆదేశం



**న్యూఢిల్లీ:** బిహార్‌లోని ముజఫర్‌పూర్‌లో మెదడువాపు వ్యాధి కారణంగా 150కి పైగా చిన్నారులు మృత్యువాత పడటంపై సుప్రీంకోర్టు తీవ్ర విచారం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో వైద్య సదుపాయాలు, పోషకాహారం, పారిశుద్ధ్యం, పరిశుభ్రత పరిస్థితులు ఎలా ఉన్నాయో చెబుతూ వారంలోగా అఫిడవిట్ దాఖలు చేయాలని బిహార్ ప్రభుత్వంతోపాటు కేంద్రాన్ని ఆదేశించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. బిహార్‌లో మెదడువాపు వ్యాధి కారణంగా పెద్ద సంఖ్యలో చిన్నారులు మృత్యువాత పడటంపై సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. రాష్ట్రంలో వైద్య సదుపాయాలు, పోషకాహారం, పారిశుద్ధ్యం వంటి వాటిపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. తక్షణమే ఈ సదుపాయాలను ఏర్పాటు చేయాల్సిందిగా పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యాధిని అరికట్టేందుకు బిహార్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవట్లేదంటూ ఇద్దరు న్యాయవాదులు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. వాదనల సందర్భంగా.. గతంలోనూ ఇలాంటి మరణాలే ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకున్నాయని పిటిషనర్లలో ఒకరైన న్యాయవాది మనోహర్ తెలపగా.. దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా యూపీ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. ఈ మరణాలకు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఇలాంటి మరణాలు ప్రతి ఏటా సంభవిస్తున్నా.. పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. బిహార్‌లో మరణించిన చిన్నారులకు రూ.10 లక్షలు పరిహారం అందజేయాలని కోరారు. చిన్నారులు మరణించిన ముజఫర్‌పూర్ సహా ఇతర ప్రాంతాలకు వైద్య నిపుణులతో కూడిన ప్యానల్‌ను కేంద్రం ఏర్పాటు చేయాలని తెలిపారు. వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న ప్రాంతాలకు 100 మొబైల్ ఐసీయూ యూనిట్లను పంపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై వారంలోగా సమాధానమివ్వాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణను 10 రోజులపాటు వాయిదా వేసింది.

# 'జార్ఖండ్ మూక దాడి' వ్యక్తి మృతి

- జై శ్రీరామ్ అనాలంటూ చితకబాదిన గ్రామస్తులు
- తీవ్ర గాయాలతో నాలుగు రోజుల తర్వాత మృతి



తబ్రేజ్‌ను కట్టేసి కొడుతున్న దృశ్యం

**సెరైకేలా–ఖర్సావన్(జార్ఖండ్):** మోటార్ సైకిల్ దొంగతనం చేశాడన్న అనుమానంతో జార్ఖండ్‌లో జనసమూహం చేతిలో తీవ్రంగా దెబ్బలు తిన్న యువకుడు మృతి చెందాడు. తీవ్రగాయాల పాలైన తబ్రేజ్ అన్సారీ (24) నాలుగు రోజుల తర్వాత మృతి చెందాడని పోలీసులు తెలిపారు. జంషెడ్‌పూర్‌లోని టాటా మెయిన్ ఆస్పత్రిలో ఈనెల 22న తబ్రేజ్ మృతి చెందినట్లు ధ్రువీకరించారని, అతని మృతిపై దర్యాప్తుకు ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. 'ఈ ఘటనపై సిట్‌ను ఏర్పాటు చేశాం'అని ఎస్పీ కార్తీక్ పేర్కొన్నారు. తబ్రేజ్‌ను జై శ్రీరామ్ అని మతపరమైన నినాదాన్ని ఇవ్వమనడంపైనా కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు పప్పు మండల్ అనే వ్యక్తిని అరెస్టు చేశామని, దీనిపై విచారణ జరుపుతున్నామన్నారు. అలాగే ఈ ఘటనకు సంబంధించి తబ్రేజ్ భార్య షాయిస్తా పర్వీన్ పలువురి పేర్లతో ఫిర్యాదు ఇచ్చారని తెలిపారు. గత మంగళవారం జంషెడ్‌పూర్ నుంచి ఇక్కడి గ్రామానికి తన ఇద్దరు స్నేహితులతో కలిసి వస్తున్న తబ్రేజ్ అన్సారీ అనే ముస్లిం యువకుడిని సెరైకేలా–ఖర్సావన్ జిల్లా ధట్కిడీ గ్రామస్తులు మోటార్ సైకిల్ దొంగతనం చేశారంటూ అడ్డుకున్నారు. ఈ ఘటనలో మిగతా ఇద్దరు తప్పించుకోగా, తబ్రేజ్ గ్రామస్తులకు పట్టుబడ్డాడు. అనంతరం తబ్రేజ్‌ను స్తంభానికి కట్టేసి కర్రలతో ఆ రాత్రంతా కొట్టారు. అలాగే జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ నినాదాలివ్వాలని బలవంతం చేశారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతన్ని బుధవారం గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు తబ్రేజ్‌పై దొంగతనం అభియోగాలపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం అయింది.



తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా నీటిసంక్షోభం నేపథ్యంలో సోమవారం చెన్నైలో ఆందోళనకు దిగిన డీఎంకే కార్యకర్తలు. ప్రభుత్వం వెంటనే నీటిసమస్యకు పరిష్కారం చూపకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ హెచ్చరించారు

# విదేశాల్లో 34 లక్షల కోట్ల నల్లధనం

- భారతీయులు దాచినట్లుగా గుర్తింపు
- తాజా అధ్యయనంలో వెల్లడి



**న్యూఢిల్లీ:** భారతీయులు తమ నల్లధనాన్ని భారీ మొత్తంలో విదేశాల్లో దాచినట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. విదేశాల్లో భారతీయుల నల్లధనం రూ.15 లక్షల కోట్ల నుంచి రూ.33.9 లక్షల కోట్ల వరకు ఉంటుందని స్పష్టమైంది. ఇదంతా కేవలం 1980–2010 సంవత్సరాల మధ్య దాచిన మొత్తమే అని తేలింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనామిక్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐఎఫ్‌ఎమ్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ అండ్ ఫైనాన్స్ (ఎన్‌ఐపీఎఫ్‌పీ) సంస్థలు వేర్వేరుగా ఈ అధ్యయనాలు నిర్వహించాయి. వీటన్నింటినీ కలిపి 'దేశ, విదేశాల్లో భారతీయులు దాచిన నల్లధనం వివరాలు'పేరిట నివేదికలో పొందుపరిచాయి. దీనికి సంబంధించిన స్టాండింగ్ కమిటీ నివేదికను సోమవారం లోక్‌సభ ముందుంచాయి. దేశ విదేశాల్లో కచ్చితంగా ఇంత మొత్తంలో నల్లధనం ఉంటుందని చెప్పడం కష్టమని.. కానీ సుమారుగా అంచనా వేయగలమని పేర్కొన్నాయి. భారతీయులు తమ వద్ద ఉన్న నల్లధనాన్ని రియల్ ఎస్టేట్, మైనింగ్, ఫార్మాస్యూటికల్స్, పాన్‌మసాలా, గుట్కా, పొగాకు, విద్య, సినిమాలు వంటి రంగాల్లో పెట్టుబడిగా పెడుతున్నారని అధ్యయనంలో గుర్తించాయి. 1980–2010 సంవత్సరాల మధ్య విదేశాల్లో ఉన్న భారతీయుల నల్లధనం రూ.26.6 లక్షల కోట్ల నుంచి రూ.33.9 లక్షల కోట్ల వరకూ ఉంటుందని ఎన్‌సీఏఈఆర్ తన అధ్యయనంలో వెల్లడించింది. 1990–2008 సంవత్సరాల మధ్య రూ.9,41,837 కోట్ల నల్లధనాన్ని భారతీయులు విదేశాల్లో దాచారని ఎన్‌ఐఎఫ్‌ఎమ్ తెలిపింది. కాగా, దేశ విదేశాల్లో ఉన్న భారతీయుల నల్లధనంపై నివేదిక తయారుచేయాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ 2011లో ఈ మూడు సంస్థలను కోరింది. అయితే నల్లధనానికి సంబంధించి ఈ మూడు సంస్థల నివేదికలు ఒకేలా ఉంటాయని భావించలేమని ముఖ్య ఆర్థిక సలహాదారు అభిప్రాయపడ్డారని పార్లమెంటరీ ప్యానల్ తన నివేదికలో వెల్లడించింది. దీనిని ప్రాథమిక నివేదికగానే భావించాల్సి ఉందని.. దీనిపై మరింత అధ్యయనం జరగాల్సి ఉందని అభిప్రాయపడింది.

### హ్యూమానిటీస్‌కే క్రేజ్

**న్యూఢిల్లీ:** అభ్యుదయ భావాలకు నెలవైన ఢిల్లీ యూనివర్సిటీలో అత్యధిక మంది విద్యార్థులు హ్యూమానిటీస్ కోర్సులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల దరఖాస్తులకు చివరి గడువు ముగిసేసరికి బీఏ ఇంగ్లీష్ లిటరేచర్‌కి ఈ యేడాది అత్యధికంగా దరఖాస్తులొచ్చాయి. జూన్ 22 నాటికి ఢిల్లీ యూనివర్సిటీ డిగ్రీ కోర్సులకు మొత్తం 3,67,895 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా 1,42,979 దరఖాస్తులు బీఏ ఇంగ్లిషు సబ్జెక్టు కోసం వచ్చినవే. ఆ తరువాత బీఏ పొలిటికల్ సైన్స్‌కి 1,30,240 దరఖాస్తులొచ్చాయి. ఢిల్లీ యూనివర్సిటీలోని ఇతర టాప్ టెన్ కోర్సుల్లో బీఏ సైకాలజీ, బీఏ జర్నలిజం, సోషియాలజీ, జాగ్రఫీ ఉన్నాయి.

### కూలీ కొడుకు.. జేఈఈలో మెరిశాడు



తల్లిదండ్రులతో లేఖ్‌రాజ్ భీల్

**కోట:** కొన్నేళ్ల కిందటి వరకు లేఖ్‌రాజ్ భీల్ జేఈఈ మెయిన్ పరీక్ష గురించి విని ఉండడు. అలాంటిది ఈ ఏడాది జేఈఈ మెయిన్‌లో మంచి ర్యాంకు సాధించి రికార్డు సృష్టించాడు. రాజస్తాన్‌లోని ఓ గిరిజన గ్రామానికి చెందిన మొదటి ఇంజనీర్‌గా లేఖ్‌రాజ్ ఘనత సాధించనున్నారు. లేఖ్‌రాజ్ తల్లిదండ్రులు మంగీలాల్, సర్దారీ భాయ్ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (ఎమ్‌ఎన్‌ఆర్‌ఈజీఏ) కింద పని చేసే రోజువారీ కూలీలు. 'నాకు ఇంజనీర్ అంటే ఏంటో తెలీదు. నా కొడుకు డిగ్రీ చదువుతాడని నేను కలలో కూడా అనుకోలేదు. మా గ్రామం నుంచి భీల్ వర్గం నుంచి ఇంజనీర్ అవుతున్న మొదటి వ్యక్తి నా కొడుకు కావడంతో నా ఆనందానికి అవధుల్లేవు'అని చమర్చిన కళ్లతో లేఖ్‌రాజ్ తండ్రి మంగీలాల్ అన్నారు. తమ కుటుంబ పరిస్థితి లేఖ్‌రాజ్‌తో చక్కదిద్దుకుంటుందనే నమ్మకం ఉందని తెలిపారు. తమ గ్రామంలో చదువుకోకుండా కూలీలుగా మిగిలిపోతున్న వారికి చదువు విలువను నేర్పాలనుకుంటున్నట్లు లేఖ్‌రాజ్ తెలిపారు.

# అంబులెన్సుకు దారివ్వకుంటే రూ.10 వేల ఫైన్

- హెల్మెట్ లేకుంటే రూ.వెయ్యి జరిమానా, 3 నెలలు లైసెన్స్ రద్దు
- మైనర్లు యాక్సిడెంట్ చేస్తే తల్లిదండ్రులే దోషులు
- వారికి మూడేళ్ల జైలుశిక్ష
- కేంద్ర కేబినెట్ ఆమోదం



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సోమవారం నాడిక్కడ సమావేశమైంది. ఈ భేటీలో మోటార్ వాహనాల(సవరణ) బిల్లు–2019తో పాటు డీఎన్ఏ ప్రొఫైలింగ్ బిల్లు–2019కు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించేవారికి భారీ జరిమానాలు విధించేలా నూతన బిల్లును కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. దీనిప్రకారం అంబులెన్స్, ఇతర అత్యవసర సేవల వాహనాలను దారి ఇవ్వకుంటే రూ.10,000 వరకూ జరిమానా విధిస్తారు. డ్రైవింగ్ చేసేందుకు అనర్హులైనప్పటికీ వాహనం నడిపితే రూ.10 వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఇక డ్రైవింగ్ లైసెన్స్ ఉల్లంఘనలకు పాల్పడే వాహనదారులకు రూ.లక్ష వరకూ జరినామా విధించేలా బిల్లును రూపొందించారు.

**సీటు బెల్ట్ లేకుంటే లైసెన్స్ రద్దు..**

రోడ్లపై అతివేగంతో దూసుకెళ్లే వాహనదారులకు రూ.1,000 నుంచి రూ.2,000 జరిమానా విధించాలని బిల్లులో నిబంధనలు చేర్చారు. ఇక ఇన్సూరెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.2,000 కట్టాలి. వాహనాల్లో సీటు బెల్టు ధరించకుంటే రూ.వెయ్యి జరిమానా చెల్లించడంతో పాటు 3 నెలలు డ్రైవింగ్ లైసెన్స్ రద్దుచేస్తారు. ద్విచక్ర వాహనాలపై హెల్మెట్లు లేకుండా ప్రయాణిస్తే రూ.1,000 జరిమానాతో పాటు 3 నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దవుతుంది. ఒకవేళ మైనర్ పిల్లలు రోడ్డు ప్రమాదానికి కారకులైతే వారి తల్లిదండ్రులు/ సంరక్షకులను దోషులుగా నిర్ధారిస్తారు. సదరు తల్లిదండ్రులు/ సంరక్షకులకు మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.25,000 జరిమానా విధించవచ్చు. ఇలాగే ప్రమాదానికి కారణమైన రిజిస్ట్రేషన్‌ను రద్దుచేస్తారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఉల్లంఘించే వాహనదారులకు విధిస్తున్న రూ.100 జరిమానాను ఈ బిల్లులో రూ.500కు పెంచుతూ బిల్లును రూపొందించారు. అధికారుల ఆదేశాలు పాటించకుంటే విధించే పెనాల్టీని రూ.500 నుంచి రూ.2 వేలకు పెంచారు. ఒకవేళ లైసెన్స్ అందుకోకుండానే వాహనాలు నడిపితే, లైసెన్స్ లేకుండా నడిపేవారికి రూ.5,000 జరిమానా విధించనున్నారు. అలాగే ర్యాష్ డ్రైవింగ్ చేసేవారికి రూ.5,000, మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10,000 జరిమానా కట్టాల్సి ఉంటుంది. ఓవర్‌లోడింగ్ వాహనాలు రూ.20 వేల పెనాల్టీ కట్టేలా బిల్లులో నిబంధనల్ని చేర్చారు. ఒకవేళ ఈ నిబంధనలను స్వయంగా సంబంధిత అధికారులు ఉల్లంఘిస్తే జరిమానా రెట్టింపు అవుతుంది.

**డీఎన్ఏ ప్రొఫైలింగ్ బిల్లుకు ఆమోదం..**

నేరాల్లో వ్యక్తులను గుర్తించేందుకు ఉద్దేశించిన డీఎన్ఏ ప్రొఫైలింగ్ బిల్లు–2019కు కేబినెట్ ఓకే చెప్పింది. బిల్లు ప్రకారం ప్రభుత్వం జాతీయ డీఎన్ఏ బ్యాంకు, ప్రాంతీయ డీఎన్ఏ బ్యాంకులను ఏర్పాటు చేస్తుంది. ఈ బ్యాంకుల్లో నేరం జరిగిన ప్రాంతంలోని డేటా, నిందితుల డేటా, అదృశ్యమైన వ్యక్తుల డేటా, గుర్తుతెలియని మృతుల డేటాను విడివిడిగా నిర్వహించాలి. అలాగే ఈ బిల్లు ప్రకారం డీఎన్ఏ రెగ్యులేటరీ బోర్డును ఏర్పాటు చేస్తారు. డీఎన్ఏను విశ్లేషించే ప్రతీ ల్యాబ్ ఈ సంస్థ నుంచి ధ్రువీకరణ పొందాల్సి ఉంటుంది. ఏడేళ్లు అంతకంటే ఎక్కువశిక్ష పడే నేరాలు లేదా హత్య కేసుల్లో డీఎన్ఏ సేకరణకు నిందితుల అంగీకారం అక్కర్లేదు. ఈ రెండు బిల్లులను త్వరలోనే పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు.



### బీజేపీలో చేరిన జైశంకర్

**న్యూఢిల్లీ:** విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా ఆధ్వర్యంలో ఆయన పార్టీలో చేరారు. మే 30న ఆయన కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలల్లోగా పార్లమెంటుకు ఎన్నికవ్వాల్సి ఉంటుంది. కాగా ఆయన గుజరాత్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యే అవకాశం ఉంది. గతంలో ఈయన విదేశాంగ కార్యదర్శిగా పని చేశారు. ఏడవ పాస్‌పోర్ట్ సేవ దినోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన భద్రతతో కూడిన ఈ–పాస్‌పోర్టులను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ప్రతి లోక్‌సభ నియోజక వర్గానికి ఓ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ వ్యవస్థలో పారదర్శకతతో పాటు వేగాన్ని, కచ్చితత్వాన్ని తీసుకొస్తామన్నారు. పాస్‌పోర్ట్ దరఖాస్తు చేశాక జరిగే పోలీసు తనిఖీని 19 రోజులకు తీసుకొచ్చామని, ఇంకా తగ్గించే ప్రయత్నాలు చేస్తామన్నారు. ఈ ప్రక్రియల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళలు వేగవంతమైన చర్యలు తీసుకోవడంలో ముందున్నాయని అన్నారు.

# గుర్తింపు ధ్రువీకరణగా ఆధార్

- ఆధార్‌కు సవరణలతో లోక్‌సభలో బిల్లు
- ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన శిక్షలకు వీలు

**న్యూఢిల్లీ:** ఆధార్ సంఖ్యను గుర్తింపు ధ్రువీకరణగా వాడుకునేందుకు వీలు కల్పించే బిల్లును కేంద్రం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఆధార్ చట్టాన్ని ప్రతిపాదించిన తాజా సవరణల ప్రకారం బ్యాంకు అకౌంట్లు ప్రారంభించేందుకు, మొబైల్ ఫోన్ కనెక్షన్ పొందేందుకు ఆధార్‌ను వాడుకోవచ్చు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి కఠిన శిక్షలు పడేందుకు ఇందులో వీలు కల్పించారు. ఆధార్ చట్టం–2016 సవరణ బిల్లు ఉభయసభల ఆమోదం పొందితే ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో చట్టంగా అమల్లోకి వస్తుంది. లోక్‌సభలో చర్చ సందర్భంగా బిల్లులోని అంశాలపై ఆర్ఎస్పీ సభ్యుడు ప్రేమ్‌చంద్రన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపాదిత అంశాలు సుప్రీంకోర్టు తీర్పును తీవ్రంగా ఉల్లంఘించేలా ఉన్నాయన్నారు. ప్రైవేట్ సంస్థలకు ఆధార్ డేటాను అప్పగించడం ప్రాథమిక హక్కులు, ముఖ్యంగా వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనన్నారు. దీనిపై సమాచార, సాంకేతిక శాఖల మంత్రి రవి శంకర్ ప్రసాద్ వివరణ ఇచ్చారు. 'ప్రతిపాదిత అంశాలన్నీ సుప్రీంకోర్టు ఆదేశాలకు లోబడే ఉన్నాయి'అని తెలిపారు. ఆధార్ నిబంధనలు ఉల్లంఘించినా, దుర్వినియోగపరిచినా రూ.కోటి వరకు జరిమానా విధించేలా ఈ బిల్లులో ప్రభుత్వం ప్రతిపాదించింది. ఒక వ్యక్తి ఆధార్ సంఖ్యను రహస్యంగా ఉంచే వర్చువల్ గుర్తింపు సంఖ్యను ఉపయోగించేందుకు ఇందులో ప్రతిపాదించింది. ఆధార్ డేటాను తస్కరించిన సంస్థలకు శిక్షను 10 ఏళ్లకు పెంచింది.

**జీరో అవర్ అంశాలపై..**

జీరో అవర్‌తోపాటు ప్రత్యేక ప్రస్తావనాంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు 30 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని, లేకుంటే ప్రత్యామ్నాయాలు ఆలోచించాలని రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు మంత్రులకు సూచించారు. సోమవారం ఆయన రాజ్యసభలో మాట్లాడారు.

# చమురు ఓడల రక్షణ మీ బాధ్యతే

- ఇతర దేశాలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచన

**వాషింగ్టన్:** గల్ఫ్ ప్రాంతంలో ప్రయాణించే చమురు ఓడల రక్షణ బాధ్యత ఆయా దేశాలే చూసుకోవాలని, ప్రమాదకరమైన ఆ ప్రాంతంపై తమకు అంతగా ఆసక్తి లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. గల్ఫ్‌లో పెరుగుతున్న ఉద్రిక్తతలపై ట్రంప్ సోమవారం ట్వీట్‌చేశారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు లేకుండా చూడటం, ఉగ్రవాదాన్ని ఆ దేశం ప్రోత్సహించకుండా చేయడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. హోర్ముజ్ జలసంధిని మూసివేస్తామంటున్న ఇరాన్ బెదిరింపులపై ఆయన.. 'మా వద్ద చాలినన్ని చమురు నిల్వలున్నాయి. ఆ ప్రాంతంతో మాకు అవసరం లేదు. అక్కడ మేం రక్షణ బాధ్యతలు చేపట్టడం లేదు. గల్ఫ్‌లో ప్రయాణించే చమురు నౌకల భద్రత బాధ్యత సంబంధిత దేశాలదే' అని పేర్కొన్నారు. ఇరాన్‌పై మరిన్ని కఠిన ఆంక్షలు విధించేందుకు వీలు కల్పించే ఉత్తర్వుపై ట్రంప్ సోమవారం సంతకం చేశారు. దీని ప్రకారం ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖొమైనీ, ఇతర ఉన్నతాధికారుల ఆర్థిక లావాదేవీలను అమెరికా నిరోధించనుంది.



### మోదీ, పుతిన్‌లతో భేటీ కానున్న జిన్‌పింగ్

**బీజింగ్:** జి–20 దేశాధినేతల శిఖరాగ్ర సమావేశం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌లతో చైనా అధినేత జిన్‌పింగ్ భేటీ కానున్నారు. ఈ నెల 28, 29వ తేదీల్లో జపాన్‌లోని ఒసాకాలో జి–20 దేశాల శిఖరాగ్ర సమావేశం జరగనుంది. దిగుమతులపై భారీగా పన్నులు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న ఏకపక్ష, రక్షణాత్మక విధానాలపై ఈ సందర్భంగా వీరు ప్రముఖంగా చర్చించనున్నారని చైనా అధికారులు తెలిపారు. భారత్, రష్యాలతోపాటు బ్రిక్స్‌లోని ఇతర సభ్య దేశాలు బ్రెజిల్, దక్షిణాఫ్రికాలతోనూ జిన్‌పింగ్ చర్చలు జరుపుతారని పేర్కొన్నారు.

### బెంగాల్లో బీజేపీ ఖాతాలో తొలి జడ్పీ

**న్యూఢిల్లీ/కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో ఘర్షణలు, వైద్యుల సమ్మెతో ఇప్పటికే సతమతమవుతున్న మమతా బెనర్జీ ప్రభుత్వానికి మరో ఎదురుదెబ్బ తగిలింది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కి చెందిన 10 మంది జిల్లా పరిషత్ సభ్యులు బీజేపీలో చేరారు. వీరితోపాటు ఎమ్మెల్యే చంపామేరీ, దక్షిణ దినజ్‌పూర్ జిల్లాకు చెందిన ఓ సీనియర్ నాయకుడు సోమవారం కమలం గూటికి చేరుకున్నారు. జడ్పీల చేరికతో తొలిసారి బీజేపీ దక్షిణ దినజ్‌పూర్‌ను తన ఆధీనంలోకి తీసుకుంది. టీఎంసీ పార్టీ నిర్మాణంలో భాగస్తుడైన జిల్లా నాయకుడు బిప్లాబ్ మిత్ర దూరమవడం పార్టీకి ఎదురుదెబ్బ అని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కాగా, వారికి దమ్ముంటే రాజీనామా చేసి పార్టీని వీడాలని తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఫిర్హాద్ హకీమ్ సవాల్ విసిరారు.

# సాక్షి

మంగళవారం, జూన్, 25

## మమత 'మందుపాతర'

తృణమూల్ కాంగ్రెస్ అధినేత, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎప్పుడేం మాట్లాడతారో, ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో ఊహించడం అసాధ్యం. తనకు సబబనిపిస్తే ఏమైనా అనడం, ఎంతటి నిర్ణయం తీసుకోవడానికైనా వెరవకపోవడం ఆమె నైజం. ప్రభుత్వంలో పనులు చేసిపెడతామని ఆశచూపి తృణమూల్ నేతలు, ఇతరులు జనం నుంచి వసూలు చేసిన డబ్బంతటినీ వెనక్కిచ్చేయాలంటూ ఇటీవల ఆమె చేసిన ప్రకటన మందుపాతరలా పేలి పార్టీలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధుల ఇళ్లను జనం ఘెరావ్ చేయడం, తీసుకున్న లంచం డబ్బు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయడం... ఫలానా నేత ఇన్ని లక్షలు తీసుకున్నాడని బాహాటంగా ప్రకటించడం లాంటి పరిణామాలు ఆ పార్టీని ఊపిరాడకుండా చేస్తున్నాయి. దీనికి కొనసాగింపుగా కావొచ్చు... ప్రజలిచ్చే ఫిర్యాదులను తేలిగ్గా తీసుకుని పట్టించుకోని పోలీసులపై తీవ్ర చర్యలుంటాయని కోల్‌కతా పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. మొన్న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ తీవ్రంగా దెబ్బతినడం, బీజేపీ ఓట్ల శాతం గణనీయంగా పెరగడం మమతకు మింగుడుపడటం లేదు. రాష్ట్రంలోని 42 స్థానాల్లో తృణమూల్‌కు 22 దక్కగా, బీజేపీకి 18 లభించాయి. అసెంబ్లీ స్థానాలవారీగా చూస్తే బీజేపీకి 121 చోట్ల ఆధిక్యతలో ఉన్నదని నిపుణులు చెబుతున్నారు. అందుకే రెండేళ్లలో ముంచుకొస్తున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీకి 'షాక్ ట్రీట్‌మెంట్' తప్పనిసరని ఆమె భావించినట్టు కనబడుతోంది. సహజంగానే ఇలాంటి చర్యలు అనుద్దేశిత పర్యవసానాలకు దారితీస్తాయి. ఇప్పుడు బెంగాల్‌లో జరుగుతున్నది అదే. ఒక గ్రామంలో నిండు చూలాలిగా ఉన్న పంచాయతీ సభ్యురాలు జనం తమ ఇంటిపై దండెత్తబోతున్నారని తెలిసి 'బతుకుజీవుడా' అనుకుంటూ అజ్ఞాతంలోకి పోయింది. మరోచోట ఒక నాయకుడు ఉరేసుకుని చనిపోయాడు. తృణమూల్ రాజ్యసభ సభ్యుడు శంతనుసేన్, ఆ పార్టీ కౌన్సిలర్ కలసి 2012 మొదలుకొని తననుంచి లక్షల రూపాయలు లంచాలు తీసుకున్నారని కోల్‌కతాలో ఒక రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఆరోపించాడు. ఇవన్నీ చూశాక ఆ పార్టీ స్వరం మార్చవలసి వచ్చింది. మమత మాటల్ని మీడియా వక్రీకరించిందని ప్రకటించింది. పార్టీ నేతలు, ప్రజాప్రతినిధుల్లో 99.99 శాతంమంది నిజాయితీపరులని ఆమె ప్రశంసించారని, ఇతర పార్టీలనుంచి వచ్చిన 0.01 శాతం మందితోనే సమస్యలున్నాయని చెప్పారని తృణమూల్ నేతలు వివరిస్తున్నారు. ఘెరావ్‌ల వెనక బీజేపీ ఉన్నదని ఆరోపిస్తున్నారు. ఇందులో నిజముంటే ఉండొచ్చు.

తృణమూల్‌లో పెనుతుపాను రేపుతున్న ఈ పరిణామం చివరికెలా ముగుస్తుందన్న సంగతలా ఉంచితే మన దేశంలో రాజకీయ వ్యవస్థ, దాంతోపాటు ఇతర వ్యవస్థలూ భ్రష్టుపట్టాయన్నది కాదనలేని సత్యం. అవినీతిని అరికట్టడానికి, వ్యవస్థలను ప్రక్షాళన చేయడానికి ఉద్దేశించిన విభాగాల పనితీరు కూడా అంతంతమాత్రమే. చివరికిది వేరుపురుగులా ప్రజాస్వామ్యాన్ని సమూలంగా ధ్వంసం చేస్తుందన్న భయాందోళనలు చాలామందిలో ఉన్నాయి. తర్వాత ఏం చెప్పినా, ఏం చేసినా... అవినీతి విషయంలో సొంత పార్టీలో కనబడుతున్న ధోరణులను ఇలా బాహాటంగా ప్రస్తావించడం ద్వారా మమత ఒక మంచిపని చేశారు. రాజకీయ అవినీతిపై ఒక పెద్ద చర్చకు తెరలేపారు. ఆమె ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడిలా 'ఎందుకు ఓడిపోయామో తెలియట్లేదు...' అంటూ నంగనాచితనాన్ని ప్రదర్శించలేదు. తృణమూల్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు గ్రామస్థాయి వరకూ ఆధిపత్యం చలాయిస్తూ, సాధారణ ప్రజానీకానికి అందాల్సిన సంక్షేమ పథకాలను నియంత్రిస్తున్నారని, వాటిని తమ ఎదుగుదలకు నిచ్చెనగా వాడుకుంటున్నారని చాన్నాళ్లుగా ఆరోపణలొస్తున్నాయి. ఏ పని జరగాలన్నా డబ్బు విదల్చవలసి వస్తున్నదని, అదేమని ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తున్నారని సాధారణ ప్రజానీకం వాపోయిన సందర్భాలున్నాయి. ఆత్మహత్య చేసుకున్న నాయకుడు 'ఈమధ్యే మా పార్టీలోకి వచ్చాడ'ని, 'అతడెవరో తెలియద'ని తృణమూల్ నేతలు ఇప్పుడంటున్నా... అతగాడికి పెద్ద పెద్ద నేతలు తెలుసని, ఉద్యోగం కోసం ఆ నాయకుడికి లక్షన్నర సమర్పించుకున్నానని, గట్టిగా అడిగితే ఇద్దరు మహిళలతో తనపై అత్యాచారం కేసులు పెట్టించాడని ఒక యువకుడు చెబుతున్నాడు. పరిస్థితి ఇంతగా దిగజారింది కనుకే మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో తృణమూల్ బాగా దెబ్బతింది. అయితే అవినీతి అంటూ జరిగితే అది గ్రామీణ ప్రాంతాల్లోని ఛోటా నేతలకే పరిమితం కాదు. పైవరకూ పంపకాలుండనిదే ఇదంతా ఇంతగా వేళ్లూనుకోదు. అందుకు బాబు హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకున్న అవినీతే తిరుగులేని ఉదాహరణ. గ్రామాల్లోని జన్మభూమి కమిటీలు మొదలుకొని ఉన్నతస్థాయి నేతల వరకూ అవినీతి ఎంతగా పెనవేసుకుపోయిందో అందరికీ స్పష్టమైంది. 'వేరే పార్టీవారికి పనులు చేసేది లేద'ని సాక్షాత్తూ ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తే ప్రకటిస్తే ఇక అట్టడుగు స్థాయిలో పనిచేసే కార్యకర్తల్ని నియంత్రించేదెవరు?


ఇప్పుడు మమత ప్రకటనను ఆసరా చేసుకుని ఆ పార్టీలో సంక్షోభాన్ని సృష్టించి దాన్ని బలహీనపర్చాలనుకునే పార్టీలకు ఆ రాష్ట్రంలో కొదవలేదు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్‌ను మట్టికరిపించి అక్కడ అధికారంలోకి రావాలని బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. కానీ అంతకంటే ప్రధానంగా ప్రతి పార్టీలోనూ అవినీతి గురించి అంతర్మథనం జరిగితే ప్రజలకు ఎంతో కొంత మేలు కలుగుతుంది. ఎదుటి పార్టీకి చెందినవారిపై ఎలాంటి అవినీతి ఆరోపణలున్నా జంకూ గొంకూ లేకుండా చేర్చుకోవడం, కింది స్థాయిలో ఏం జరుగుతున్నా పట్టనట్టు వ్యవహరించడం, అంతా సవ్యంగా ఉన్నదని దబాయించడం వంటి ధోరణులకు పార్టీలు స్వస్తి చెప్పడం అవసరం. ఎవరేమనుకుంటే మనకేమిటని భావిస్తే పార్టీలకు మాత్రమే కాదు... మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థకే చేటు కలుగుతుంది.

### గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, తిథి బ.అష్టమి రా.12.51 వరకు, తదుపరి నవమి నక్షత్రం ఉత్తరాభాద్ర రా.3.07 వరకు, తదుపరి రేవతి, వర్జ్యం ప.11.18 నుంచి 1.03 వరకు, దుర్ముహూర్తం ఉ.8.06 నుంచి 9.01 వరకు, తదుపరి రా.10.55 నుంచి 11.39 వరకు అమృతఘడియలు... రా.9.50 నుంచి 10.44 వరకు.

**సూర్యోదయం :** 5.31
**సూర్యాస్తమయం:** 6.33
**రాహుకాలం :** ప. 3.00 నుంచి 4.30 వరకు
**యమగండం :** ఉ.9.00 నుంచి 10.30 వరకు

# ఈ కుమ్మక్కు దేని కోసం?!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

**తెలుగుదేశం పార్టీ ఘోరపరాజయం చాటున ఆంధ్రప్రదేశ్‌లో కాలూనుకోవచ్చని బీజేపీ కేంద్రనాయకత్వం భావించింది. దీనికోసం అవినీతిపరులుగా ముద్రపడిన టీడీపీ నేతలను తమలో కలుపుకుపోవడానికి కూడా బీజేపీ వెనుకాడలేదు. ఒకవైపు టీడీపీ అవినీతి ముఠాకి తమ తలుపులు తెరిచి ఉంచారు. మరోవైపున ఏపీలో వైఎస్ జగన్ ప్రభుత్వానికి అండదండగా ఉంటామని బీజేపీ నేతలు చెబుతున్నారు. సుజనా చౌదరీ, సీఎం రమేష్ లాంటి టీడీపీ నాయకులు, మంత్రులూ ఎంతటి మోసకారులో గ్రహించాలంటూ జీవీఎల్ రాజ్యసభ నైతిక సూత్రాల నిర్ణాయక సంఘానికి రాసిన లేఖ తడి ఆరకముందే బీజేపీలో వారి చేరికను బాహాటంగా సమర్థించుకోవడంలోని మతలబేంటి?**

**"ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి నెలరోజులు కూడా అయిందో లేదో.. అప్పుడే 2024లో మేమే రాష్ట్రంలోకి వస్తామంటూ బీజేపీ, టీడీపీ, జనసేన భారీగా ప్రకటనలు చేస్తున్నాయి. కాగా జగన్ రానున్న అయిదేళ్లకు సరిపడా ప్రణాళికలు పెట్టుకుని వాటి అమలుకు 2024ను లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా ఒకేమారు కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాల్లోనూ ఎన్నికలు జరిపించాలన్న సరికొత్త విధానాన్ని బీజేపీ ప్రకటించింది. కానీ సారాంశం– 2022 నాటికి దేశంలో అధికారంలో ఉన్న రాష్ట్రాలతోపాటు గడువు ముగిసిన అసెంబ్లీలు కలుపుకుని ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తారని సమాచారం. ఫలితంగా, అప్పటికి ఇంకా రెండేళ్లు అధికారంలో ఉండాల్సిన జగన్ ప్రభుత్వం కూడా మధ్యంతరంగానే ఎన్నికలకు సిద్ధం కావలసి వస్తుంది."**
**– సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు *(23-06-2019)***

### రెండో మాట



ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీకి, లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానికి దాని నాయకత్వానికి ఇప్పట్లో తేరుకోలేని భారీ స్థాయిలో శృంగభంగమయింది. జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ అఖండవిజయంతో అధికారంలోకి వచ్చింది. టీడీపీ ఒక రాజకీయ శక్తిగా 'అంత్యక్రియలు' కూడా జరుపుకునే దశలో ఉంది. ఈ అంత్యక్రియలకు పౌరోహిత్యాన్ని ప్రత్యక్షంగా వహించిన ఆ పార్టీ రాజ్యసభా పక్షం కాస్తా అకస్మాత్తుగా బీజేపీలో విలీనమైపోయి తీర్థ ప్రసాదాలు పుచ్చుకుంది. ఈ పరిణామం బాబు ఆశీస్సులతోనే జరిగి ఉంటుందనడానికి ప్రధాని మోదీ, బీజేపీ జాతీయపక్షానికి మరో రథికుడైన అమిత్ షాల ఆశీస్సులను కూడా టీడీపీ రాజ్యసభాపక్షం పొందడమే నిదర్శనం! అలాగే, ఈ పరిణామానికి ముందస్తు సూచనగా కొన్నాళ్ల క్రితం తిరుపతిలో బీజేపీ బహిరంగ సభలో మాట్లాడుతూ ప్రధాని మోదీ త్వరలోనే ఆంధ్రప్రదేశ్, తమిళనాడులలో అధికారం లక్ష్యంగా బీజేపీ విస్తరించబోతోందని ప్రకటించిన తర్వాతనే టీడీపీ రాజ్యసభాపక్షం బీజేపీలో విలీనమైపోవడమూ, దాని లోక్‌సభా పక్షం కూడా (ముగ్గురు) 'జంప్ జిలానీ'లు కావడానికి సిద్ధమవుతుండటం జరుగుతోంది. పైగా టీడీపీ చరిత్రలో ఎరుగనంత ఓటమి (అసెంబ్లీలో 23, శాసనమండలిలో 3 సీట్లకు కుదించుకుపోవటం) పొందింది. ఇన్నాళ్లుగా తనను పెంచిపోషించిన అవినీతిపరులైన కొందరు కేంద్రమంత్రుల్ని, సభ్యుల్ని, తనకు ప్రమేయం లేదన్న ముసుగు చాటున బీజేపీలో తలదాచుకోమని చంద్రబాబు చెప్పి ఉంటాడు. ఈరకంగా టీడీపీ పతనం చాటున ఆంధ్రప్రదేశ్‌లో కాలూనుకోవచ్చని బీజేపీ కేంద్రనాయకత్వం భావించింది. ఈ పూర్వ రంగంలో రాష్ట్రంలో జగన్ ప్రభుత్వానికి పైకి మాత్రం 'అండదండగా ఉంటామ'ని బీజేపీ నాయకులు పెదాలు కదుపుతూనే ఇంకో వైపునుంచి టీడీపీ అవినీతి ముఠాకి తమ తలుపులు తెరిచి కూర్చున్నారు. పైగా, బీజేపీ జాతీయ పార్టీ నాయకుల్లో ఒకరైన జీవీఎల్ నరసింహారావు, సోము వీర్రాజు ప్రభృతులు ఇకనుంచి ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీయే జగన్ ప్రభుత్వానికి ప్రతిపక్షమనీ బాహాటంగానే చాటుకుంటున్నారు. అంతేగాదు, బాబు సాకుతూ వచ్చిన సుజనా చౌదరీ, సీఎం రమేష్ లాంటి టీడీపీ నాయకులు, మంత్రులూ ఎంతటి మోసకారులో గ్రహించమని బీజేపీ నాయకులు జీవీఎల్ రాజ్యసభ నైతిక సూత్రాల నిర్ణాయక సంఘానికి గౌరవాధ్యక్షుడైన నారాయణ్‌లాల్ పంచారియాకు రాసిన లేఖలో (28.11.2018) జీవీఎల్ పదే పదే కోరవలసి వచ్చిందని మరవరాదు. కానీ జీవీఎల్ లేఖకు పూర్తి భిన్నంగా బీజేపీ జాతీయపక్షం వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీనడ్డా, 'చైతన్యశీలి అయిన ప్రధాని మోదీ నాయకత్వంలో, పార్టీ నిర్మాణ కౌశల్యంలో దిట్టయిన అమిత్‌షా ఆధ్వర్యంలో బీజేపీ శక్తి యుక్తుల్ని చూసి టీడీపీ పార్లమెంట్ సభ్యులు బీజేపీలో చేరాలని ఉవ్విళ్లూరుతున్నారు. వీరి చేరికతో, ఏపీలో బీజేపీ బలోపేతం కాబోతున్నది. అందర్నీ కలుపుకుపోవాలన్నదే, ఆ సానుకూల రాజకీయమే రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేయబోతోంది' అనేశారు.

అంటే, బీజేపీని ముంచే ముందు బాబు అనుసరించిన అవకాశవాద ఎన్నికల వ్యూహాన్నే ఇప్పుడు జగన్ ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి, కృత్రిమ విభజనకు బలైన రాష్ట్రానికి ప్రత్యేకహోదాను సాధించే జగన్ దృఢదీక్షను సడలింపజేయడానికి, అది సాధ్యం కాకపోతే బాబు ప్రేరణపై కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాతో కలిసి జగన్‌పై అన్యాయంగా సీబీఐ, ఈడీలతో మోపిన కేసులను ఎటూ తేల్చకుండా బీజేపీ పాలకులు కూడా 'నానబెట్టే' అవకాశం లేకపోలేదు. ఇది నిజం కాని పక్షంలో, బీజేపీ ప్రభుత్వంలో మొన్నటిదాకా భాగస్వామిగా ఉన్న బాబు జగన్‌పై పెట్టిన కేసుల్ని ఇప్పటిదాకా బీజేపీ పాలకులు కూడా ఎందుకు నాన్చుతున్నట్టు? సీబీఐ ప్రత్యేక కోర్టులు దాదాపుగా అన్ని కేసులలో నిందితుల్ని వరుసగా విడుదల చేయగా జగన్‌పై మిగిలి ఉన్న ఒక కేసును అలా ఎందుకు నాన్చుతున్నట్లు? ఈ 'నాన్పుడు'లో మెట్టువాటా బాబుది కాగా, ఆ బాబు పార్టీ బీజేపీ కేంద్ర ప్రభుత్వంలో మొన్నటిదాకా భాగస్వామి కాబట్టి బీజేపీ కూడా 'తిలాపాపాన్ని తలా ఒకరు పంచుకున్నా'రని భావించాలి. పైగా 'ప్రత్యేక హోదా' సమస్యను ఏపీ ప్రభుత్వం బాబులాగా వదిలేసుకున్నంత మాత్రాన బీజేపీ తాను రాష్ట్రంలో అధికారానికి రావాలన్న కాంక్షను, లాలసను వదిలేసుకుంటుందా? అసంభవం. రాష్ట్రంలో తాజా ఎన్నికల్లో ముచ్చటకైనా ఒక్క సీటైనా గెలవలేని బీజేపీ ఏ స్థితికి దిగజారిందంటే– అవినీతికి దూరంగా ఉన్న రాజకీయ పార్టీగా ఎంతగా ప్రచార ఆర్భాటం ద్వారా ముద్ర వేయించుకోవాలనుకున్నా దేశవ్యాప్తంగా బీజేపీ లెజిస్లేటర్లపై ఎన్ని క్రిమినల్ కేసులు, అవినీతి కేసులు మోపి ఉన్నాయో జాతీయ స్థాయి సాధికార పీడీఆర్ నివేదిక (2014–2019 దాకా)లు సాక్ష్యం పలుకుతున్నాయి.

కుల, మత, వర్ణ, వర్గ వ్యత్యాసాలతో, అసమానతలతో తీసుకుంటున్న భారతీయ ప్రజాస్వామ్య వ్యవస్థ నేడు సహనశీలమైన గణతంత్ర వ్యవస్థ (రిపబ్లిక్)గా కాకుండా అసహనంతో నిండిపోయిన రిపబ్లిక్‌గా తయారైందని జస్టిస్ ఏపీ షా (2.11.2018) సంవత్సరం క్రితమే నిరసించాల్సి వచ్చిందని మరవరాదు. క్రమంగా పాలక పక్షాలే సమాజాన్ని 'మేము–వారు' అన్న విభజన రేఖతో కొలిచే దుస్థితికి దిగజారినందున మనం హింసా ధోరణిపట్ల మనస్సులు మొద్దుబారిన వారంగా మారుతున్నామని జస్టిస్ షా అన్నారు. గాంధీయ తాత్విక దృష్టిని, సహిష్ణు వైఖరిని పాలకులు బలవంతంగా, హింసాత్మకంగా పక్కతోవలు పట్టిస్తున్నారని ఆయన విమర్శించాల్సి వచ్చింది. ఈ అసహిష్ణుత వల్లే పాలకులు పత్రికా స్వేచ్ఛనూ, భావప్రకటనా స్వాతంత్ర్యాన్ని, సమావేశ స్వేచ్ఛనూ, భిన్నాభిప్రాయ ప్రకటననూ సహించి, తమ విధానాలను, నిరంకుశ ధోరణులను, అవకాశవాద రాజకీయాలను మార్చుకోలేక పోతున్నారు. ఫలితంగా దేశంలో గత అయిదారేళ్లుగా, పలువురు బాధ్యతాయుత పౌరులు నిశితమైన అభిప్రాయాలు వెల్లడించినందుకు హత్యలకు, వేధింపులకు గురయ్యారు. అనేకమందిని, జైళ్లపాలు చేశారు. ఒక ఒరలో కూడా రెండు కత్తులు ఇమడగలవని, మధ్యే మధ్యే పరస్పరం పొడుచుకోవడానికి ప్రయత్నించినట్లు ప్రజల కోసం కన్పించినా కూడా పాలనా భాగస్వామ్యంలో మాత్రం భిన్న నాయకులు ఇమిడిపోవచ్చని వర్తమాన రాజకీయాలు నేర్పుతున్న పాఠం. నిరంతర జాగరూకత, అప్రమత్తతే స్వాతంత్ర్య ఫలాలను త్యాగశీలురైన ప్రజలు అనుభవించడానికి శ్రీరామరక్ష. అదే ఆంధ్ర ప్రజల అశేష త్యాగాల నుంచి వచ్చిన అనుభవం కూడా. రాష్ట్ర చరిత్రలో స్వాతంత్ర్యానంతర దశలో కనీవినీ ఎరుగని పాదయాత్రను ప్రజా సంకల్ప యాత్రగా మలచి కార్యసాధకుడై ప్రజల ఆశీర్వాదాలతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజల సంకల్పాన్ని నిర్వీర్యం చేయడానికి పనిగట్టుకుని కేంద్రం అధికార, అనధికార స్థాయిల్లో పన్నే కుట్రలను, కుహకాలనూ ప్రజలు వేయి కళ్లతో కనిపెట్టి ఉంచారు, వాటిని తుత్తునియలు చేస్తారని మరచిపోరాదు. మనది సాధారణ ప్రజాస్వామ్య వ్యవస్థ మాత్రమే, కానీ దానిచుట్టూ కూడా అసాధారణ పెట్టుబడి శక్తులు, మన నామమాత్రపు ప్రజాస్వామ్య విలువలను కూడా కూల్చడానికి జట్టుకడతాయి. ఇంతవరకూ జగన్‌పై హత్యాయత్నం కేసును చేపట్టి, న్యాయస్థాన పరిధుల్ని దాటకుండా ముందుకు సాగకుండా ఉండటానికి కారణాలు ఇంకా గోప్యంగానే ఉంచారు. సీబీఐ, ఈడీ, ఎన్నికల కమిషన్ వ్యవస్థలు సుప్రీంకోర్టు చెప్పినట్టు పాలకవర్గ అదుపాజ్ఞల్లో కొనసాగుతున్నంత కాలం ఈ మాత్రపు ప్రజాస్వామ్యంలో కూడా న్యాయం జరగదన్న భావన ప్రజల మనస్సుల్లో, ప్రజాస్వామ్యవాదుల మనస్సుల్లో స్థిరపడిపోవడం శ్రేయస్కరం కాదు. అందుకే ప్రపంచ ప్రఖ్యాత భారతీయ తత్వవేత్త అకిల్ బిల్‌గ్రామ్ ఇలా హెచ్చరించాడు: "నేడు భారతదేశ పాలనా వ్యవస్థలో నడుస్తున్నది అనారోగ్య లక్షణాలతో తీసుకుంటున్న నిరంకుశ ధోరణులు. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ, దానివల్ల పుట్టుకొచ్చే సంక్షోభాల ఫలితం. ఇదే ఫాసిజానికి అనుకూల పరిస్థితులను సృష్టించి పెడుతుంది. కానీ పాలనా వ్యవస్థ తమ జీవితాలతో చెలగాటమాడుతోందని గ్రహించిన మరుక్షణం ప్రజలు ఆ చదరంగం బల్లను (చెస్‌బోర్డు) కాస్తా కూల్చేస్తారు. సరిగ్గా ఈ జాతర క్రమంలోనే విసిగిపోయిన ప్రజలు, ఫాసిజం అంచులకు చేరుకునే ప్రయత్నంలో ఉన్న పాలకులకు 'అనుకూలంగా కూడా ఓట్లు వేసే ప్రమాదమూ తలెత్తుతుంది' అందుకే నేటి అసలు ప్రశ్న: 'సాక్షీ మహరాజ్ (బీజేపీ) చెప్పినట్టు రేపటి ఏ కుట్ర కోసం బీజేపీ –టీడీపీ కలయిక?' ఇక 2019 తర్వాత దేశంలో ఎన్నికలుండవ'న్నదే నిజమా?!

abkprasad2006@yahoo.co.in

**సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!**



### సోషల్ మీడియా

#### నల్లధనం




"నల్లధనం ఎంత ఉందనే దానిపై ప్రభుత్వం కనీసం అంచనాలు కూడా ఎందుకు ఇవ్వలేకపోతోంది. విభాగాల వారీగా సుదీర్ఘమైన 900 పేజీల నివేదికను ఎన్ఐపీఎఫ్‌పీ, ఎన్‌సీఏఈఆర్ రూపొందించాయి కదా. అది కూడా నాలుగేళ్ల నుంచీ ప్రభుత్వం దగ్గర మురుగుతూనే ఉంది. పార్లమెంట్ దగ్గర కూడా ఆ ప్రతి ఉంది. నేను పొరపాటు పడనట్లయితే 2014లోని జీడీపీలో 40శాతం బ్లాక్‌మనీ ఉంటుందని అంచనా"
– ఎం.కె.వేణు, జర్నలిస్ట్

#### మొసలి



"తమ మధ్యలోకి మొసలి వచ్చిందంటే చాలామంది వెంటనే పరుగులు పెడతారు. కానీ, భారతీయులు ఆ మొసలికి హారతులిచ్చి, పూజలు చేస్తారు. మహీసాగర్ జిల్లాలోని ఖోడియార్ మాత దేవాలయంలో భక్తుల పూజలనుంచి మొసలిని కాపాడ్డానికి అటవీ శాఖ సిబ్బంది నానా కష్టాలు పడ్డారు"
– కస్తూరి శంకర్, నటి

#### తప్పు



"వివాదాస్పదం కాని అయోధ్యలోని భూమిని తిరిగి అప్పగించాలంటూ మోదీ ప్రభుత్వం సుప్రీం కోర్టును కోరుతూ చాలా పెద్ద తప్పు చేస్తోంది. అలాంటి అనుమతి అవసరం లేదు. లా ప్రాక్టీస్‌లో ఓనమాలు తెలియని ఓ చార్టెడ్ అకౌంటెంట్ సలహాతోనే వాళ్లు ఈ నిర్ణయానికి వచ్చినట్టున్నారు"
– సుబ్రమణ్య స్వామి, బీజేపీ నేత

#### షేమ్



"ఇది భయంకరమైనది, క్రూరమైనది, సిగ్గుపడాల్సినది.. నేను దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. జార్ఖండ్‌లోని ఖర్సవాన్ జిల్లా సరైకెలా గ్రామంలో ముస్లిం యువకుడిని నిర్బంధించి 'జై శ్రీరామ్, జై హనుమాన్' అనాలంటూ చితకబాదడంపై పోలీసులు వెంటనే కఠినమైన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో జరుగుతున్న మూకదాడుల్లో ఇది 13వ సంఘటన. ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేయించి, బాధితుడి కుటుంబానికి నష్టపరిహారం అందజేయాలి. బాధితుడు గాయాలతో ఆసుపత్రిలో మృతి చెందాడు. ఇటువంటి హీనమైన నేరాలకు పాల్పడేవారికి సమాజంలో చోటు కల్పించకూడదు"
– హేమంత్ సోరెన్, జేఎంఎం నేత


#### ఆతిథ్యం



"ప్రపంచమంతా తిరిగి రండి. భారతదేశంలో అతిథి మర్యాదలు ఎంత ఘనంగా ఉంటాయో అప్పుడు మీకు అర్థమవుతుంది. భారత్‌లోని హోటళ్ల సిబ్బంది అందరికీ మూకుమ్మడిగా సెల్యూట్ చేస్తున్నా. వారి సేవలు అద్భుతం"
– డానిష్ సైట్, నటుడు

# విద్యా విధానం అమలుకు తొందరేల?

అభిప్రాయం



రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి

భారత ప్రభుత్వం కొన్ని రోజుల క్రితం జాతీయ విద్యా విధానం 2019 అనే నివేదిక ముసాయిదాను విడుదల చేసింది. దాని మీద ప్రజల అభిప్రాయాలను తెలపాలని కోరింది. అయితే ఈ నెలాఖరుకల్లా అభిప్రాయాలు తెలపాలని విద్యాశాఖ కోరినట్లు తెలుస్తున్నది. ప్రసిద్ధ శాస్త్రవేత్త, ఇస్రో పూర్వ అధ్యక్షులు డాక్టర్ కె. కస్తూరి రంగన్ అధ్యక్షులుగా, ఎనిమిది మంది సభ్యులుగా భారత ప్రభుత్వం నియమించిన కమిటీ 2018 డిసెంబర్ 15వ తేదీన నివేదిక సమర్పించింది. వెంటనే ఎన్నికలు వచ్చినందువల్ల ఈ నివేదికను ప్రభుత్వం అప్పుడు విడుదల చేయలేదు. ఎన్నికలు పూర్తయిన ఈ నెల మొదట్లోనే విడుదల చేసింది.

ఈ ముసాయిదా చాలా పెద్దది. 480 పుటలున్నాయి. నివేదిక ఆంగ్ల, హిందీ భాషలలో మాత్రమే ఉంది. ప్రతి పౌరుడినీ చర్చలో పాల్గొనమని ప్రభుత్వం కోరింది. అందరూ చర్చలో పాల్గొనాలంటే, ఈ ముసాయిదా అన్ని భారతీయ భాషలలో అనువాదమై భారతీయులందరికీ అందుబాటులోకి రావాలి. అందువల్ల ఈ ముసాయిదాను నామమాత్రపు చర్చకు పెట్టి గబగబా అమలు చేయాలని ప్రభుత్వం తొందరపడవద్దు. ముసాయిదా అన్ని భారతీయ భాషలలోకి అనువాదమై రావాలి. అప్పుడు దానిని చర్చకు పెట్టాలి. ముసాయిదాను అర్థం చేసుకోవడానికి అవసరమైనంత సమయం ఇవ్వాలి. తర్వాతనే ప్రజల అభిప్రాయాలకనుగుణంగా మార్పులు చేర్పులు చేసి ఈ ప్రణాళికలు అమలు చేయాలి.

ఈ ముసాయిదాలో నాలుగు ప్రధానాంశాలు ఉన్నాయి. మొత్తం 23 అధ్యాయాలు, 14 అనుబంధాలున్నాయి. ప్రతి అధ్యాయానికీ ఆకర్షణీయమైన శీర్షిక ఉంది. అందమైన వివరణ ఉంది. ఉత్సాహం కలిగించే నిర్వచనాలు ఉన్నాయి. నిర్మాణాత్మకమైన భాష ఉంది. ప్రాథమిక విద్య నుంచి అత్యున్నత స్థాయి విద్య దాకా విద్యా సంస్థల ప్రస్తుత స్థితిగతులను పేర్కొంటూ, ఆయా అంశాలలో ఇప్పుడు ఏమి చేయబోతున్నారో నివేదిక ముసాయిదా చెబుతు



న్నది. అధ్యాపకులు, వారికి శిక్షణ, విద్యార్థులు, వారికి సౌకర్యాల కల్పన, పాఠ్యాంశాల పునర్నిర్మాణం, ఇంటర్ సప్లిమెంటరీ విద్య, లిబరల్ ఆర్ట్స్‌వంటి అనేక విషయాలను ఈ ముసాయిదా ప్రతిపాదించింది. పైపైన చూస్తే ఈ ముసాయిదాను ఆమోదించడానికి అభ్యంతరం చెప్పవలసిన పనిలేదనిపిస్తుంది. కానీ లోపలకు వెళితే, దీనిలో లోతుగా చర్చించాల్సినవి చాలా ఉన్నాయని తెలుస్తుంది. ఈ ముసాయిదాలోని పదజాలం చాలా ప్రజాస్వామికంగా ఉన్నట్లు కనిపిస్తుంది. కానీ, ఆ పదాల పరమార్థం వేరుగా ఉన్నట్లు అర్థమవుతుంది. ఈ ముసాయిదాలో గతంపట్ల వ్యామోహం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. సైన్సుకు, మతానికి ముడివేసే ప్రయత్నం కనిపిస్తుంది. అన్నీ వేదాల్లో ఉన్నాయని రుజువు చేసే సంకల్పమూ కనిపిస్తుంది. చరిత్ర పట్ల భ్రమలు పెంచే దృష్టి తొంగిచూస్తున్నది. చాలా చోట్ల అశాస్త్రీయ, అచారిత్రక ఆలోచనలు కనిపిస్తున్నాయి.

అందువల్ల ఈ ముసాయిదా మీద దేశవ్యాప్తంగా అనేక స్థాయిలలో చర్చ జరగాలి. పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిలలో చర్చ జరగాలి. ప్రతిపౌరుడూ చర్చలో పాల్గొనాలని కోరినందున పౌరులందరికీ వాళ్లకు తెలిసిన భాషలోకి ఈ ముసాయిదా అనువాదమై రావాలి. గ్రామస్థాయి దాకా ఈ చర్చ జరగాలి. ఈ చర్చలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఏర్పాటు చేయాలి. చర్చలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలను ప్రభుత్వం నిజాయితీగా స్వీకరించి తన ప్రణాళికలో చేర్చుకోవాలి. ఈ ముసాయిదా మీద ప్రసార, ప్రచార మాధ్యమాలలో విస్తృతంగా చర్చలను ఏర్పాటు చెయ్యాలి. ఈ చర్చలలో అధ్యాపకులను, విద్యారంగ నిపుణులను, మేధావులను నిమగ్నం చేయాలి. చర్చలు సమగ్రంగా జరిగే దాకా, ప్రజాభిప్రాయం సంపూర్ణంగా వ్యక్తం అయ్యే దాకా ఆగాలి. అప్పటి దాకా ప్రభుత్వం ఓపిక పట్టాలి. ముసాయిదాను త్వరత్వరగా అమలు చేయకుండా నెమ్మదిగా వ్యవహరించాలి.

వ్యాసకర్త ఎస్కే యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు

# అమెరికాతో అంటకాగితే అంతే సంగతులు!

సందర్భం



డి. పాపారావు

నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం 2014 నుంచీ, తన విదేశాంగ విధానాన్ని అమెరికాతో భారత్‌కి మరింత సాన్నిహిత్యాన్ని పెంచే దిశగానే నడిపించింది. ముఖ్యంగా, రక్షణ పరంగా ఈ భాగస్వామ్యం పెద్ద గంతులలో అభివృద్ధి చెందింది. ఈ క్రమంలోనే, అమెరికా నుంచి కూడా భారత ప్రభుత్వం తన చొరవలకు తగిన విధమైన సానుకూల స్పందనలను ఆశించింది. అలాగే, అమెరికా నుంచి ఆయుధాల దిగుమతులను కూడా, మోదీ హయాంలో మరింతగా పెంచారు. గతనుంచే ఇవి పెరుగుతూ వస్తున్నా, మోదీ హయాంలో మరింత వేగం పుంజుకున్నాయి. దీనికి తార్కాణమే 2007 అనంతర కాలం నుంచీ నేటి వరకూ మన ప్రభుత్వాలు అమెరికాతో చేసుకున్న ఆయుధాల కాంట్రాక్టుల మొత్తం 17 బిలియన్ డాలర్లకు పైగా చేరుకోవడం. అలాగే, మన దేశంలోకి పలు రకాల అమెరికా ఉత్పత్తుల దిగుమతులకు మరింత ఆస్కారం కలిగించే విధంగా చర్యలు తీసుకొని అమెరికాకు మనతో ఉన్న వాణిజ్యలోటును తగించుకోవడంలో కూడా సహకరించింది. కాగా, గతంలో భారత్ జాతీయ భద్రతా సలహాదారుగా వ్యవహరించిన ఎమ్.కె నారాయణన్ వంటివారు కూడా అమెరికాతో అతి సాన్నిహిత్యం, నేటి పరిస్థితులలో తగదని గతం నుంచీ కూడా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూనే వచ్చారు! ఇలాంటి వారి సలహాలను పెడచెవిన పెట్టిన ఫలితం, నేడు మెల్లగా కళ్లముందు ఆవిష్కృతమవుతోంది.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, తన దేశ వాణిజ్య లోటును తగ్గించుకునే క్రమంలో భారత్‌పైన కూడా ఒత్తిడిని, దాడిని పెంచుతున్నారు. ఒక వైపున భారత్‌ను డిమాండ్ చేసి మరీ హార్లీ డేవిడ్‌సన్ బైక్‌లవంటి వాటిపై మన దేశం విధిస్తోన్న సుంకాలను తగ్గింపచేసుకుంటూ, మరో ప్రక్కన భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అవుతోన్న స్టీలు, అల్యూమినియం వంటి ఉత్పత్తుల మీద సుంకాలను పెంచేశాడు. అలాగే భారత్ నుంచి కూడా 1974 నుంచి జనరలైజ్‌డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్ కింద 'సున్నా' శాతం సుంకాలతో ఎగుమతి అవుతోన్న 2000 రకాల సరకులకు ఆ సదుపాయాన్ని తొలగించాడు. దీని వలన, ఈ పద్ధతి క్రింద 2018లో అమెరికాకు సుమారు వి6 బిలియన్ల మేర ఎగుమతులను చేసిన భారత్‌పై నేడు అదే ఎగుమతులకు గాను అదనంగా సుమారు 190 మిలియన్ డాలర్ల సుంకాల భారం పడనుంది. దీనితో, మన ఎగుమతులలో కొన్ని అమెరికాలో ఖరీదైనవిగా మారి, అవి ఇతర దేశాల సరుకుల పోటీని తట్టుకోలేని స్థితి వస్తుంది. ఇదంతా చాలదన్నట్లు, మన దేశీయ సార్వభౌమాధికారాన్నే సవాలు చేస్తూ ఇరాన్ నుంచి మనం చమురును దిగుమతి చేసుకోవడాన్ని కొనసాగిస్తే, ఆంక్షలు విధిస్తానంటూ అమెరికా బెదిరిస్తోంది. వాటికి లొంగి పోతే మనం, మన చమురు అవసరాల కోసం, ఇతరేతర దేశాలపై ఆధారపడవలసి వస్తుంది. దీనితో చమురు దిగుమతులకోసం మనం అధిక వ్యయాన్ని చేయాల్సి వస్తుంది. ఫలితంగా మన దేశీయ విదేశీ కరెన్సీ నిల్వలపై ఒత్తిడి పెరిగి, రూపాయి విలువ పతనానికి దారి తీస్తుంది. దాంతో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు మరింత పెరగటంతోపాటుగా, ఇతరేతర సరుకుల ధరలు కూడా పెరిగిపోతాయి.

మన ప్రభుత్వం గత సంవత్సరంలో రష్యాతో చేసుకున్న యస్ 400 మిసైల్ రక్షణ వ్యవస్థల దిగుమతుల ఒప్పందాన్ని కూడా రద్దు చేసుకోమంటూ అమెరికా మనపై ఒత్తిడి తెస్తోంది. అయితే నాటోలో సభ్యత్వం కలిగివున్న టర్కీ ఈ ఒత్తిళ్ళను బేఖాతరు చేసి వచ్చే నెలలోనే ఈ మిసైల్స్‌ని దిగుమతి చేసుకుంటోంది. మా ఇంటికొస్తే ఏం తెస్తావు? మీ ఇంటికొస్తే ఏం ఇస్తావు? తరహాగా ఉన్న అమెరికా ధోరణికి ఇకనైనా అడ్డుకట్ట వేయటం మన దేశానికి తక్షణ ఆగత్యం.

ఇప్పటికే భారత ప్రభుత్వం తీసుకుంటోన్న కొన్ని దిద్దుబాటు చర్యలు కొంత ఆశను కలిగిస్తున్నాయి. ప్రస్తుత అంతర్జాతీయ నేపథ్యంలో మనం అమెరికాకి దూరంగా చైనా, రష్యా వంటి అంతర్జాతీయ స్వేచ్ఛావాణిజ్యాన్ని కోరుకుంటోన్న దేశాలతో దగ్గరగా జరగవలసి ఉంది. దీనిలో భాగంగానే మోదీ మళ్లీ దేశ ప్రధానిగా ప్రమాణం స్వీకారం చేసిన సందర్భంలో మనం చైనాను నొప్పించకుండా జాగ్రత్త తీసుకుంటూ ఆ ప్రమాణస్వీకారోత్సవానికి టిబెట్, తైవాన్‌ల ప్రతినిధులను ఆహ్వానించకపోవడం గమనార్హం. అలాగే, షాంఘై సహకార సంస్థ సమావేశంలో మోదీ చైనా నేత జి, రష్యా నేత పుతిన్‌తో జరిపిన చర్చలు కూడా మూడు దేశాల మధ్య మరింత సన్నిహిత సంబంధాలు నెలకొనే దిశగానే ఉన్నాయని వార్తలు.

ఇటువంటి చొరవల ద్వారా మాత్రమే తన ఆర్థిక సంక్షోభాన్ని, సమస్యలను పరిష్కరించుకొనేందుకు భారత్‌తో మైత్రి పేరిట భారత్ మార్కెట్‌లను ఏకపక్షంగా కొల్లగొట్టే అమెరికా ఎత్తుగడలకు మనం చెక్‌పెట్టగలం. మన పాలకులు గనుక అమెరికాతో తమ పీఠముడిని బద్దలు చేసుకొని, దేశీయ ప్రయోజనాలను కాపాడుకొనే దిశగా చర్యలు తీసుకోకుంటే అది అతిమంగా దేశీయ ప్రజల ప్రయోజనాలకు తీవ్ర ముప్పుగా పరిణమించగలదు. ఇలాంటి ముప్పును తెచ్చిపెట్టే, అమెరికాతో సాగుతోన్న వ్యూహాత్మక భాగస్వామ్యం మనకు చెరుపే చేస్తుంది.

వ్యాసకర్త ఆర్థికరంగ విశ్లేషకులు
మొబైల్ : 98661 79615

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ మంగళవారం
25-6-2019
















# ది గ్రేట్ తెలుగు బ్రాండ్

**ఇన్నాళ్లూ అడపా దడపా మెరుస్తున్న డిటెక్టివ్ పాత్రలు తాజా తెలుగు డిటెక్టివ్ సినిమాతో హిట్ రేంజ్‌కి చేరుకున్నాయి. తెలుగు డిటెక్టివ్‌కు స్వాగతం.**

ఇంగ్లిష్ వాళ్లకు 'జేమ్స్‌బాండ్' ఉన్నాడు. హిందీ వాళ్ళకు 'టైగర్' ఉన్నాడు. మరి తెలుగు వాళ్లకు? నెల్లూరు నుంచి 'ఏజెంట్ ఆత్రేయ' దొరికాడు. ఈ క్యారెక్టర్‌తో సిరీస్‌గా ఎన్ని సినిమాలైనా తీయవచ్చు. ఈ క్యారెక్టర్‌ని స్క్రీన్ ఐకాన్‌గా మార్చవచ్చు.

మనకు డిటెక్టివ్ రచయితలు ఉన్నారు కానీ డిటెక్టివ్ హీరోలు లేరు. కొవ్వలి, టెంపోరావ్, కొమ్మూరి సాంబశివరావు, మధుబాబు, పానుగంటి వీరంతా తెలుగులో డిటెక్టివ్ సాహిత్యం లేదా 'సీక్రెట్ ఏజెంట్' సాహిత్యం సృష్టించారు. వీళ్ల సృష్టించిన డిటెక్టివ్‌లు 'డిటెక్టివ్ వాలి', 'యుగంధర్', 'షాడో', 'బుల్లెట్' వీరంతా పాఠకులకు ఇష్టులు. హీరోలు.

బెంగాలీ సాహిత్యం తెలుగు సాహిత్యం మీద ప్రభావం చూపుతున్న 1950ల కాలంలో బెంగాలీలో విపరీతంగా వస్తున్న డిటెక్టివ్ సాహిత్యానికి ప్రభావితమైన తెలుగువారు ఉన్నారు. చక్రపాణి వంటి వారు అందుకే 'మిస్సమ్మ'లో తొలి లోకల్ డిటెక్టివ్‌ను చూపించారు. మిస్సమ్మలో అక్కినేని స్కూల్ సూపర్‌వైజర్ కమ్ డిటెక్టివ్. ఎప్పుడూ హ్యాట్, చేతిలో స్టిక్, నల్ల కళ్లద్దాలు పెట్టుకుని తిరుగుతుంటాడు. ప్రతి డిటెక్టివ్‌కు ఒక అసిస్టెంట్ ఉన్నట్టే అక్కినేనికి కూడా అంజిగాడు అసిస్టెంట్‌గా ఉంటాడు. మిన్ను విరిగి మీద పడినా అతడు చలించకుండా ఏదో నోట్ చేసుకుంటూ ఉంటాడు. అక్కినేని చేసిన ఈ పాత్ర ఎంత హాస్యం పండించినా తుదకు సావిత్రే మిస్సమ్మ అని తేల్చడంలో కీలకంగా మారి తన వృత్తి ధర్మానికి న్యాయం చేకూర్చింది. అక్కినేని టాలెంట్ వల్ల ఆ పాత్ర హిట్ అయ్యింది కాని అలాంటి పాత్రలు రిపీట్ కాలేదు.

కాని సినిమా రంగంలో ఉంటూ డిటెక్టివ్ సాహిత్యాన్ని బాగా ఔపోసన పట్టినవాడు ఆరుద్ర. ఆయన చొరవతోనే 'గూఢచారి 116' వంటి సినిమాలు తెలుగులో సాధ్యమయ్యాయి. తెలుగు తెర మీద తొలి జేమ్స్‌బాండ్‌గా కృష్ణ ఇప్పటికీ ప్రశంసలు అందుకుంటున్నారు. కాని ఆ తర్వాత ఆ స్థాయిలో ఏజెంట్ సినిమాలు హిట్ కాలేదు. కృష్ణ హీరోగా 'ఏజెంట్ గోపి', 'రహస్య గూఢచారి' తదితర సినిమాలు తయారయ్యాయి. చిరంజీవి హీరోగా 'గూఢచారి నం.1' సినిమా వచ్చింది.

ఈ సందర్భంలోనే కొమ్మూరి సాంబశివరావు వీర శిష్యుడు అయిన మల్లాది వెంకటకృష్ణమూర్తి తెలుగులో లోకల్ డిటెక్టివ్ పాత్రను సృష్టించారు. 'చంటబ్బాయ్' నవలలో ఆయన సృష్టించిన పాండురంగారావు పాత్ర ఆ తర్వాత వెండితెర మీద చిరంజీవి పోషించడంతో 'జేమ్స్‌పాండ్' అయ్యింది. 'చంటబ్బాయ్' ఒక కామెడీ డ్రామాగా నిలిచింది తప్ప పూర్తిస్థాయి ఏజెంట్ సినిమా కాలేకపోయింది. ఆ తర్వాత సస్పెన్స్ సినిమాలలో ఆరితేరిన దర్శకుడు వంశీ– మోహన్‌బాబు హీరోగా 'డిటెక్టివ్ నారద' తీశారు. ఒక ఇంట్లో జరుగుతున్న గూడుపుఠాణీని ఆ ఇంటికి డిటెక్టివ్‌గా వచ్చిన నారద ఛేదించడం కథ. ఇందులో మోహన్‌బాబు అసిస్టెంట్ అల్లావుద్దీన్‌గా మల్లికార్జునరావు నటించాడు. ఆ సినిమా హిట్ అయితే ఎలా ఉండేదో కాని జనం నిరాదరించారు.

ఆ తర్వాత చాలా కాలం తెలుగు సినిమా ఈ లాంగ్ కోట్, నల్ల కళ్లద్దాలు, తలమీద హ్యాట్, జేబులో భూతద్దంతో తిరిగే ఏజెంట్ పాత్రను పట్టించుకోలేదు. తమిళంలో కూడా ఇదే పరిస్థితిగా ఉండగా దర్శకుడు మిష్కిన్ 'డిటెక్టివ్' పాత్రను మళ్లీ తెర మీదకు తెచ్చి విశాల్‌తో సూపర్ హిట్ కొట్టాడు. ఆధారాలు ఏమీ దొరక్కుండా భారీ మొత్తాలకు వ్యక్తుల అడ్డు తొలగించే ఒక కరడు కట్టిన ముఠాను డిటెక్టివ్ విశాల్ ఎలా పట్టుకున్నాడన్నది ఈ సినిమాలో మిష్కిన్ చాలా రోమాంచితంగా చూపించాడు. అయితే ఈ సినిమాలో డిటెక్టివ్‌కు అసిస్టెంట్‌గా వేసిన నటుణ్ణి హాస్యగాడిగా కాకుండా అతణ్ణి కూడా ఒక సమవుజ్జీగా దర్శకుడు చూపించాడు. తెలుగులో కూడా ఇది హిట్ కావడంతో డిటెక్టివ్ సినిమాల మూడ్ సెట్ అయ్యింది. ఇప్పుడు 'సాయి శ్రీనివాస ఆత్రేయ' ఆ మూడ్‌ను స్థిరపరచడమే కాదు తెలుగు ప్రేక్షకులకు ఒక లోకల్ ఏజెంట్‌ను సక్సస్‌ఫుల్‌గా ఇచ్చింది.











సాధారణంగా ఏజెంట్లు, డిటెక్టివ్‌లు సిటీ బ్యాక్‌డ్రాప్‌లో తిరుగుతుంటారు. కాని ఈ సాయి శ్రీనివాస ఆత్రేయ మాత్రం కోస్తా జిల్లా అయిన నెల్లూరు చుట్టుపక్కల తిరుగుతుంటాడు. అసలు ఈ పాత్రకు 'సాయి శ్రీనివాస ఆత్రేయ' అని పెట్టడమే ఒక నేటివిటి. 'ఏజెంట్ విక్రమ్'లాగా పెట్టి ఫిక్షనల్ చేయకుండా సినిమాలో చెప్పినట్టు 'నాది ఫిక్షనల్ క్యారెక్టర్ కాదు రియల్ క్యారెక్టర్' అనేవిధంగా చూపి ప్రేక్షకులకు దగ్గర చేశాడు దర్శకుడు స్వరూప్. ఇక హీరో నవీన్ పోలిశెట్టి అసలు సిసలు తెలుగు డిటెక్టివ్‌గా కనిపించి ఇతను కేసు ఛేదించే తీరుతాడు అనే నమ్మకం కలిగిస్తాడు. సాధారణంగా డిటెక్టివ్ కథలు నలిగిన ఇతివృత్తాలతో ఉంటాయి. కాని ఇందులో కొంచెం రియల్ క్రైమ్‌ను బేస్ చేసుకున్నారు. రైల్వే ట్రాక్‌ల దగ్గర తరచూ కనిపించే అనాథ శవాలు ఎవరివి, అవి ఎందుకు ఉంటున్నాయి, ఆ మరణాలకు కారణం ఎవరు అనేది ఈ సినిమా కథ. దీనికి 'రెలిజియస్ క్రైమ్స్ ఇన్ ఇండియా' అనే స్టడీ నేపథ్యం కావడం కూడా ప్రేక్షకుల్లో చైతన్యం పెంచే అంశం.

చాలా తక్కువ బడ్జెట్ ఉన్నా, వనరులు తక్కువ ఉన్నా ఒక తెలుగు డిటెక్టివ్ పూనుకుంటే క్రైమ్‌ను ఛేదించే సత్తా ఉంటే ఒక జత బట్టలతో కూడా సినిమా మొత్తం నడిపి మెప్పించగలడని ఈ సినిమా నిరూపిస్తుంది. నిజానికి ఈ ఏజెంట్ పాత్రలు కత్తి మీద సాము. హిందీలో వందలకోట్ల ఖర్చుతో సల్మాన్ ఖాన్‌ను హీరోగా పెట్టి తీసిన 'ఏక్ థా టైగర్' కలెక్షన్ల పరంగా బాగున్నా సినిమా పెద్దగా టాక్ సంపాదించుకోలేదు. అయినప్పటికీ టైగర్ సిరీస్‌ను కంటిన్యూ చేయడానికి 'టైగర్ జిందా హై' తీశారు. అది ఘనవిజయం సాధించింది. కాని అంతే భారీగా సైఫ్ అలీఖాన్‌ను హీరోగా పెట్టి దర్శకుడు శ్రీరామ్ రాఘవన్ తీసిన 'ఏజెంట్ వినోద్' ఫ్లాప్ అయ్యింది. అలాంటి నేపథ్యంలో తెలుగు నుంచి ఒక పాత పద్మిని ప్రీమియర్ కారులో తిరిగే డిటెక్టివ్ జనానికి నచ్చడం విశేషమే.

సమాజంలో నేరం పెరిగింది. నేరం చేసే మనుషులు మన ఇరుగు పొరుగే ఉంటారు అన్నంతగా వార్తలు కలవర పరుస్తున్నాయి. సైబర్ నేరాలకైతే అంతే లేదు. ఇందుకు ఆడా మగా తేడా లేదు. దొంగ ఐడీ సృష్టించి వేరే ఫొటోలు డిస్‌ప్లే పిక్చర్‌లుగా పెట్టి పెళ్లి కూతురుగా ఒక మహిళ ఒకతన్ని మోసం చేస్తే, సినిమా ప్రొడ్యూసర్‌గా మరో మహిళ మరొకతన్ని మోసం చేసిన ఘటనలు వారం రోజుల వ్యవధిలో బయటపడ్డాయి. డ్రగ్స్ సరఫరాలు నిర్వహించే ముఠాలు, హ్యూమన్ ట్రాఫికింగ్‌కు పాల్పడే ముఠాలు... వీటిని ఛేదించే ఆత్రేయలు ఇవాళ చాలా మంది అవసరం. ఆ ముఠాల గుట్టు బట్టబయలు చేసి ప్రేక్షకులను అలెర్ట్ చేయడం కూడా ముఖ్యం.

బహుశా రాబోయే రోజుల్లో 'ఆత్రేయ ఇన్ పూణె', 'ఆత్రేయ ఇన్ అమలాపురం', 'ఆత్రేయ ఇన్ ఫలక్‌నుమా' అనే సినిమాలు రావచ్చు. అలాంటి సినిమాలకు చాన్స్ ఉన్న పాత్రను సృష్టించినందుకు 'సాయి శ్రీనివాస ఆత్రేయ' యూనిట్‌కు రీసౌండ్ వచ్చేలా చప్పట్లు కొట్టాలి. తప్పకుండా నల్ల కళ్లద్దాలు కొని గిఫ్ట్‌గా బహూకరించాలి.

– కె


● విజయ్ దేవరకొండ


● దర్శకుడు స్వరూప్

## బ్రేక్ కోసం ఎదురు చూశాం

**– విజయ్ దేవరకొండ**

నవీన్ పోలిశెట్టి, శృతీ శర్మ హీరోయిన్లుగా స్వరూప్ తెరకెక్కించిన చిత్రం 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'. రాహుల్ యాదవ్ నక్కా నిర్మించారు. ఈ నెల 21న విడుదలైన ఈ చిత్రం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో పలువురు సినీ ప్రముఖులు చిత్రాన్ని వీక్షించారు. అనంతరం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హీరో విజయ దేవరకొండ మాట్లాడుతూ – ''ఫస్ట్ జాబ్ వచ్చిన తర్వాత స్టూడెంట్స్‌గా ఉన్నప్పటి మెమొరీస్‌ను గుర్తు చేసుకున్నట్టుంది నాకు ప్రస్తుతం. నవీన్ నాకు చాలా ఏళ్లుగా తెలుసు. మేమిద్దరం కలసి థియేటర్ చేశాం. కలసి యాక్టింగ్ ప్రాక్టీస్ చేశాం. మాకు బ్రేక్ ఎప్పుడు వస్తుందా? అని కలసి ఎదురు చూసే వాళ్లం. థియేటర్ చేస్తున్న రోజుల్లో నవీన్ మమ్మల్ని అందర్నీ బాగా ఎంటర్‌టైన్ చేసేవాడు. నాకు 'పెళ్లి చూపులు' సినిమాతో బ్రేక్ రావడాన్ని వాడు చాలా సంతోషించాడు. ఇప్పుడు వాడికి బ్రేక్ రావడం నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాతో మన ఇండస్ట్రీకి మరో మంచి హీరో దొరికాడు. చాలా హ్యాపీగా ఉంది. నాకు కాంపిటీషన్ స్టార్ట్ అయిపోయింది (నవ్వుతూ). స్వరూప్ సినిమాను బాగా డైరెక్ట్ చేశాడు. రాహుల్‌గారు కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేయడం చాలా సంతోషం. ఈ సినిమాను అందరూ చూడాలి. కచ్చితంగా ఎంటర్‌టైన్ అవుతారు'' అన్నారు.


● నిర్మాత రాహుల్


● హీరో నవీన్ పోలిశెట్టి

సేవ


● యోగా చేస్తున్న మహిళలు, వృద్ధులు



# నిర్మల వైద్యుడు

ఆయనొక వైద్యుడు. మంచి హస్తవాసి గల వాడని పేరు తెచ్చుకున్నాడు. నామమాత్రం రుసుముతోనే నాణ్యమైన వైద్యం చేసేవాడు. మందులు కొనలేని పేదలకు ఉచితంగా మందులు కూడా ఇచ్చేవాడు. అయితే, దురదృష్టం... నాలుగు పదుల వయసు కూడా లేకుండానే క్యాన్సర్ వ్యాధి వచ్చింది. ఆ వైద్యుడు తన సేవాకార్యక్రమాలను ముమ్మరం చేశాడు. తాను ఎలాగూ జీవించేది లేదు కాబట్టి, తన వాటాను అమ్మగా వచ్చిన డబ్బును తన తర్వాత ఒక ట్రస్టుకు చెందేటట్లు కుటుంబ సభ్యుల దగ్గర మాట తీసుకున్నాడు. ఆ తర్వాత నిశ్చింతగా కన్నుమూశాడు. ఇప్పుడు ఆ ట్రస్టు వారు ఆ వైద్యుడి పేరు మీద ఎంతోమంది పేదలకు, వృద్ధులకు సేవలందిస్తున్నారు. ఆ విధంగా ఆ డాక్టరు, అందరి హృదయాలలో నిలిచిపోయాడు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మరియపురం గ్రామా

వరంగల్ రూరల్ జిల్లా గీసుకొండ మండలం మరియపురం గ్రామానికి చెందిన ఆ డాక్టరు కుటుంబం నుంచి అందిన విరాళంతో నిర్మల చారిటబుల్ ట్రస్ట్, వినూత్న రీతిలో గ్రామప్రజలకు సేవలు అందిస్తోంది. గ్రామ ప్రజలందరూ ఆరోగ్యంగా... ఆనందంగా... జీవించాలనే ఉద్దేశ్యంతో యోగ శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. అయితే, గ్రామస్తుల నుంచి ఆశించినంత స్పందన కనిపించకపోవడంతో ట్రస్టు వాళ్లు ఒక ఆలోచన చేశారు. యోగ తరగతులలో హాజరు శాతం ఎక్కువ ఉన్నవారికి వడ్డీలేని రుణాలిస్తామని ప్రకటించారు. దీంతో మహిళలు ఆసక్తి చూపారు. రోజు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు యోగా, 12 నుంచి మధ్యాన్నం 1 గంట వరకు చెస్, క్యారం బోర్డ్ తదితర ఆటలు ఆడిస్తున్నారు. స్నాక్స్ సైతం అందిస్తున్నారు. ఈ కేంద్రం గత మూడు సంవత్సరాలుగా కొనసాగుతోంది.

ఈ యోగ కేంద్రానికి 250 రోజులు హాజరైన వారికి లక్ష రూపాయల రుణం వడ్డీ లేకుండా; 200 రోజులు వచ్చిన వారికి లక్ష రూపాయలు పావలా వడ్డీకి రుణం;150 రోజులు వచ్చిన వారికి రూ75 వేల రుణం 50 పైసలకు;100 రోజులు వచ్చిన వారికి రూ 75 వేల రుణం 75పైసలు; 50 రోజులు వచ్చిన వారికి రూ 60 వేలు ఒక రూపాయి చొప్పున రుణం ఇస్తున్నారు. వివిధ కారణాల రీత్యా అసలు తరగతులకు హాజరు కాలేని వారికి కూడా రూపాయి వడ్డీకే యాభై వేల రుణసాయం అందిస్తున్నారు.

### వడ్డీ సొమ్ముతో మరిన్ని సేవలు

వృద్ధుల వికాస కేంద్రం ఏర్పాటు చేసి గ్రామంలోని 60 ఏళ్ళు పైబడిన వృద్ధులను చేరదీసి వారికి రోజూ ఆటపాటలు, వ్యాయామం, వైద్యసేవలందిస్తున్నారు. ప్రతినెల 20 మందికి రూ. 500 విలువ చేసే నిత్యావసర సరుకులను అందిస్తున్నారు. వారిని ఇంటినుంచి వికాస కేంద్రానికి తీసుకుని రావడం, తీసుకెళ్ళడానికి ప్రత్యేకంగా వాహనంతోపాటు శిక్షకురాలు, డ్రైవర్‌ను ఏర్పాటు చేశారు.

### ఉచిత ఆరోగ్య కేంద్రం ఏర్పాటు..

గ్రామంలోని వృద్ధులు, వ్యాధిపీడితులతోపాటు గ్రామస్తులు అనారోగ్యానికి గురికాకుండా ఉండటానికి స్వంతఖర్చుతో నిర్మలమాతా ఉచిత ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి శనివారం ఇక్కడ అవసరమైన వారికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులను అందిస్తున్నారు.

– **గజవెల్లి రాజు**, సాక్షి, వరంగల్ రూరల్
ఫొటోలు: **పెద్దపల్లి వరప్రసాద్**

### అటు ఆరోగ్యం..ఇటు ఆర్థికం...



ప్రతిరోజు యోగాకు, ఆటలకు రావడం వలన ఆరోగ్యంగా ఉంటూ ఆర్థికంగా బలపడ్డాను. సంఘంలో రుణం తీసుకుని రెండు గేదెలను కొనుగోలు చేశాను. సంవత్సరానికి 260 నుంచి 300 రోజులు రావడంతో మిత్తి లేకుండా డబ్బులు లక్ష రూపాయలు సహాయం చేశారు. గేదెల ద్వారా ఆదాయం వస్తోంది. రోజు యోగా చేస్తూ, ఆటలు కూడా ఆడుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటున్నాను.

**– బి.ఇన్నమ్మ**, స్థానికురాలు

### గతంలో ఇంటికే పరిమితం అయ్యే వాళ్ళం



మహిళ సంఘం ఏర్పాటు చేసుకోకముందు ఇంటికే పరిమితం అయ్యే వాళ్ళం. సంఘం ఏర్పాటు చేశాక రోజు యోగా తరగతులు, ఆటలు ఆడటం ప్రారంభమయ్యాక మాలో ఐక్యత పెరిగింది. గతంలో ఇంట్లో ఉంటే ఏదో కోల్పోయిన వాళ్ళ మాదిరిగా ఉండేది. ఇప్పుడు ఆరోగ్యంగా ఆనందంగా ఉంటున్నాం. కాళ్ల నొప్పులు కూడా ఉండేవి. ఇప్పుడు అవి లేకుండా పోయాయి. చాలా సంతోషంగా ఉంటున్నా.

**– డి.రాణి**, స్థానికురాలు


### సంఘం ఇచ్చే సరుకులే తింటున్న...



నాకు పెళ్ళి కాలేదు. అమ్మ నాన్న ఉన్నన్ని రోజులు వాళ్లే సాదారు. తరువాత మా తమ్ముడి ఇంటి దగ్గర ఉంటున్నాను. సంఘం తరుపున ఇచ్చే సరుకుల ద్వారా నేను జీవనం కొనసాగిస్తున్నాను. ఈ సంఘం నన్ను అన్ని రకాలు అదుకుంటున్నది. ఈ సంఘానికి ఎంతో రుణ పడి ఉంటాను.

**– మరియమ్మ**

### నా కుమారుడి చివరి కోరికతోనే...



నాకు ముగ్గురు కుమారులున్నారు. వారిలో డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి (34) వయస్సులో క్యాన్సర్ వ్యాధితో మరణించాడు. తను చనిపోయే ముందు తన వాటాకు వచ్చే ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆస్తులకు తల్లిని సంరక్షకురాలిగా పెట్టాడు. పేదలకు ఉచిత వైద్యసేవలు, నిరుపేదలకు సహాయం, అనాథలకు ఉచిత విద్యా బోధన చేయాలని హామీ తీసుకున్నాడు. మరణించిన తర్వాత కూడా తాను ప్రశాంతంగా ఉండాలంటే సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరాడు. ప్రవీణ్‌రెడ్డి ఆస్తులకు సంబంధించి వచ్చిన సుమారు యాభైలక్షలకు పైగా మొత్తాన్ని నిర్మల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మహిళ సంఘానికి అందించాము. అలాగే నా వ్యాపారంలో వచ్చే లాభాలను సైతం సేవాకార్యక్రమాలకు కేటాయిస్తున్నా. నా కుమారుడి కోరిక మేరకు ఇలా సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రశాంతంగా ఉంటున్నాను.

**– అల్లం బాలిరెడ్డి,**
నిర్మల
చారిటబుల్ ట్రస్ట్

చెట్టు నీడ

# జ్ఞానమే అన్నిటికీ మూలం

పూర్వం బబులోను అను రాజ్యాన్ని నెబుకద్నెజరు అనే రాజు ఏలేవాడు. ఆయన రాజ్యం మీదికి పొరుగు రాజ్యానికి చెందిన యెహోషాపాతు అను రాజు దండెత్తి ఆ రాజ్యంలోని దేవాలయంలోని పూజోప కరణాలతోబాటు రాజ్యంలోని సౌందర్యం, జ్ఞానం కలిగిన నలుగురు బాలురను కూడా తరలించుకుపోయాడు. రాజు ఆ బాలురకు అతిథి గృహాన్ని కేటాయించి, రాజభోజన, పానీయాలు భుజింప చేయవలసిందిగా సంబంధిత అధికారిని ఆజ్ఞాపించాడు.



సౌందర్యం గల ఆ నలుగురు బాలురు ఆ అధికారితో, అయ్యా! మేము రాజ భోజనం తీసుకోము. మాకు శాకాహారమే పెట్టి పదిరోజులు చూసిన తర్వాత మా ముఖాలను మీ రాజ్యంలోని మా వయస్సు గల బాలుర ముఖాలను పరీక్షించి మాలో ఏ లోపమూ లేనట్టు గ్రహిస్తే శాకాహారమే మాకు పెట్టమని కోరారు. వారి కోరికను ఆ అధికారి మన్నించి కొన్ని రోజుల తర్వాత పరీక్షించి, వారిలో ఏ లోపమూ లేదని గ్రహించి శాకాహారాన్నే వారికి పెట్టాడు.

ఆ విధంగా మూడేళ్లు గడిచిన తర్వాత రాజు ఈ బాలురను తన వద్దకు ప్రవేశపెట్టమని ఆజ్ఞాపించాడు. వారు రాజు సముఖానికి వచ్చారు. రాజు ఆ బాలురు విశేష జ్ఞానం, సకల శాస్త్ర ప్రావీణ్యం, దర్శనభావం, స్వప్న భావాలను చెప్పగలిగినటువంటి ప్రావీణ్యులు నా దేశంలోని శకునగాండ్రకు కూడా అటువంటి జ్ఞానం లేదని, దేవతలకే అంతటి జ్ఞానం ఉంటుందని గ్రహించాడు. రాజు వారిలో 'దానియేలు'ను బబులోను సంస్థానమంతటి మీద ప్రధానిగాను, మిగతా వారిని ఆ రాజ్య సంస్థానం మీద విచారణ కర్తలుగాను నియమించాడు. జ్ఞానం గల వారెవరైనా ఆపద కాలమందు, భూ రాజులు, అధిపతులచే సన్మానింపబడతారు. విద్య అనేది దివ్యమైనది. అది తరగదు, కాలదు, నీటిలో నానదు గనుక వారు రాజుచే గౌరవించబడ్డారు. జ్ఞానం గలవారు భూరాజులు, అధిపతుల గౌరవాన్ని పొందుతారు, మంచి పదవులు కూడా అనుగ్రహింపబడతాయి. 'జ్ఞానమే అన్నిటికి మూలం' అని బైబిల్‌లో ఈ యూదా జాతి గల నలుగురు బాలుర గురించి చెప్పబడింది.

**– బి.బి. చంద్రపాల్ కోట**

సాక్షి
ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ ॥ మంగళవారం
25-6-2019

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?



**పల్లవి :**
దేవుడు వరమందిస్తే నే నిన్నే కోరుకుంటాలే
ఆ... నిద్దురలోనూ నిన్నే నీ నీడై చేరుకుంటాలే ఓ...
॥దేవుడు॥
ఓ... కాశ్మీరులో కనబడుతుందా
నీ నడకల్లోని అందం
తాజ్‌మహల్‌కైనా ఉందా
నీ నగవుల్లోని చందం
నా ఊపిరి చిరునామా నువ్వే...
॥దేవుడు॥

**చరణం : 1**
మనసు నిన్ను చూస్తూనే
నన్ను మరచిపోయిందే
మాటైనా వినకుండా
నిన్ను చేరమంటుందే
నా...
॥మనసు॥
నిను మేఘాన ఒక బొమ్మ గావించగా
నే మలిచాను హరివిల్లునే కుంచెగా
ఈ చిరుగాలితో చెప్పనా
నీ మదినిండ నేనుండగా...
॥దేవుడు॥

చరణం : 2
ఏడడుగులు నడవాలంటూ
నా అడుగులు పరుగిడినా
కొంగుముడిని వేయాలంటూ
నిన్ను వేడుకుంటున్నా ఆ...
॥ఏడడు॥
నా కలలన్నీ నీ కనులు చూడాలని
బతిమాలాను నీ కంటిలో పాపని
మన్నించేసి నా మనసునీ
ప్రసాదించు నీ ప్రేమనీ
॥దేవుడు॥

**చిత్రం : 6 టీన్స్ (2001)**
**రచన : సుద్దాల ఆశోక్‌తేజ**
**సంగీతం : ఘంటాడి కృష్ణ**
**గానం : కుమార్ సాను**

కట్‌చేయండి...దాచేయండి...

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | | | | | 7 | 4 | |
| 9 | | | | 3 | 1 | | | |
| 7 | | | | 4 | | 5 | | 1 |
| | 1 | | | 6 | | 9 | 8 | |
| 8 | | 9 | 5 | | 3 | 2 | | 4 |
| | 4 | 7 | | 9 | | | 6 | |
| 4 | | 5 | | 8 | | | | 2 |
| | | | 6 | 5 | | | | 7 |
| | 9 | 2 | | | | | | 8 |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

**నిన్నటి జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 9 | 8 | 1 | 5 | 4 | 2 | 3 | 7 |
| 7 | 3 | 5 | 9 | 8 | 2 | 6 | 1 | 4 |
| 2 | 1 | 4 | 6 | 3 | 7 | 9 | 8 | 5 |
| 8 | 4 | 7 | 2 | 1 | 3 | 5 | 9 | 6 |
| 9 | 5 | 2 | 7 | 6 | 8 | 1 | 4 | 3 |
| 1 | 6 | 3 | 5 | 4 | 9 | 7 | 2 | 8 |
| 4 | 2 | 1 | 3 | 7 | 5 | 8 | 6 | 9 |
| 3 | 7 | 9 | 8 | 2 | 6 | 4 | 5 | 1 |
| 5 | 8 | 6 | 4 | 9 | 1 | 3 | 7 | 2 |



● తమన్నా

# మహర్షి సెలబ్రేషన్స్

**‘మ**హర్షి’ చిత్రం తన కెరీర్‌లో చాలా స్పెషల్‌గా నిలిచిందని ఇప్పటికే పలు సందర్భాల్లో చెప్పారు మహేశ్ బాబు. ఈ సినిమా 50 రోజులు పూర్తి కావస్తోంది. దీంతో సూపర్‌హిట్ సంబరాలను హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా తెరకెక్కిన చిత్రం ‘మహర్షి’. పూజా హెగ్డే కథానాయిక. అశ్వనీ దత్, ‘దిల్’ రాజు, పీవీపీ నిర్మించారు. మే 9న విడుదలైన ఈ చిత్రం మంచి సక్సెస్ సాధించిందని, 200 సెంటర్లలో 50 రోజులు పూర్తి చేసుకోనున్న సందర్భంగా ఈ నెల 28న అర్ధశతదినోత్సవ వేడుకలను నిర్వహించనున్నామని చిత్రబృందం తెలిపింది. ఇదిలా ఉంటే ఇటీవల మహేశ్‌బాబు తన భార్యాపిల్లలు నమ్రత, గౌతమ్, సితారలతో కలిసి హాలిడే ట్రిప్ వెళ్లాను. ఈ ట్రిప్ తన తనయుడు గౌతమ్‌కి చాలా ప్రత్యేకమని మహేశ్ పేర్కొన్నారు. దానికి కారణం ఇంగ్లండ్‌లో జరిగిన ప్రపంచ కప్ మ్యాచ్‌ని ఈ కుటుంబం చూసింది. వరల్డ్ కప్ మ్యాచ్‌ని స్వయంగా స్టేడియమ్‌లో గౌతమ్ చూడటం ఇదే మొదటిసారి కాబట్టి తనకిది స్పెషల్ ట్రిప్ అన్నారు మహేశ్.


● మహేశ్‌బాబు

ఫస్ట్ లుక్


● ‘వాల్మీకి’ చిత్రంలో అథర్వ మురళి, వరుణ్ తేజ్

## 16 కోట్ల ఫ్లాట్!

**దీ**పం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. డిమాండ్ ఉన్నప్పుడే డబ్బులు కూడబెట్టుకోవాలి. ఈ మంత్రాన్నే హీరోయిన్లు పాటిస్తుంటారు. కూడబెట్టడంలోనే కాదు ఖర్చుపెట్టడంలోనూ కొందరు హీరోయిన్లు ముందుంటారు. తాజాగా ఓ ఫ్లాట్ కోసం అక్షరాలా పదహారు కోట్లు ఖర్చు చేశారట తమన్నా. ఈ ఫ్లాట్‌లోంచి చూస్తే ఎగిసిపడే సముద్రం కనిపిస్తుందట. ఆ కనువిందు కోసమే ఇంత ఖర్చు. హీరోహీరోయిన్లు విలాసవంతమైన ఇళ్లు కొనుగోలు చేయడం ఇదివరకు చాలా సందర్భాల్లో చూశాం. తాజాగా తమన్నా కూడా ఈ లిస్ట్‌లోకి గృహప్రవేశం చేయబోతున్నారు. ముంబైలోని ‘బే వ్యూ’ అనే అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్‌ను మార్కెట్ రేటుకు రెండింతలు చెల్లించి సొంతం చేసుకున్నారని సమాచారం. సుమారు 16.6 కోట్లు తమన్నా ఖర్చు చేశారట. దీనికి తోడుగా 2 కోట్లతో ఇంటీరియర్ డిజైన్ చేయించాలనుకుంటున్నారని తెలిసింది. త్వరలోనే ఈ అపార్ట్‌మెంట్‌లోకి కుడి కాలు పెట్టనున్నారట. ప్రస్తుతం తమిళంలో ఓ రెండు సినిమాలు, తెలుగులో రెండు సినిమాలతో బిజీబిజీగా ఉన్నారు.

# పండగ ఆరంభం


● రాశీఖన్నా, సాయితేజ్, ‘దిల్’ రాజు, అల్లు అరవింద్, మారుతి, ‘బన్నీ’ వాసు

**సా**యితేజ్, రాశీ ఖన్నా జంటగా మారుతి దాసరి దర్శకత్వం వహిస్తున్న ‘ప్రతిరోజు పండగే’ చిత్రం సోమవారం ఆరంభమైంది. ‘సుప్రీమ్’ వంటి హిట్ సినిమా తర్వాత మళ్లీ సాయి తేజ్, రాశీ ఖన్నా నటిస్తున్న చిత్రం ఇది. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 యూవీ పిక్చర్స్ పతాకంపై ‘బన్నీ’వాసు నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి అల్లు అరవింద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత ‘దిల్’ రాజు క్లాప్ ఇచ్చారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు జీఏ 2, యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా జీఏ2యూవీ పిక్చర్స్ సంస్థగా ఏర్పడి సినిమాలు నిర్మిస్తున్నారు. గతంలో ఈ బ్యానర్ నుంచి మారుతి డైరెక్షన్‌లో వచ్చిన ‘భలే భలే మగాడివోయ్’ సినిమా బ్లాక్ బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. తాజా చిత్రంలో సత్యరాజ్, విజయ్ కుమార్, రావు రమేష్, మురళీ శర్మ, అజయ్, ప్రవీణ్, శ్రీకాంత్ అయ్యంగార్, ‘సత్యం’ రాజేష్, సత్య శ్రీనివాస్, సుభాష్, హరితేజ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: ఎస్.కె.ఎన్, సంగీతం: తమన్. ఎస్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బాబు.


● శివరాజ్‌కుమార్

## చిన్న విరామం

**స్టా**ర్ హీరోలు వరుసగా సినిమాలు చేస్తే అటు అభిమానులకు ఇటు నిర్మాతలకూ ఆనందం. కానీ కన్నడ స్టార్ హీరో శివరాజ్‌కుమార్ మాత్రం యాక్టింగ్‌కు చిన్న బ్రేక్ ఇస్తున్నాను అంటున్నారు. భుజానికి తగిలిన గాయం కారణంగా సర్జరీ చేయించుకోవడం కోసం లండన్ పయనం అవుతున్నారు. దీంతో ఈ ఏడాది తన బర్త్‌డే (జూలై 12) కూడా సెలబ్రేట్ చేసుకోవడం లేదని చెప్పారు. ‘‘చాలా చిన్న సర్జరీ ఇదీ. టెన్షన్ పడాల్సింది ఏమీ లేదు. సర్జరీ పూర్తి చేసుకొని తిరిగొచ్చిన తర్వాత నవంబర్ వరకూ సినిమాల నుంచి టెంపరరీ బ్రేక్ తీసుకుందాం అనుకుంటున్నాను’’ అని శివరాజ్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉంటే... శివరాజ్ కుమార్ నటించిన ‘రుస్తుమ్’ చిత్రం ఈ శుక్రవారం రిలీజ్ కానుంది.


● కీర్తీ సురేష్
● నితిన్

## నితిన్.. కీర్తి.. రంగ్ దే

**దా**దాపు ఏడాది పాటు కెమెరాకు దూరంగా ఉన్నారు నితిన్. ‘శ్రీనివాస కల్యాణం’ తర్వాత స్క్రీన్‌పై కనిపించలేదు. ఇప్పుడు వరుస సినిమాలు అనౌన్స్ చేసి తీసుకున్న విరామాన్ని వడ్డీతో సహా తీర్చేస్తున్నారు. ఆల్రెడీ ‘ఛలో’ ఫేమ్ వెంకీ కుడుములతో ‘భీష్మ’ సినిమా మొదలుపెట్టారు. మొన్నే చంద్రశేఖర్ యేలేటి సినిమాకు ముహూర్తం పెట్టారు. తాజాగా వెంకీ అట్లూరితో సినిమా చేయనున్నట్టు ప్రకటించారు. ఈ చిత్రానికి ‘రంగ్ దే!’ అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. కీర్తీ సురేశ్ కథానాయిక. నితిన్, కీర్తి కలసి యాక్ట్ చేయడం ఇది తొలిసారి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై పీడీవీ ప్రసాద్, నాగవంశీ నిర్మించనున్నారు. ఈ సినిమాకు పీసీ శ్రీరామ్ కెమెరామేన్. 2020 సమ్మర్‌లో ఈ సినిమా రిలీజ్ కానుంది. మరోవైపు కృష్ణచైతన్య దర్శకత్వంలో ఓ సినిమా కూడా కమిట్ అయిన సంగతి తెలిసిందే.

# నా శత్రువు నాతోనే ఉన్నాడు


● మిస్తీ చక్రవర్తి, ‘డైమండ్ రత్నబాబు, ఆది సాయికుమార్, కిరణ్ రెడ్డి, పృథ్వీ

**‘రా**మాయణంలో రాముడి శత్రువు రావణాసురుడు.. కృష్ణుని శత్రువు కంసుడు... నా శత్రువు నాతోనే ఉన్నాడు’ అంటూ ఆది సాయికుమార్ డైలాగులతో ప్రారంభమయ్యే ‘బుర్రకథ’ ట్రైలర్ ఆసక్తిగా ఉంది. ఆది సాయికుమార్ హీరోగా, మిస్తీ చక్రవర్తి, నైరాశా హీరోయిన్లుగా నటించారు. రచయిత ‘డైమండ్’ రత్నబాబు ఈ సినిమాతో దర్శకునిగా పరిచయమవుతున్నారు. శ్రీకాంత్ దీపాల, కిషోర్, కిరణ్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ని హీరో వెంకటేష్ విడుదల చేసి, మాట్లాడుతూ– ‘‘ట్రైలర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా, ఎంటర్‌టైనింగ్‌గా ఉంది. మంచి స్టోరీ. ఆది బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. రత్నంబాబు తెరకెక్కించిన ఈ అందమైన కథని ప్రతి ఒక్కరూ చూడాలి’’ అన్నారు. ‘‘మా సినిమా టీజర్ చూసి వింటేజ్ క్రియేషన్స్ వారు ప్రపంచవ్యాప్తంగా విడుదల హక్కులు కొన్నారు. సినిమాపై చాలా నమ్మకంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం’’ అన్నారు శ్రీకాంత్ దీపాల. డైమండ్ రత్నబాబు మాట్లాడుతూ– ‘‘హీరో నమ్మకంతోనే ఒక డైరెక్టర్ వస్తాడు. ప్రతిభ ఉన్నవాళ్లు చాలా మంది ఉన్నారు. కానీ, వారందరినీ ప్రోత్సహించడానికి నిర్మాతలు చాలా అవసరం. రచయితగా ఉన్న నాకు దర్శకుడిగా ప్రోత్సాహం దొరికింది. ఈ చిత్రంలో తండ్రీ కొడుకుల మధ్య అనుబంధం చాలా బాగుండటంతో పాటు ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది’’ అని తెలిపారు. ఆది సాయికుమార్ మాట్లాడుతూ – ‘‘నాని, సందీప్ కిషన్, సాయి తేజ్‌లతో సహా మిగతా హీరోలందరూ మా సినిమా గురుంచి పాజిటివ్ ట్వీట్స్ చేసినందుకు థ్యాంక్స్. నాకు హిట్ పడి చాలా కాలం అయింది.. ఈ సినిమాతో మళ్లీ హిట్ సాధిస్తాననే నమ్మకం ఉంది’’ అన్నారు ఆది సాయికుమార్. ‘‘బుర్రకథ’ నా 4వ సినిమా. మంచి హిట్ అవుతుందని భావిస్తున్నా’’ అన్నారు కిరణ్‌రెడ్డి. ఈ చిత్రానికి కెమెరా: సి.రాంప్రసాద్.


● అనురాగ్ కశ్యప్

## నవాజ్ కోసమే నటిస్తున్నా

**ద**ర్శకుడిగా హిందీలో ‘గ్యాంగ్స్ ఆఫ్ వసీపూర్, దేవ్ డి, మన్‌మర్జియా’ వంటి సూపర్‌హిట్ సినిమాలను అందించారు అనురాగ్ కశ్యప్. 2017లో యాక్టర్‌గా ‘ఇమైక్క నొడిగళ్’ అనే తమిళ చిత్రంలో నటించారు. తాజాగా నవాజుద్దీన్ సిద్ధిఖీ హీరోగా రూపొందుతున్న ‘బోలే చుడియా’లోనూ యాక్ట్ చేయనున్నారట. ఈ సినిమా ద్వారా నవాజుద్దీన్ సిద్ధిఖీ తమ్ముడు నవాబ్ సిద్ధిఖీ దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. ఈ సినిమాలో నటించడం గురించి అనురాగ్ కశ్యప్ మాట్లాడుతూ – ‘‘నన్ను ఇప్పటివరకూ నవాజుద్దీన్ ఏదీ అడగలేదు. తొలిసారి ఈ సినిమాలో యాక్ట్ చేయమని అడిగారు. అందుకే చేస్తున్నాను’’ అన్నారు. అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో నవాజుద్దీన్ ‘గ్యాంగ్స్ ఆఫ్ వసీపూర్, రమన్ రాఘవన్’ సినిమాల్లో నటించారు.

# కొత్త డైరెక్టర్లు నన్ను కలవొచ్చు

**- రాజశేఖర్**


● ప్రవీణ్ సత్తారు, జీవిత, రాజశేఖర్, ప్రశాంత్ వర్మ, సి.కళ్యాణ్

‘‘**ఒ**కప్పుడు కోడి రామకృష్ణ, ముత్యాల సుబ్బయ్య, రవిరాజా పినిశెట్టి.. లాంటి దర్శకులు నాకు ఇచ్చిన నమ్మకాన్ని ఇప్పుడు ప్రవీణ్ సత్తారు, ప్రశాంత్ వర్మ అందిస్తున్నారు. ప్రవీణ్ సత్తారు ‘గరుడ వేగ’తో మా ముందు ఒక లక్ష్యాన్ని ఉంచారు. ‘కల్కి’ సినిమాతో దాన్ని అందుకుంటామనే నమ్మకముంది’’ అన్నారు హీరో రాజశేఖర్. ‘అ!’ ఫేమ్ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రాజశేఖర్ హీరోగా తెరకెక్కిన చిత్రం ‘కల్కి’. శివానీ–శివాత్మిక సమర్పణలో సి. కళ్యాణ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదలకానుంది. ‘కల్కి’ మూవీ హానెస్ట్ ట్రైలర్‌ని డైరెక్టర్ ప్రవీణ్ సత్తారు విడుదల చేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ– ‘‘కొత్త తరహా కథలతో కొత్త దర్శకులు నన్ను సంప్రదించొచ్చు. సి.కళ్యాణ్ నిర్మాతగా ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో ‘గరుడవేగ–2’ తెరకెక్కబోతోంది. చిరంజీవిగారి సినిమాలను కొడుకు రామ్‌చరణ్ నిర్మిస్తున్నట్టు నా సినిమాలకు నా కూతుర్లు సపోర్ట్ ఇవ్వడం హ్యాపీగా ఉంది’’ అన్నారు. ‘‘1983 నేపథ్యంలో సాగే పీరియాడికల్ చిత్రమిది. కొత్త ఫార్మాట్‌లో ఉంటుంది. సాయితేజ కథ ఇచ్చాడు. ఎవరి కథనీ కాపీ కొట్టలేదు’’ అన్నారు ప్రశాంత్ వర్మ. ‘‘ఓ సాధారణ ప్రేక్షకుడిలా క్లైమాక్స్ కోసం ఉత్కంఠగా చూశాను. థియేట్రికల్ రైట్స్ ఒక్కరే తీసుకోవడం విశేషం. రిలీజ్‌కి ముందే సక్సెస్‌ని ఎంజాయ్ చేస్తున్నాను’’ అన్నారు సి.కళ్యాణ్. ‘‘గరుడవేగ’ కన్నా ‘కల్కి’ పెద్ద విజయం సాధిస్తే.. దీన్ని మించి ‘గరుడవేగ–2’ తీస్తాం’’ అన్నారు ప్రవీణ్ సత్తారు.

# తలచినదే జరిగినదా...


● ఊర్వశి, రామ్‌కార్తీక్

**షై**న్ పిక్చర్స్ పతాకంపై రామ్ కార్తీక్, ఊర్వశి పరదేశి జంటగా సూర్యతేజ దర్శకునిగా పరిచయం అవుతున్న ‘తలచినదే జరిగినదా’ చిత్రం సోమవారం ప్రారంభమైంది. శేఖర్ రెడ్డి, సంధ్య రెడ్డి నిర్మాతలు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత సి.కళ్యాణ్ క్లాప్ ఇవ్వగా, ఎమ్. హరికృష్ణారావు కెమెరా స్విచ్చాన్ చేశారు. ‘దండు’ చిత్రదర్శకుడు సంజీవ్ కుమార్ గౌరవ దర్శకత్వం వహించారు. సూర్యతేజ మాట్లాడుతూ– ‘‘2000 ఏళ్ల క్రితం మొదలైనటప్పటి జీవితాలకు ఇప్పటి జీవితాలకు ఉన్న తేడాను తెలిపే ఫిక్షన్ స్టోరీనే మా చిత్రం. ‘జెర్సీ’ చిత్రానికి అసిస్టెంట్ దర్శకునిగా, అనేక ప్రభుత్వ ప్రకటనలకు డైరెక్టర్‌గా వర్క్ చేశాను. ఆ అనుభవంతో ఈ సినిమా తీస్తున్నాను’’ అన్నారు. శేఖర్ రెడ్డి మాట్లాడుతూ– ‘‘జూలై 8న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి రెండు షెడ్యూల్స్‌లో పూర్తి చేస్తాం’’ అన్నారు. ‘‘వేర్ ఈజ్ వెంకటలక్ష్మి’ చిత్రం తర్వాత నేను చేస్తున్న చిత్రం ఇది’’ అన్నారు రామ్‌కార్తీక్.


● దుల్కర్ సల్మాన్

## కామ్రేడ్ కోసం

**మ**లయాళ నటుడు దుల్కర్ సల్మాన్ నటుడే కాదు మంచి సింగర్ కూడా. ఇది వరకు తన సినిమాల్లో కొన్ని పాటలను తానే పాడారు. ‘ఏబీసీడి, చార్లీ, పరవా’ సినిమాల్లో తన గొంతుని వినిపించారు. తన తండ్రి మమ్ముట్టి నటించిన ‘మంగ్లీష్’ కోసం ఓ పాట పాడారు. లేటెస్ట్‌గా టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ విజయ్ దేవరకొండ ‘డియర్ కామ్రేడ్’ సినిమా కోసం ఓ పాట పాడారు. అయితే ఇది తెలుగు పాట కాదు, మలయాళ పాట. ‘డియర్ కామ్రేడ్’ తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో రిలీజ్ కానుంది. జస్టిన్ ప్రభాకర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా కోసం మలయాళ పాటను ఇటీవలే రికార్డ్ చేశారట దుల్కర్.


● అనుష్క

# కంగారేం లేదు

ఇటీవల కాలంలో హీరోలందరూ వరుసగా గాయపడుతున్నారు. తాజాగా అనుష్క కూడా గాయపడ్డారని ఓ వార్త చక్కర్లు కొడుతోంది. దీంతో ఆమెకు ఏమైందో అని అనుష్క అభిమానులు గాబరా పడ్డారు. అయితే అనుష్కకు గాయం అయిందనే వార్తల్లో ఎటువంటి నిజం లేదని తెలిసింది. ‘సైరా: నరసింహారెడ్డి’ షూటింగ్ చేస్తూ అనుష్క గాయపడ్డారన్నది ప్రచారంలో ఉన్న వార్త. కానీ ‘సైరా’ సినిమా షూటింగ్‌ను అనుష్క ఎప్పుడో పూర్తిచేశారు. ఆమె పాత్ర మాత్రమే కాదు.. మొత్తం షూటింగ్ పూర్తయి పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఉంది. ఆల్రెడీ చిరంజీవి డబ్బింగ్ కూడా స్టార్ట్ చేశారు. ఇందులో అనుష్క, చిరంజీవిలపై ఓ సాంగ్ ఉంటుందట. చాలా కొద్దిక్షణాలు మాత్రమే అనుష్క ‘సైరా’లో కనిపిస్తారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం హేమంత్ మధుకర్ దర్శకత్వంలో ‘నిశ్శబ్దం’ అనే చిత్రం చేస్తున్నారామె.

# జై సేన సూపర్‌హిట్ అవ్వాలి

**- బి.గోపాల్**



● పాట ఆవిష్కరణలో బి.గోపాల్‌తో సునీల్, వి.సముద్ర...

‘‘**జై** సేన’ సినిమా కథాంశం కొత్తగా ఉంది. ఆరుగురు యంగ్‌స్టర్స్‌తోపాటు శ్రీకాంత్, సునీల్ మంచిపాత్రలు చేశారు. ఈ సినిమా సూపర్‌హిట్ అవ్వాలని కోరుకుంటున్నా’’ అన్నారు దర్శకుడు బి.గోపాల్. శ్రీకాంత్, సునీల్, శ్రీ, పృథ్వి, ప్రవీణ్, కార్తికేయ ముఖ్య తారలుగా వి.సముద్ర దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ‘జై సేన’. వి.విజయలక్ష్మి సమర్పణలో వి.సాయి అరుణ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని ‘సేన జైసేన... యుద్ధం చెయ్...’ అంటూ సాగే మొదటి పాటను బి.గోపాల్ రిలీజ్ చేశారు. సునీల్ మాట్లాడుతూ– ‘‘జై సేన’లో సీరియస్ పోలీస్ ఆఫీసర్ పాత్ర చేశాను. అప్పట్లో టి.కృష్ణగారు మంచి సందేశంతో సినిమాలు తీసేవారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన ‘రేపటిపౌరులు’ సినిమా చాలా బాగుంటుంది. ఆ కోవలో మంచి మెసేజ్‌తో చేసిన ‘జై సేన’ కూడా తప్పకుండా అందరికీ నచ్చుతుంది’’ అన్నారు. వి.సముద్ర మాట్లాడుతూ– ‘‘బి.గోపాల్‌గారి చేతుల మీదుగా మొదటి పాట విడుదల కావడం సంతోషం. ఈ పాటను, సునీల్ అన్నయ్య పాత్ర డైలాగ్స్‌ను చందు బాగా రాశాడు. ఇండస్ట్రీలో మంచి వ్యక్తి అంటే కృష్ణగారి గురించి చెబుతాం.. శ్రీకాంత్ కూడా కృష్ణగారి అంత మంచి వ్యక్తి. పొలిటికల్ లీడర్స్‌ని, యూత్‌తో పాటు అందర్నీ ఆలోచింపజేసే సినిమా ఇది’’ అన్నారు. సహ నిర్మాత శిరీష్‌రెడ్డి, నటీనటులు ప్రీతి శర్మ, నీతు గౌడ, ప్రవీణ్, అభిరామ్, కార్తికేయ, హరీష్ గౌతమ్, రచయిత చందు తదితరులు మాట్లాడారు.





# వరి వెద సాగు.. బాగు బాగు..!

సీడ్ డ్రిల్‌తో వరి విత్తే పద్ధతి

- కూలీల కొరతను అధిగమించవచ్చు
- 20% నీటి ఆదా.. 7-10 రోజులు ముందే పంట కోత
- 10-15% అధిక దిగుబడి కూడా!
- వర్షాలు/కాలువ నీరు ఆలస్యమైనా సకాలంలో సార్వా పూర్తి.. అదనులోనే రెండో పంట సాగుకు వీలు

**వర్షాలు సరైన సమయంలో కురవకపోవడం, తద్వారా కాలువల్లో సాగునీరు ఆలస్యంగా విడుదలవడం వలన వరి నారు మడులు పోసుకోవడం, నాట్లు వేయడం ఆలస్యమై దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. చెరువులు, కాలువలు, బావుల కింద పండించే పంటలు కాలక్రమేణా బోర్ల ద్వారా, భూగర్భ జలాల మీద ఆధారపడి వ్యవసాయం చేసే పరిస్థితి వచ్చింది. ఈ క్రమంలో భూగర్భ జలాలు కూడా కొరవడుతున్నాయి. వీటితో పాటు కూలీల కొరత, అధిక కూలి రేట్లు వంటి సమస్యలతో రైతాంగం ఉక్కిరిబిక్కిరి అవుతున్న తరుణంలో నేరుగా విత్తే వరి సాగు పద్ధతులు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. పొడి నేలలో పొడి వరి విత్తనాన్ని వెద బెట్టడం, దమ్ము చేసిన మాగాణులలో డ్రమ్ సీడర్‌తో మొలకెత్తిన విత్తనం వేసుకోవటం లేదా వెద జల్లడం వంటి పద్ధతుల్లో వరి సాగు చేయడం మేలని బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ సి. వి. రామారావు సూచిస్తున్నారు. సార్వాలో వెద వరి పంట సకాలంలో తీసుకోగలిగితే మినుము, పెసరలను రెండో పంటగా వేసి మంచి దిగుబడులు సాధించడానికి వరి వెద పద్ధతి రైతాంగానికి ఎంతో ఉపయోగకరంగా ఉందని ఆయన తెలిపారు. ఈ పద్ధతిలో 20% నీరు ఆదా అవుతుంది. 10 రోజులు ముందుగానే కోతకొస్తుంది. పంట దిగుబడి 15% పెరుగుతుంది.**

అధిక నీరు అవసరమయ్యే పంట కావడంతో వరి సాగుకు వాతావరణ మార్పులు శాపంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో నారుపోసి నాట్లు వేయడం కన్నా నేరుగా విత్తుకోవడం మేలు. వరి నేరుగా విత్తే విధానంలో ముఖ్యంగా రెండు పద్ధతులున్నాయి:

**1** **పొడి విత్తనాన్ని విత్తే పద్ధతి** : పొడి విత్తనాలను పొడి నేలపై వెద జల్లడం ద్వారా గాని, డ్రిల్లింగ్ చేయడం ద్వారా గాని, వెద సాగు పరికరాల(విత్తన గొర్రు)తో గాని విత్తుతారు. వరి విత్తనాన్ని పొడి వాతావరణంలో విత్తి, తరువాత వానలు మొదలై కాలువలకు నీళ్లు వచ్చిన అనంతరం మాగాణి పంటల మాదిరిగా సాగు చేస్తారు. తొలకరి వానలు పడగానే విత్తనాలు విత్తుతారు. అటు వర్షపు నీటిని, కాలువల నీటిని ఉపయోగించుకుంటూ వరిని సాగు చేస్తారు.

**2** **తడి విత్తనాన్ని విత్తే పద్ధతి** : ఈ పద్ధతిలో మొలకెత్తించిన విత్తనాలను దమ్ము చేసిన పొలంలో వెదజల్లడం ద్వారా గాని లేదా డ్రమ్ము సీడర్ ద్వారా గాని విత్తుతారు. తడి విత్తనాన్ని అంటే.. నానబెట్టి, మండె కట్టి మొలకెత్తిన విత్తనాన్ని దమ్ము చేసిన మాగాణుల్లో వెదజల్లడం ద్వారా గాని, డ్రమ్ సీడరు ద్వారా గాని విత్తుతారు.

## విత్తన ఎంపికలో మెలకువలు

పొడి విత్తనాన్ని వెద పద్ధతి ద్వారా, తడి విత్తనాన్ని డ్రమ్ సీడరు ద్వారా లేదా వెదజల్లడం ద్వారా నేరుగా విత్తే పద్ధతులను అనుసరించేటప్పుడు వరి రకాలను ఎంపికచేసుకునేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- సార్వాలో 140-150 రోజులు, దాళ్వాలో 120-125 రోజుల కాలపరిమితి గల రకాలను ఎంచుకోవాలి.
- ఈ పద్ధతిలో చేను పడిపోయే అవకాశాలు ఎక్కువ. కాబట్టి, కాండం దృఢంగా ఉండి చేనుపై పడిపోని రకాన్ని ఎంపిక చేసుకోవాలి.
- మొక్క శాఖీయ పెరుగుదల దశలో వేగంగా పెరిగి కలుపును అణగదొక్కగల సామర్థ్యం కలిగి ఉండాలి.
- ఆయా ప్రాంతాల్లో అధికగా వచ్చే చీడపీడలను తట్టుకొనే శక్తిని కలిగి ఉండాలి.
- ఎంపిక చేసుకునే రకం 2-3 వారాలు నిద్రావస్థ కలిగినదై ఉండాలి.
- తక్కువగా గింజ రాలే రకాలను ఎంపిక చేసుకోవాలి.
- అధిక దిగుబడితో పాటు మంచి గింజ నాణ్యత కలిగి ఉండాలి. ఈ సూచనలను దృష్టిలో ఉంచుకొని రైతులు గింజ రకాలను ఎంపిక చేసుకోవాలి.

**పొలం తయారీ:** వెద పద్ధతిలో వరి సాగు చేసేటప్పుడు వేసవిలోనే నేలను కలియదున్నాలి. నేల స్వభావాన్ని బట్టి నాలుగు మూలలు సమానంగా ఉండేటట్లు పెద్ద పెద్ద మట్టి గడ్డలు లేకుండా పొలం సమతలంగా ఉండేటట్లు చూసుకోవాలి. తడి విత్తన పద్ధతిలో సాగు చేసేటప్పుడు సాధారణ నాట్లు పద్ధతిలో ఎలాగైతే భూమిని తయారు చేస్తామో అలాగే తయారు చేయాలి. చివరి సారి దమ్ము చేసిన తర్వాత పొలమంతా ఎత్తుపల్లాలు లేకుండా సమానంగా చదును చేయాలి. పొలాన్ని చిన్నచిన్న మడులుగా విభజించుకుంటూ చదును చేయడం వలన నీరు పెట్టడానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. మట్టి పేరుకున్న తరువాత బురద పదునులో ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. కాలువలు చేయాలి. వీటి ద్వారా ఎక్కువగా నీరు, మురుగు నీరు బయటకు పోవడానికి వీలవుతుంది.

## విత్తన మోతాదు

వెదజల్లే పద్ధతిలో అయితే రకాన్ని బట్టి ఎకరానికి 12 నుంచి 16 కిలోల విత్తనం, డ్రమ్‌సీడరుతో విత్తుకుంటే 10 నుంచి 12 కిలోల విత్తనం అవసరం అవుతుంది. వెదపద్ధతిలో ఎకరానికి పొడి విత్తనం 10 నుంచి 15 కిలోల విత్తనం వాడాలి.

## విత్తనశుద్ధి

ఒక లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్‌ను కలిపి కిలో విత్తనాన్ని 24 గంటలు నానబెట్టి తర్వాత మండె కట్టి మొలకవచ్చిన తర్వాత వెదజల్లడం గాని, డ్రమ్ సీడరుతో గాని విత్తుకోవాలి. వెదజల్లే పద్ధతిలో సాగు చేసేటప్పుడు ఒక కిలో విత్తనానికి 3 గ్రా. కార్బెండిజమ్‌ను కలిపి వెద పెట్టడం వల్ల విత్తనం ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్లను తక్కువ ఖర్చుతో నివారించవచ్చు. (సేంద్రియ పద్ధతిలో సాగు చేసే రైతులు బీజామృతం లేదా ఇతర పద్ధతుల్లో విత్తనశుద్ధి చేసుకోవాలి).

### వరిని నేరుగా విత్తితే లాభాలు

**1** తొలకరి వానలు పడిన వెంటనే వరి సాగు మొదలు పెట్టుకోవచ్చు.
**2** అటు వర్షపు నీరు, ఇటు కాలువ నీరును ఉపయోగించుకుంటూ పంటను పండించవచ్చు.
**3** దీని వలన పంటకాలం నష్టపోకుండా సకాలంలో సాగు చేయడానికి వీలవుతుంది.
**4** ఈ పద్ధతిని పాటించడం వలన కాలువలలో నీరు ఆలస్యంగా వచ్చినా వరి పంట తరువాత మినుము, పెసర వంటి పైర్లను సకాలంలో విత్తవచ్చు.
**5** ఈ పద్ధతిలో తక్కువ మోతాదు విత్తనం వాడటం వల్ల విత్తన ఖర్చు, నారు పెంచడానికి, నారు తీయడానికి, నారు మోయడానికి, నాట్లు వేయడానికి అయ్యే ఖర్చు ఆదా అవుతుంది.
**6** సరి అయిన సమయంలో విత్తడం వల్ల నాట్ల పద్ధతిలో కన్నా చీడపీడల బెడద తక్కువగా ఉంటుంది. అందువల్ల సస్యరక్షణ ఖర్చులు తగ్గుతాయి.
**7** విత్తనం భూమిపై తక్కువ లోతులో మొలకెత్తడం వలన వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెంది.. పైరు నీటిని, పోషక పదార్థాలను సక్రమంగా వినియోగించుకుంటుంది.
**8** నాట్ల పద్ధతిలో కన్నా ఈ విధానంలో 20% నీరు ఆదా అవుతుంది.
**9** నాట్ల పద్ధతిలో కన్నా 7-10 రోజుల ముందుగా వరి పంట కోతకు వస్తుంది. నేరుగా విత్తే పద్ధతిని అనుసరించడం వలన సాగు ఖర్చు తగ్గడంతో పాటు 10-15% అదనపు దిగుబడులు కూడా సాధించవచ్చు.

### వరి నేరుగా విత్తే పద్ధతిలో సమస్యలు

**1** సరైన లోతులో విత్తుకోవటం
**2** ప్రారంభ దశలో కలుపు నిర్మూలన
**3** సరైన నీటి యాజమాన్యం
**4** పొలాన్ని సరిగ్గా చదును చేసుకోవడం

## వెద పద్ధతిలో విత్తే విధానం

వెద పద్ధతిలో వరి విత్తనాలను పొలంలో చల్లడం కాక పొలంలో సాళ్లుగా విత్తితే మంచి ఫలితాలనిస్తాయి. దీనికి పొలాన్ని సాంప్రదాయ పద్ధతిలో దున్నకూడదు. విత్తన గొర్రు ఉపయోగిస్తే కనీసం 2-4 సెం.మీ. వెడల్పు, 4-7 సెం.మీ. ఎత్తు ఉండే గాడులు ఏర్పడి అందులో విత్తనాలు సమానలోతు, సమాన దూరంలో నాటుకుంటాయి. 2-3 సెం.మీ. లోతులో విత్తితే మొలక శాతం బాగుంటుంది. దీని కన్నా ఎక్కువ లోతులో విత్తితే మొలక రావడం కష్టమవుతుంది. ఈ విధానంలో పొలంలో నేల ఎక్కువ కదలికకు గురికాదు. నీరు పెట్టినప్పుడు అది సాఫీగా ప్రవహించి మొక్కలకు చేరుకుంటుంది. సాంప్రదాయ పద్ధతిలో దున్నినప్పుడు నేలంతా కదలడం వలన నీరు పెట్టినప్పుడు చాలా వరకు పీల్చుకుపోయి మొక్కకు చేరడానికి ఎక్కువ నీరు అవసరమవుతుంది. వెదసాగు యంత్రంలో విత్తనాలకు, కలుపు మందుకు, ఎరువుకు విడి విడిగా అరలు ఉంటాయి. విత్తనంతో పాటే ఎరువు కూడా నేరుగా చేలో పడుతుంది. అనుభవం కలిగిన ట్రాక్టరు డ్రైవరు ఈ వెదసాగు యంత్రంతో గంటలో ఒక ఎకరాన్ని విత్తగలరు.



మొలక కట్టిన వరి విత్తనాన్ని విత్తే పద్ధతి

వెదజల్లే విధానంలో విత్తేముందు పొలం వైశాల్యాన్ని బట్టి ఎన్ని మడులున్నాయో చూసుకొని ఆ ప్రకారం విత్తనాన్ని 24 గంటలు నానబెట్టి, 24 గంటలు మండెకట్టి, మొలకెత్తిన విత్తనాన్ని అన్ని భాగాలుగా చేసుకుంటే, విత్తనాలు సమానంగా నేల మీద పడతాయి. మొక్కల సాంద్రత సమంగా ఉంటుంది. విత్తిన రెండు వారాల తరువాత వత్తుగా ఉన్న మొక్కలను తీసివేసి పలుచగా ఉన్న చోట నాటుకోవాలి.

## డ్రమ్ సీడరుతో వరి విత్తే విధానం

డ్రమ్ సీడరుతో విత్తేటప్పుడు విత్తనాన్ని 24 గంటలు నానబెట్టి 24 గంటలు మండెకట్టి గింజల నుంచి మొలక ఆరంభదశలో వున్నప్పుడు డ్రమ్‌లలో నింపుకోవాలి. అలా కాక మొలక పొడువగా ఉంటే డ్రమ్‌లలో పోసినప్పుడు అవి అల్లుకుపోయి రంధ్రాలకు అడ్డుపడి విత్తనాలు సులువుగా రాలవు. ఈ విధంగా మొలక ఆరంభ దశలో వున్న విత్తనాలను డబ్బాలలో 3/4 వంతు వరకు నింపి ముందుగా దమ్ము చేసి చదును చేసిన పొలంలో డ్రమ్ సీడరును దానికున్న పిడి సహాయంతో లాగడం వలన చక్రాలతో పాటు డ్రమ్ములు తిరిగి డ్రమ్ములకున్న రంధ్రాల ద్వారా విత్తనాలు పొలంలో వరుసగా పడతాయి. ఇలా ఒకసారి డ్రమ్‌సీడరును లాగితే 8 వరుసలలో వరుసకు వరుసకు మధ్య 20 సెం.మీ. దూరంలో 5 నుంచి 8 గింజలు పడతాయి. వరుసలు పాడవకుండా ఉండాలంటే పొలంలో వారం వరకు బురద పదునుగా నీరు పలుచగా ఉండాలి. అయితే, నీరు పలుచగా ఉండటం వలన కలుపు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. కావున కలుపు మందును తగు మోతాదులో 6-7 రోజుల లోపు వేసుకోవాలి. ఈ డ్రమ్‌సీడరును ఉపయోగించి రోజుకు 2-3 ఎకరాలు విత్తుకోవచ్చు. ఒక ఎకరం పొలాన్ని ఇద్దరు కూలీలు రెండున్నర గంటలలో విత్తగలరు.



డ్రమ్ సీడర్‌తో విత్తే పద్ధతి

## నీటి యాజమాన్యం

విత్తిన తరువాత మొక్కల మొదటి ఆకు పూర్తిగా పురి విచ్చుకొనే వరకు (అంటే సుమారు 7-10 రోజులు) ఆరు తడులను ఇవ్వాలి. మొక్కలు 4-5 ఆకులు తొడిగిన తరువాత పొలంలో పలుచగా అంటే 2-3 సెం.మీ.ల లోతు నీరుండాలి. అంతకు మించి నీరు ఎక్కువగా ఉంటే పైరు బాగా దుబ్బు చేయదు. పైరు పిలక తొడిగి దుబ్బు కట్టుట పూర్తి అయిన తరువాత నుంచి కోతకు సుమారు 10 రోజుల ముందు వరకు 5 సెం. మీ. లోతు నీరుండాలి.

## పంటకోత

నేరుగా విత్తే పద్ధతిలో సాంప్రదాయ ఊడ్పు విధానం కన్నా పంట 7-10 రోజులు ముందే కోతకు వస్తుంది. పంటను కూలీల ద్వారా లేక కోత-నూర్పిడి యంత్రం ద్వారా కోయవచ్చు.

## నేరుగా విత్తే పద్ధతిలో జాగ్రత్తలు

**1** పొలమంతా సమానంగా ఎత్తుపల్లాలు లేకుండా చదును చేసుకోవాలి. దీనితో పొలమంతా నీరు సమానంగా పారి ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది.
**2** ఎకరానికి సిఫారసు చేసిన విత్తన మోతాదు ప్రకారమే విత్తుకోవాలి. ఎక్కువ విత్తనం వాడితే మొక్కలు ఒత్తుగా, తక్కువ వాడితే పలుచగా వుండి దిగుడులు తగ్గుతాయి. నేలలో విత్తనాన్ని 3 సెం.మీ. కంటే ఎక్కువ లోతులో వెద పెట్టకూడదు.
**3** విత్తనాన్ని నాటిన రెండు రోజులలోపే కలుపును అరికట్టాలి. సరైన మందులను, సరైన కాలంలో, సరైన మోతాదులో వాడాలి.
**4** విత్తనం పూర్తిగా మొలకెత్తిన తరువాత మొదటి నీటి తడిని భూమి స్వభావాన్ని బట్టి 7 నుంచి 15 రోజుల తర్వాత ఇవ్వవచ్చు.
**5** విత్తిన రెండు వారాల తరువాత ఒత్తుగా ఉన్న చోట మొక్కలు తీసి పలుచగా వున్నచోట నాటుకుంటే మొక్కల సాంద్రత పొలమంతా సమానంగా ఉంటుంది.
**6** నానబెట్టి, మండెకట్టిన విత్తనాలకు మొలక ఎక్కువగా పెరగనివ్వకూడదు. పెరిగినట్లైతే విత్తేటప్పుడు లేదా వెదజల్లేటప్పుడు మొలక విరిగి పోయే ప్రమాదం ఉంది.
**7** విత్తిన 10 రోజుల వరకు ఆరు తడులనివ్వాలి. నీరు ఎక్కువగా ఉంటే మురుగు కాల్వల ద్వారా తీసి వేయాలి. లేదంటే మొలక మురిగిపోతుంది. దుబ్బు దశ నుంచి నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

– **డాక్టర్ సి.వి. రామారావు,**
(94949 97701), ముఖ్య శాస్త్రవేత్త, వరి విభాగం,
బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం,
ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

## తెలంగాణలో నేరుగా విత్తే వరి సాగుకు అనువైన రకాలు

సాధారణ నాట్ల పద్ధతితో పాటు వెద పద్ధతిలో కూడా సాగు చేయడానికి అనువైన మూడు వరి రకాలు తెలంగాణ రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఆర్.ఎన్.ఆర్. 15048 (తెలంగాణ సోన) – 120 రోజుల పంట. ఖరీఫ్‌లో జూలై ఆఖరు, రబీలో డిసెంబర్ ఆఖరు వరకు విత్తుకోవచ్చు. రసాయనిక ఎరువులు మోతాదుకు మించి వాడితే పొలంలో పంట పడిపోతుంది. కె.ఎన్.ఎం. 118 (కూనారం సన్నాలు)– 120 రోజులు. మామూలుగా, ఆలశ్యంగా కూడా విత్తుకోవచ్చు. ఖరీఫ్‌లో జూన్–జూలై, రబీలో నవంబర్ ఆఖరు నుంచి డిసెంబర్ ఆఖరు వరకు విత్తుకోవచ్చు. జగిత్యాల మషూరి (జెజె 11470) – 135 రోజులు. ఖరీఫ్‌లో జూన్ 30లోగా, రబీలో నవంబర్ 30 లోగా విత్తుకోవాలి.

– **డా. చెన్నమాధవుని దామోదర్‌రాజు**
(94402 25385), ప్రధాన శాస్త్రవేత్త, వరి విభాగం,
ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

## చీడపీడలను దరిచేరనీయని నవార వరి



నవార రకం దేశీ వరిని తెలుగు రాష్ట్రాల్లో (ఖరీఫ్, రబీ) ఏ ప్రాంతంలోనైనా పండించవచ్చు. ఎకరానికి 15 కిలోల విత్తనం అవసరం. శ్రీ పద్ధతిలో 2 కిలోలు చాలు. పంటకాలం ఖరీఫ్‌లో 110-115 రోజులు, రబీలో 120-125 రోజులు. ఎకరానికి 18-20 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది. నవార అన్ని రకాల చీడపీడలను తట్టుకుంటుంది. విత్తనాలు నల్లగా, బియ్యం ఎర్రగా ఉంటాయి. నవార బియ్యం తిన్నవారిలో షుగర్ వ్యాధి నియంత్రణలో ఉంటుంది. ఇడ్లీ, దోసెలలో ఎక్కువగా వాడుతారు. అయితే, వడగళ్ల వానకు పంట కింద పడిపోయి గింజలు రాలిపోతాయి. గడ్డిని పశువులు ఇష్టంగా తింటాయి. ఈ విత్తనాల కోసం సికింద్రాబాద్ తార్నాక నాగార్జున నగర్‌లోని సి.ఎస్.ఎ. కార్యాలయాన్ని 1800 120 3244 నంబరులో సంప్రదించవచ్చు. జూలై చివరి వరకూ విత్తుకోవచ్చని శాస్త్రవేత్త డా. రాజశేఖర్(83329 45368) తెలిపారు.

## అటవీ కృషిపై 30, జూలై 1 తేదీల్లో డా. ఖాదర్ వలి సదస్సులు

తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం, రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అటవీ కృషి పద్ధతుల్లో సిరిధాన్యాల మిశ్రమ సాగుపై స్వతంత్ర శాస్త్రవేత్త డా. ఖాదర్ వలి రైతులకు శిక్షణ ఇస్తారు. 30(ఆదివారం) ఉ. 10 గం. నుంచి సా. 4 గం. వరకు **నిజామాబాద్ జిల్లా బోధన్**‌లోని కొత్త రమాకాంత్ ఫంక్షన్ హాల్‌లో జరిగే రైతు సదస్సులో డా. ఖాదర్ ప్రసంగిస్తారు. వివరాలకు.. అఖిలభారత రైతు సమన్వయ సమితి నేత అప్పిరెడ్డి –83090 24948. **నిజామాబాద్**‌లోని లక్ష్మీ కల్యాణ మండపం (ఆర్మూర్ రోడ్డు)లో 30న సా. 5 గం. నుంచి సిరిధాన్యాలపై ఆరోగ్య సదస్సులో డా. ఖాదర్ వలి ప్రసంగిస్తారు. వివరాలకు.. జి. దామోదర్‌రెడ్డి – 94407 02029. జూలై 1(సోమవారం)న **మెదక్**‌లోని వైస్రాయ్ గార్డెన్‌లో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉ. 10 గం. నుంచి 12 గం. వరకు డాక్టర్ ఖాదర్ వలి ప్రసంగిస్తారు. వివరాలకు.. డా. శ్యాంసుందర్‌రెడ్డి – 99082 24649. జూలై 1(సోమవారం)న సా. 4 గం. నుంచి **జనగామ**లోని ఎన్.ఎం.ఆర్. ఫంక్షన్ హాల్ (సూర్యాపేట రోడ్డు)లో వాలంతరి ఆధ్వర్యంలో జరిగే రైతు సదస్సులో డా. ఖాదర్‌వలి ప్రసంగిస్తారు. వివరాలకు.. శంకరప్రసాద్ – 77029 70001. ఈ సభలకు ప్రవేశం ఉచితం.

## 30న సేంద్రియ మిరప, పత్తి, వరి సాగుపై శిక్షణ

రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గరలో కొర్నెపాడు రైతు శిక్షణ కేంద్రంలో ఈ నెల 30(ఆదివారం) సేంద్రియ వ్యవసాయ విధానంలో మిరప, పత్తి, వరి సాగుపై ప్రకృతి వ్యవసాయదారులు శ్రీమతి లావణ్య, రమణారెడ్డి శిక్షణ ఇస్తారు. వివరాలకు 97053 83666.

## కూరగాయలు విత్తే సమయం.. విత్తన మోతాదు

ఇంటి పంట

(10 చదరపు మీటర్ల విస్తీర్ణానికి అవసరమైనవి)

| పంట | విత్తన మోతాదు | నాటే/విత్తే సమయం | నాటే దూరం (వరుసల మధ్య / మొక్కల మధ్య) | పంటకాలం |
|---|---|---|---|---|
| టమాట | 3 గ్రా. | సం. పొడవునా | 60 సెం.మీ./45-30 సెం. మీ. | 4 నెలలు |
| వంగ | 3 గ్రా. | సం. పొడవునా | 50 సెం.మీ./50 సెం.మీ. | 4-5 నెలలు |
| మిరప | 3 గ్రా. | సం. పొడవునా | 60 సెం.మీ./45-30 సెం. మీ. | 5 నెలలు |
| బెండ | 30 గ్రా. | ఫిబ్రవరి-మార్చి, మే-సెప్టెంబర్ | 60-45 సెం.మీ./30 సెం.మీ. | 3 నెలలు |
| ముల్లంగి | 5-10 గ్రా. | సం. పొడవునా | 20 సెం.మీ./20 సెం.మీ. | 3 నెలలు |
| బీట్‌రూట్ | 10 గ్రా. | ఆగస్టు-నవంబర్ | 45 సెం.మీ./15 సెం.మీ. | 3 నెలలు |
| ఉల్లి | 10 గ్రా. | జూన్-జూలై | 30 సెం.మీ./15 సెం.మీ. | 4 నెలలు |
| పాలకూర | 30 గ్రా. | సం. పొడవునా (ఏప్రిల్, మే తప్ప) | 20 సెం.మీ./20 సెం.మీ. | 2 నెలలు |
| చుక్కకూర | 50 గ్రా. | సం. పొడవునా | 20 సెం.మీ./20 సెం.మీ. | 2 నెలలు |
| గోంగూర | 15 గ్రా. | సం. పొడవునా | 10 సెం.మీ./10 సెం.మీ. | 3 నెలలు |
| పుదీనా | కాండం | సం. పొడవునా | 30 సెం.మీ./10 సెం.మీ. | ఎప్పటికీ |
| మెంతి | 25 గ్రా. | సం. పొడవునా | 25 సెం.మీ./20 సెం.మీ. | 3 నెలలు |
| ధనియాలు | 15 గ్రా. | సం. పొడవునా | వరుసలుగా విత్తుకోవాలి | 1 నెల |
| బఠానీ | 120 గ్రా. | అక్టోబర్-నవంబర్ | 30 సెం.మీ./15 సెం.మీ. | 3 నెలలు |
| గోరుచిక్కుడు | 40 గ్రా. | జూన్-జూలై, జనవరి-ఫిబ్రవరి | 45 సెం.మీ./30 మీ. | 4 నెలలు |
| చిక్కుడు | 40గ్రా. | జూన్-జూలై, జనవరి-ఫిబ్రవరి | 45 సెం.మీ./30 మీ. | 4 నెలలు |
| అలసంద | 30గ్రా. | జూన్-జూలై, జనవరి-ఫిబ్రవరి | 40 సెం.మీ./15 మీ. | 4 నెలలు |
| ఫ్రెంచ్ చిక్కుడు | 60 గ్రా. | నవంబర్-డిసెంబర్ | 45 సెం.మీ./30 సెం.మీ. | 4 నెలలు |
| కాకర | 3-4 విత్తనాలు /పాదుకు | జూన్-జూలై, జనవరి-ఫిబ్రవరి | 2.0 మీ./0.5 మీ. | 4 నెలలు |
| బీర | 3-4 విత్తనాలు /పాదుకు | జూన్-జూలై జనవరి-ఫిబ్రవరి | 2.0 మీ./0.75 మీ. | 4 నెలలు |
| సొర | 3-4 విత్తనాలు /పాదుకు | జూన్-జూలై జనవరి-ఫిబ్రవరి | 2.0 మీ./0.75 మీ. | 4 నెలలు |
| పొట్ల | 3-4 విత్తనాలు /పాదుకు | జూన్-జూలై జనవరి-ఫిబ్రవరి | 2.0 మీ./0.75 మీ. | 4 నెలలు |
| దోస | 3-4 విత్తనాలు /పాదుకు | జూన్-జూలై జనవరి-ఫిబ్రవరి | 1.0 మీ./0.5 మీ. | 4 నెలలు |
| క్యాబేజి | 3 గ్రా. | జూలై-నవంబర్ | 60 సెం.మీ./30 సెం.మీ. | 3-4 నెలలు |
| క్యాలీ ఫ్లవర్ | | జూలై-నవంబర్ | 60 సెం.మీ./30 సెం.మీ. | 3-4 నెలలు |
| క్యారెట్ | 5-8 గ్రా. | ఆగస్టు-నవంబర్ | 15సెం.మీ./15 సెం.మీ. | 3 నెలలు |

సౌజన్యం : సుస్థిర వ్యవసాయ కేంద్రం, తార్నాక, సికింద్రాబాద్ – ఫోన్: 1800 120 3244


# నాన్ బీటీ పత్తి రకం ఎ.డి.బి. 542

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలి నాన్ బీటీ పత్తి రకం ఎ.డి.బి. 542ని ఇటీవల ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసింది. ఆదిలాబాద్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఈ సూటి రకాన్ని రూపొందించింది. దీర్ఘకాలిక పంటకాలం కలిగిన బీటీ హైబ్రిడ్లు సైతం గులాబీ రంగు పురుగును తట్టుకోలేకపోతున్న తరుణంలో 6 నెలల్లోపలే పూర్తయ్యే ఎ.డి.బి. 542 వంటి మధ్యస్థ కాలిక రకాన్ని ఎంచుకోవడం ప్రయోజనకరమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

మధ్యస్థ కాలపరిమితి కలిగి అధిక దిగుబడినిచ్చే రకం ఎ.డి.బి. 542. 150-170 రోజుల్లోనే పంటను పూర్తి చేసుకోవడం దీని ప్రత్యేకత. తక్కువ పెట్టుబడితో తేలిక నేలల్లో, బరువైన నల్లరేగడి నేలల్లోనూ వర్షాధారంగా లేదా ఆరుతడి పద్ధతిలోనూ ఖరీఫ్‌లో పండించడానికి అనువైన రకం ఇది.

## హెక్టారుకు 3 వేల కిలోల దిగుబడి

వర్షాధారంగా సాగు చేసినప్పుడు హెక్టారుకు 1500 నుంచి 2500 కిలోల వరకు దిగుబడి వస్తుంది. ఆరుతడి పంటగా సాగు చేసినప్పుడు హెక్టారుకు 3000 కిలోల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని విశ్వవిద్యాలయం పత్తి పరిశోధనా విభాగం అధిపతి, ముఖ్య శాస్త్రవేత్త డా. సుదర్శన్ 'సాక్షి సాగుబడి'కి తెలిపారు. కాయ సైజు పెద్దగా ఉండటంతో పత్తి తీత సులభం. కాయలు దగ్గర దగ్గరగా గొలుసు వలె కాయడం ఈ రకం ప్రత్యేకత. పత్తి నాణ్యత బాగుంటుంది. పింజ పొడవు 27 మిల్లీ మీటర్లు ఉంటుంది.



బాక్టీరియా తెగులును, టొబాకో స్ట్రిక్ వైరస్ తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుంది. పచ్చదోమ, కాయతొలిచే పురుగులను కొంత వరకు తట్టుకుంటుంది.

బలమైన(నల్లరేగడి) నేలల్లో వరుసల మధ్య 3 అడుగులు, మొక్కల మధ్య 2 అడుగుల (90 సి.ఎం.× 60 సి.ఎం.) దూరంలో నాటుకోవచ్చు. మధ్యస్థ భూముల్లో వరుసల మధ్య 3 అడుగులు, మొక్కల మధ్య ఒక అడుగు దూరంలో నాటుకోవాలి. తేలిక నేలల్లో వరుసల మధ్య రెండున్నర అడుగులు, మొక్కల మధ్య ఒక అడుగు దూరంలో నాటుకోవాలని డా. సుదర్శన్ తెలిపారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో సాగుకు సైతం ఈ సూటిరకం అనువైనదని ఆయన తెలిపారు.

## సేంద్రియ సాగుకూ అనువైనది

ఎ.డి.బి. 542 రకం పత్తి మధ్యలో కంది సాళ్లు వేసుకోవచ్చు. 4 లేదా 5 లేదా 6 సాళ్లు పత్తివి విత్తుకొని ఒక సాలులో కంది విత్తుకోవచ్చు. ఈ రకం పత్తి ఆరు నెలల్లో పూర్తవుతుంది కాబట్టి అందుకు తగిన కంది రకాలు విత్తుకోవాలని డా. సుదర్శన్ తెలిపారు. తేలిక నేలల్లో అయితే మారుతి, వరంగల్ 97 కంది రకాలు, బరువైన (నల్లరేగడి) నేలల్లో అయితే ఆశ కంది రకాన్ని విత్తుకోవాలి. ఈ మూడు కంది రకాలూ ఎండు తెగులును సమర్థవంతంగా తట్టుకొని మంచి దిగుబడినిస్తాయని డా. సుదర్శన్(98669 62634) వివరించారు.

ఎ.డి.బి. 542 రకం పత్తి నుంచి విత్తనాలను వేరుచేసి దాచుకొని తర్వాత పంటకాలంలో విత్తనంగా వాడుకోవచ్చు. ఎ.డి.బి. 542 సూటి రకం పత్తి విత్తనాల కోసం రైతులు ఆదిలాబాద్‌లోని వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డా. రాజేంద్ర రెడ్డిని 97041 34304 నంబరులో సంప్రదించవచ్చు.

# తొలకరి లేత గడ్డితో జాగ్రత్త!



వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధుల్లో బ్యాక్టీరియా వ్యాధి గొంతు వాపు / గురక వ్యాధి (హిమరేజిక్ సెప్టిసీమియా) ముఖ్యమైనది. పాస్టురెల్లా మల్టొసైడ అనే బ్యాక్టీరియా వల్ల ఇది సోకుతుంది. తొలకరి వర్షాల తర్వాత మొలకెత్తిన లేత గడ్డి మీద పేరుకుపోయిన ఈ బ్యాక్టీరియా, మేత ద్వారా పశువు శరీరంలోకి ప్రవేశిస్తుంది. దాదాపుగా అన్ని పశువులు ఈ వ్యాధి బారిన పడతాయి. ఈ దిగువ తెలిపిన కారణాల వల్ల వ్యాధి తీవ్రమవుతుంది.

- పశువులకు పరాన్న జీవుల / వైరస్ / బ్యాక్టీరియా వ్యాధులు ముందుగానే ఉన్నట్లయితే..
- దున్నపోతులు ఎక్కువగా పనిచేసి అలసిపోయినప్పుడు..
- పశుల రవాణా సమయంలో..
- ఉన్నట్లుండి మేత మార్పిడి వలన..
- వాతావరణ మార్పులు – ఎక్కువగా వేడి, గాలిలో తేమ..
- నీరసంగా ఉన్న పశువులు..
- వ్యాధి సోకిన పశువులను వేరుగా ఉంచడం / ఉంచకపోవడం..

### వ్యాధి లక్షణాలు

- వ్యాధి త్వరగా సంక్రమించడం
- ఎక్కువగా జ్వరం
- నోటిలో చొంగ కార్చడం
- కళ్ల కలక, కంటి వెంబడి నీరు కారడం
- నెమరు నిలిచిపోవడం
- రొప్పడం, వైద్యం అందకపోతే చనిపోవడం

ఎక్యూట్ కేసులలో అయితే, ఆయాసపడడం, నొప్పిగా అరవడం, ఊపిరికి కష్టపడడం, మెడ క్రింద భాగాన, గంగడోలు ప్రాంతాల్లో నీరు చేరి ఉబ్బరింపుగా ఉండడం (బ్రిస్కట్ ఎడిమా) ముందర కాళ్లు కూడా నీరు పట్టినట్లు కనబడడం లాంటి లక్షణాలను కనబరుస్తుంది. పశువు గొంతులో ఈ సూక్ష్మక్రిములు ఒక్కోసారి తిష్ట వేసుకుంటాయి. పశువు నీరసించి పోయినప్పుడు లేదా పశువులో వైరల్ వ్యాధులు ఇతర పరాన్నజీవులు దాడి చేసినప్పుడు, ఈ గొంతులోని సూక్ష్మక్రిములు విజృంభిస్తాయి. బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించిన 30 గంటలకు వ్యాధి లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. 6 నెలలు – 3 సంవత్సరాల పెయ్య / పడ్డలకు సోకుతుంది.

### నివారణ

పరిశుభ్రమైన పాకలు, మంచి యాజమాన్యపు పద్ధతులు, ముందుగా వ్యాధి నిరోధక టీకా వేయించడం, ఆరోగ్యవంతమైన పశువులను వ్యాధి ప్రబలిన ప్రాంతాలకు వెళ్లకుండా కట్టడి చేయడం, చనిపోయిన పశువులను సక్రమంగా పాతిపెట్టడం చేయాలి. రైతులకు అవగాహన కలగజేయాలి.

వ్యాధి సోకిన పశువులకు వైద్యం కోసం సల్ఫాడిమిడైన్ 50 కేజీల బరువుకు 30 మిల్లీ లీటర్లు చొప్పున కండకు ఇంజెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. పెన్సిలిన్, టెట్రాసైక్లిన్లు ఎక్కువ మోతాదులో ఇవ్వాల్సి ఉంటుంది. 2 లేదా 3 రూపాయలతో నివారణ టీకా వేయించుకోవడం మేలు.

ఏ టీకా అయినా పూర్తి స్థాయిలో పశువుకు పనిచేయాలంటే కనీసం 2 వారాల సమయం పడుతుంది. కాబట్టి రైతు సోదరులారా త్వరపడడండి.

– **డా. ఎం.వి.ఎ.ఎన్.సూర్యనారాయణ**
(99485 90506), ప్రొఫెసర్ అండ్ హెడ్, పశుగణ క్షేత్ర సముదాయం, పశువైద్య కళాశాల, తిరుపతి

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
మంగళవారం 25-6-2019




# పీహెచ్‌డీతో పండగే..!

**పీహెచ్‌డీ.. డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ. డాక్టోరల్ డిగ్రీ అని పిలుస్తారు. వాస్తవానికి అకడెమిక్‌గా అత్యున్నత కోర్సు.. పీహెచ్‌డీ. సహనంతో శ్రమించి పూర్తిచేస్తే.. పీహెచ్‌డీతో ఉజ్వల కెరీర్ సొంతమవడం ఖాయం. ముఖ్యంగా కొన్ని స్పెషలైజేషన్స్‌తో పీహెచ్‌డీ చేస్తే.. జాబ్ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. అలాంటి పీహెచ్‌డీలో చేరిన స్కాలర్స్‌కు యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) ఫెలోషిప్పల మొత్తాన్ని పెంచింది. ఈ నేపథ్యంలో రీసెర్చ్ స్కాలర్స్‌కు పెరిగిన ఫెలోషిప్పల వివరాలతోపాటు పీహెచ్‌డీలో చేరేందుకు అందుబాటులో ఉన్న మార్గాలు.. పీహెచ్‌డీతో కెరీర్ అవకాశాల గురించి తెలుసుకుందాం...**

- పీహెచ్‌డీ విద్యార్థులకు ఫెలోషిప్ (జేఆర్‌ఎఫ్, ఎస్ఆర్‌ఎఫ్) పెంపు
- దేశవ్యాప్తంగా 60 వేల మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు ఉపశమనం
- ఆశించిన దానికంటే తక్కువగా పెంచారంటున్న విద్యార్థులు

### ఫెలోషిప్పల పెంపు

ఐఐటీ, ఏఐఐఎంఎస్, ఐసర్, ఐఐఎస్సీతో పాటు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఇతర యూనివర్సిటీల రీసెర్చ్ స్కాలర్లు ఫెలోషిప్‌లు(జేఆర్‌ఎఫ్, ఎస్ఆర్‌ఎఫ్) పెంచాలని ఎప్పటినుంచో కోరుతున్నారు. దాంతో పీహెచ్‌డీ అభ్యర్థుల ఆందోళనను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం.. ఫెలోషిప్‌లు పెంచుతున్నట్లు ఈ ఏడాది జనవరిలో ప్రకటించింది. అలా పెంచిన ఫెలోషిప్పుల అమలు గురించి యూజీసీ తాజాగా(జూన్ 3న జరిగిన సమావేశంలో) నోటిఫై చేసింది. సైన్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్‌కు సంబంధించి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్‌ఎఫ్) ప్రస్తుతం నెలకు ఇస్తున్న రూ.25వేల నుంచి రూ.31వేలకు; అలాగే సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(ఎస్ఆర్‌ఎఫ్) ప్రస్తుతం అందిస్తున్న రూ.28వేల నుంచి రూ.35వేలకు పెంచుతున్నట్లు తెలిపింది. ఫెలోషిప్పుల పెంపు 2019, జనవరి1 నుంచి అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. దీనివల్ల దేశవ్యాప్తంగా పీహెచ్‌డీ చదువుతున్న దాదాపు 60వేల మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు ప్రయోజనం చేకూరుతుంది. విద్యార్థులు మాత్రం తాము 60 శాతం పెంపు అడిగితే 20 శాతం మాత్రమే పెంచారని పేర్కొంటున్నారు.

**ఫెలోషిప్ మొత్తాల పెంపు ఇలా..**

| సంవత్సరం | 2019 | 2014 | 2010 |
|---|---|---|---|
| జూనియర్ ఫెలోషిప్(జేఆర్‌ఎఫ్) | 31000 | 25000 | 16000 |
| సీనియర్ ఫెలోషిప్(ఎస్ఆర్‌ఎఫ్) | 35000 | 28000 | 18000 |
| రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్-1 | 47000 | 36000 | 22000 |
| రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్-2 | 49000 | 38000 | 23000 |
| రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్-3 | 54000 | 40000 | 24000 |

### పీహెచ్‌డీకి మార్గాలు

పీహెచ్‌డీలో చేరిన విద్యార్థులకు ఫెలోషిప్ అందుతుంది. సైన్సెస్, సోషల్ సైన్సెస్, హ్యుమానిటీస్, ఇంజనీరింగ్ విభాగాల్లో పీహెచ్‌డీలో ప్రవేశం పొందేందుకు పలు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. అవి..

### సీఎస్ఐఆర్-యూజీసీ నెట్

కౌన్సిల్ ఫర్ ఇండస్ట్రియల్ అండ్ సైంటిఫిక్ రీసెర్చ్(సీఎస్ఐఆర్), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) సంయుక్తంగా సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌ను నిర్వహిస్తున్నాయి. దీనిద్వారా లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్ఫియరిక్ సైన్సెస్, ఓషియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్ తదితర విభాగాల్లో.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని రీసెర్చ్ లేబొరేటరీల్లో పీహెచ్‌డీలో ప్రవేశం పొందొచ్చు.

- **అర్హత:** 55 శాతం మార్కులతో ఎంఎస్సీ, ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్, నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్,బీఈ/బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్ ఉత్తీర్ణత.
- **వెబ్‌సైట్:** www.csirhrdg.res.in

### యూజీసీ నెట్

లాంగ్వేజెస్, ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ తదితర విభాగాల్లో పీహెచ్‌డీ చేసేందుకు యూజీసీ-నెట్ అవకాశం కల్పిస్తోంది. ఈ పరీక్షలో ప్రతిభ చూపడం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న సోషల్ సైన్సెస్ కాలేజీలు, మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్, యూనివర్సిటీల్లో పీహెచ్‌డీలో ప్రవేశం పొందొచ్చు. ఏటా రెండుసార్లు నిర్వహించే యూజీసీ నెట్‌కు హాజరయ్యేందుకు సంబంధిత సబ్జెక్ట్‌లో కనీసం 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత సాధించి పీహెచ్‌డీలో ప్రవేశం పొందితే.. తొలుత జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్‌ఎఫ్), ఆ తర్వాత సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(ఎస్ఆర్‌ఎఫ్) అందుతాయి.

- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://nta.ac.in www.ugcnetonline.in

### జెస్ట్

ప్రముఖ పరిశోధనా కేంద్రాల్లోకి అడుగుపెట్టే అవకాశం జెస్ట్(జాయింట్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్) ద్వారా లభిస్తుంది. ఏటా ఈ పరీక్షను ఫిజిక్స్, థియరిటికల్ కంప్యూటర్‌సైన్స్/న్యూరోసైన్స్/కంప్యుటేషనల్ బయాలజీ సబ్జెక్ట్‌ల్లో నిర్వహిస్తున్నారు. జెస్ట్‌లో ప్రతిభ చూపితే ఆర్యభట్ట రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అబ్జర్వేషనల్ సైన్సెస్, హోమీ బాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్, హరీశ్ చంద్ర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఐఐఎస్సీ-బెంగళూరు వంటి 29 రీసెర్చ్ కేంద్రాల్లోని పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో, అదేవిధంగా ఎంఎస్ బై రీసెర్చ్ వంటి ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలు పొందొచ్చు. పీహెచ్‌డీ ఇన్ థియరిటికల్ కంప్యూటర్ సైన్స్‌ను చెన్నైలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్సెస్ అందిస్తోంది. అలాగే పీహెచ్‌డీ ఇన్ న్యూరోసైన్స్‌ను గుర్గావ్‌లోని నేషనల్ బ్రైన్ రీసెర్చ్ సెంటర్ అందిస్తోంది.

- **వెబ్‌సైట్:** www.jest.org.in

### గేట్

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) స్కోరు ఆధారంగా రాష్ట్ర స్థాయి వర్సిటీలు, ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఇంజనీరింగ్/టెక్నాలజీ/ఆర్కిటెక్చర్ విభాగాల్లో ఎంటెక్ వంటి పీజీ కోర్సులతోపాటు సంబంధిత సైన్స్, ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల్లో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీల్లో ప్రవేశం పొందొచ్చు. అలా ప్రవేశం పొందిన వారికి ఆర్థికంగా ప్రోత్సాహం కల్పించేలా.. ఫెలోషిప్/స్కాలర్‌షిప్స్/అసిస్టెంట్‌షిప్స్ వంటివి అందుతాయి. గేట్ రాసేందుకు ప్రధాన అర్హత ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్. గేట్ 2020కు నోటిఫికేషన్ రావాల్సి ఉంది. ఈ ఏడాది గేట్‌ను ఐఐటీ ఢిల్లీ నిర్వహించే అవకాశముంది.

- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** gate.iitd.ac.in

### మేనేజ్‌మెంట్ రీసెర్చ్

మేనేజ్‌మెంట్ సబ్జెక్టుల్లో పరిశోధనలకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లు(ఐఐఎంలు) సరైన వేదికలుగా నిలుస్తున్నాయి. ఐఐఎంలు ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఎఫ్‌పీఎం) పేరుతో పీహెచ్‌డీకి సమానమైన ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. క్యాట్, జీమ్యాట్ స్కోర్ ఆధారంగా వీటిలో అడుగుపెట్టొచ్చు.

- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://iimcat.ac.in

### ముఖ్యాంశాలు



- సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ ద్వారా సైన్స్ విభాగంలో పీహెచ్‌డీలో ప్రవేశం.
- యూజీసీ-నెట్ ద్వారా ముఖ్యంగా ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్, లాంగ్వేజెస్‌ల్లో పరిశోధనలకు అవకాశం.
- జెస్ట్ స్కోరు ఆధారంగా సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలోని ప్రతిష్టాత్మక రీసెర్చ్ ల్యాబ్స్‌లో అడుగుపెట్టొచ్చు.
- గేట్ ఉత్తీర్ణతతో ఇంజనీరింగ్ సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీలో ప్రవేశం పొందొచ్చు.

### పీహెచ్‌డీ... ప్రోత్సాహకాలు

- నెలకు రూ.31వేల జేఆర్‌ఎఫ్; నెలకు రూ.35 వేల ఎస్ఆర్‌ఎఫ్.
- ఏటా నిర్ణీత మొత్తంలో కాంటింజెన్సీ గ్రాంట్, రీసెర్చ్ చేసేందుకు అవసరమైన పరికరాల కొనుగోలుకు నిధులు మంజూరు.
- పీఎంఆర్ఎఫ్ స్కీమ్ ద్వారా ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీకి అవకాశం.
- పీఎంఆర్ఎఫ్‌కు ఎంపికైతే రూ.70వేల ప్రారంభ ఫెలోషిప్.

### కెరీర్ ఉజ్వలం


- సీఎస్ఐఆర్, ఇక్రిశాట్, ఐఐసీటీ, ఐసీఏఆర్, ఎన్‌జీఐఆర్ఐ తదితర కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థల్లో జూనియర్ సైంటిస్ట్‌లుగా అవకాశం లభిస్తుంది. అధ్యాపక వృత్తిలో స్థిరపడొచ్చు.
- యూనివర్సిటీల్లో, ఇన్‌స్టిట్యూట్స్‌ల్లో నిర్ణీత నిష్పత్తితో పీహెచ్‌డీ ఫ్యాకల్టీ ఉండాలనే నిబంధన అమలు నేపథ్యంలో పెరుగుతున్న అవకాశాలు.
- ప్రైవేటు సంస్థల ఆర్ అండ్ డీ విభాగాల్లో సైంటిస్ట్‌లుగా ప్రారంభంలోనే నెలకు రూ.లక్షకు పైగా వేతనంతో కెరీర్ ప్రారంభించొచ్చు.
- స్వీయ రీసెర్చ్ ఔత్సాహికులకు సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు ఆధ్వర్యంలో ఏడాదికి రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు రీసెర్చ్ గ్రాంట్, నెలకు రూ.55వేల ఫెలోషిప్, ఇతర రీసెర్చ్ ఖర్చుల కోసం ఓవర్‌హెడ్స్ పేరుతో ఏడాదికి రూ.లక్ష తదితర ఆర్థిక ప్రోత్సాహకాలు.

### ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్

పీహెచ్‌డీతో డాక్టరేట్ పట్టా లభించడంతో పాటు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ దృక్పథం కూడా అలవడుతుంది. పరిశోధనల క్రమంలో సమస్యలను పరిష్కరించేటప్పుడు కొత్త ఆవిష్కరణలు సహజం. సదరు ఆవిష్కరణలు మార్కెట్ అవసరాలను తీర్చగలవని భావిస్తే.. సొంతంగా సంస్థలను ఏర్పాటు చేసే వీలుంటుంది. ఇటీవల కాలంలో రీసెర్చ్ ఔత్సాహికులకు ఎన్నో ప్రోత్సాహకాలు లభిస్తున్నాయి. బ్యాచిలర్ డిగ్రీ స్థాయి నుంచే ఈ దిశగా దృష్టిసారిస్తే ఉజ్వల భవిష్యత్తు ఖాయమంటున్నారు నిపుణులు.

### కోర్సులు-కాల వ్యవధి

- పీహెచ్‌డీ(మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ అండ్ సిస్టమ్ సైన్స్, సైన్స్ ఎడ్యుకేషన్)- కోర్సు కాల వ్యవధి అయిదేళ్లు.
- ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ(మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ అండ్ సిస్టమ్ సైన్స్). కోర్సు కాల వ్యవధి ఆరేళ్లు.



# రక్షణ రంగంలో మేటి కొలువులకు సీడీఎస్‌ఈ

**దేశ రక్షణ రంగంలో ఉన్నతస్థాయి ఉద్యోగానికి చక్కటి అవకాశం.. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీడీఎస్ఈ). ఇది దేశ రక్షణను తమ భుజాల మీద మోస్తున్న త్రివిధ దళాల్లో ఆఫీసర్ కేడర్‌లో చేరేందుకు వీలుకల్పించే పరీక్ష. సీడీఎస్ఈ (2)-2019కు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) ప్రకటన విడుదల చేసింది. దేశాన్ని కంటికిరెప్పలా కాపాడుతున్న మిలటరీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల్లో చేరాలనుకునే యువతకు సీడీఎస్ఈ స్వాగతం పలుకుతోంది. ఈ నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ఏడాది పాటు శిక్షణ కోర్సు ఉంటుంది. ఈ శిక్షణ 2020లో మొదలవుతుంది. శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ఆఫీసర్ కేడర్‌తో కెరీర్ ప్రారంభమవుతుంది. ఏటా క్రమం తప్పకుండా వెలువడే సీడీఎస్ఈ నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక విధానం, ప్రిపరేషన్ గైడెన్స్ గురించి తెలుసుకుందాం..**




### కోర్సు-ఖాళీల వివరాలు

- మొత్తం ఖాళీలు: 417.
- ఇండియన్ మిలటరీ అకాడమీ(డెహ్రాడూన్): 100.
- ఇండియన్ నేవల్ అకాడమీ(ఎజిమలా): 45.
- ఎయిర్‌ఫోర్స్ అకాడమీ(హైదరాబాద్): 32.
- ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ(చెన్నై)(పురుషులు): 225
- ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ(చెన్నై)(మహిళలు): 15

### అర్హత

- ఇండియన్ మిలటరీ అకాడమీ, ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీ పోస్టులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.
- **వయసు: మిలటరీ అకాడమీ:** 1996, జూలై 2-2001, జూలై 1 మధ్య జన్మించిన అవివాహిత పురుష అభ్యర్థులు అర్హులు.
- **ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీ:** 1995, జూలై 2-2001 జూలై 1 మధ్య జన్మించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **నేవల్ అకాడమీ:** బీటెక్/బీఈ ఉత్తీర్ణులు అర్హులు.
- **వయసు:** 1996 జూలై 2- 2001 జూలై 1 మధ్య జన్మించిన అవివాహిత పురుష అభ్యర్థులు అర్హులు.
- ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదివుండాలి లేదా ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ.
- **వయసు:** 1996, జూలై 2-2000, జూలై 1 మధ్య జన్మించి ఉండాలి. డీజీసీఏ జారీచేసిన కమర్షియల్ పైలట్ లైసెన్స్ ఉన్నవారికి రెండేళ్ల సడలింపు ఉంటుంది.
- నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

**గమనిక:** చివరి సంవత్సరం విద్యార్థులు కూడా అర్హులే. ఎలాంటి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు ఉండకూడదు. కోర్సు ప్రారంభానికి ముందు ఉత్తీర్ణత పత్రాలు చూపించాల్సి ఉంటుంది. ఆర్మీ/నేవీ/ఎయిర్‌ఫోర్స్‌కు మొదట ప్రాధాన్యమిచ్చేవారు ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ సమయానికి ప్రొవిజినల్ సర్టిఫికెట్ చూపించాలి. మహిళా అభ్యర్థులు ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీకి మాత్రమే అర్హులు.

### రెండంచెల్లో ఎంపిక

- ఎంపిక ప్రక్రియలో మొదట అన్ని కోర్సుల విద్యార్థులకు రాత పరీక్ష ఉంటుంది. ఇండియన్ మిలటరీ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అభ్యర్థులకు 300 మార్కులకు; ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ అభ్యర్థులకు 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఆబ్జెక్టివ్ తరహాలో జరిగే రాత పరీక్షలో రుణాత్మక మార్కుల విధానం అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి మూడో వంతు మార్కులు కోత విధిస్తారు.
- రాత పరీక్షలో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన అభ్యర్థులు సర్వీస్ సెలక్షన్ బోర్డ్(ఎస్ఎస్‌బీ) నిర్వహించే ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్‌కు హాజరవ్వాలి. ఇది అన్ని కోర్సుల విద్యార్థులకు ఉమ్మడిగా అయిదు రోజులపాటు జరుగుతుంది. ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి టెస్టులను 6 రోజులపాటు నిర్వహిస్తారు.

### ఇంటర్వ్యూకు 300 మార్కులు

- ఎస్ఎస్‌బీ టెస్టుల్లో వేర్వేరు పరీక్షలు నిర్వహించి.. ఆఫీసర్ ఉద్యోగాలకు సరిపోయే నైపుణ్యాలున్న అభ్యర్థులను గుర్తిస్తారు. ఈ టెస్టులో మొదటి రోజు స్క్రీనింగ్ టెస్టు ఉంటుంది. ఇదే స్టేజ్-1 టెస్ట్. ఈ దశలో అర్హత సాధిస్తే స్టేజ్-2కు అనుమతిస్తారు.
- స్టేజ్-1లో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ (ఓఐఆర్) టెస్ట్‌లు ఉంటాయి. స్టేజ్-2లో సైకాలజీ టెస్ట్‌లు, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్కులు, ఇంటర్వ్యూలు, కాన్ఫరెన్సులు ఉంటాయి. వీటిని నాలుగు రోజుల పాటు నిర్వహిస్తారు.
- ఆ తర్వాత వర్డ్ అసోసియేషన్ టెస్ట్(డబ్ల్యూఏటీ), సిట్యువేషన్ రియాక్షన్ టెస్ట్ (ఎస్ఆర్‌టీ)ల ద్వారా విద్యార్థుల సమయస్ఫూర్తిని పరీక్షిస్తారు. తుదిగా సెల్ఫ్ డిస్క్రిప్షన్ టెస్ట్(ఎస్‌డీ)లో అభ్యర్థి తన కుటుంబం, స్నేహితులు, కాలేజీ, ఉపాధ్యాయుల గురించి రాయాలి. ఈ టెస్టుల అనంతరం రెండు రోజుల పాటు 9 రకాల గ్రూప్ టాస్కులు ఉంటాయి.
- వీటన్నింటి తర్వాత బోర్డ్ ప్రెసిడెంట్ లేదా సీనియర్ సభ్యుడు ఇంటర్వ్యూ తీసుకుంటారు. తుదిగా కాన్ఫరెన్స్ ఉంటుంది. ప్యానెల్ ముందు విద్యార్థులు వేర్వేరుగా హాజరవ్వాలి. ఫ్లయింగ్ బ్రాంచ్ వారికి పీఏబీటీ ఉంటుంది. ఫైనల్‌గా రికమెండ్ చేసిన విద్యార్థులకు శారీరక, వైద్య పరీక్షలు నిర్వహించి.. రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ టెస్టుల్లో ప్రతిభ ఆధారంగా తుది మెరిట్ లిస్టు విడుదల చేస్తారు.

### రాత పరీక్ష.. సన్నద్ధత

- రాత పరీక్షను ఇంగ్లిష్/హిందీ మాధ్యమాల్లో ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు.

ఇండియన్ మిలటరీ, నేవల్, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ కోర్సుల ప్రవేశ పరీక్ష స్వరూపం..

| సబ్జెక్ట్ | వ్యవధి | మార్కులు |
|---|---|---|
| ఇంగ్లిష్ | 2 గంటలు | 100 |
| జనరల్ నాలెడ్జ్ | 2 గంటలు | 100 |
| ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ | 2 గంటలు | 100 |

**ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ**

| సబ్జెక్ట్ | వ్యవధి | మార్కులు |
|---|---|---|
| ఇంగ్లిష్ | 2 గంటలు | 100 |
| జనరల్ నాలెడ్జ్ | 2 గంటలు | 100 |

- ప్రశ్నల క్లిష్టత ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్ పేపర్లకు డిగ్రీ స్థాయిలో; ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్‌కు పదో తరగతి స్థాయిలో ఉంటుంది.

### ఇంగ్లిష్

అభ్యర్థుల ఇంగ్లిష్ పరిజ్ఞానాన్ని పరీక్షించడానికి ఉద్దేశించిన విభాగం ఇది. 100 మార్కులకు 120 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో ఇంగ్లిష్‌ను అర్థం చేసుకునే నైపుణ్యాలను పరీక్షించేలా ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్‌లో యాంటోనిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్, ఆర్డరింగ్ ఆఫ్ సెంటెన్సెస్, సెంటెన్సెస్‌లో పదాల ఆర్డరింగ్, ప్యాసేజ్‌లు, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్స్, ఇడియమ్స్, ఫ్రేజెసెస్, క్లోజ్ టెస్టు, ఫిల్ అప్స్, అనాలజీస్ సెక్షన్ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, స్పాటింగ్ ఎర్రర్స్ విభాగాల్లో మార్కులు సాధించేందుకు గ్రామర్ రూల్స్ తెలుసుకోవాలి. అలాగే ఇడియమ్స్ అండ్ ఫ్రేజెసెస్ కోసం సాధ్యమైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.

### జనరల్ నాలెడ్జ్

ఈ సెక్షన్‌లో 120 ప్రశ్నలకు 100 మార్కులు కేటాయించారు. ఇందులో కరెంట్ అఫైర్స్, జాగ్రఫీ, హిస్టరీ, ఇండియన్ పాలిటీ, ఎకనామిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ తదితర అన్ని సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. డిఫెన్స్‌కు సంబంధించిన ప్రధాన కార్యాలయాలు, ప్రాముఖ్యం ఉన్న అంశాలు, అవార్డులు, జాయింట్ మిలిటరీ ఎక్సర్‌సైజెస్-అందులో పాల్గొన్న దేశాలు, ఆయా ఉమ్మడి సైనిక విన్యాసాల పేర్లు మొదలైన వాటిని తెలుసుకోవడం మేలు. కరెంట్ అఫైర్స్ నుంచి ఎక్కువగా ప్రశ్నలు అడుగుతున్నారు.

### ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్

ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీకి మినహా మిగతా పోస్టులకు మ్యాథమెటిక్స్ విభాగం ఉంటుంది. 100 ప్రశ్నలతో ఒక్కోదానికి ఒక్కో మార్కు చొప్పున ఉండే విభాగం ఇది. పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. టైమ్ అండ్ డిస్టెన్స్, స్టాటిస్టిక్స్ అండ్ ప్రాబబిలిటీ, వాల్యూమ్ అండ్ సర్ఫేస్ ఏరియా, లీనియర్ అండ్ క్వాడ్రటిక్ ఈక్వేషన్స్, ట్రిగనామెట్రీ, ఫ్యాక్టరైజేషన్ తదితర చాప్టర్ల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. పదో తరగతి స్థాయి పుస్తకాలు ఒకటికి నాలుగుసార్లు చదవడం ద్వారా సన్నద్ధత లభిస్తుంది.

**ముఖ్య తేదీలు:**

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 8, 2019.
- **రాత పరీక్ష తేదీ:** సెప్టెంబర్ 8, 2019.
- **వెబ్‌సైట్:** https://upsconline.nic.in

### ఉద్యోగ సమాచారం

**హాల్‌లో 13 ఖాళీలు**

కేంద్ర ప్రభుత్వరంగ నవరత్న సంస్థ అయిన కోరాపుట్ (ఒడిశా)లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)..13 మెడికల్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. **మెడికల్ సూపరింటెండెంట్/సీనియర్ మెడికల్ ఆఫీసర్-3.**
   - **విభాగాలు:** జనరల్ మెడిసిన్, పాథాలజీ, ఆర్థోపెడిక్స్.
2. **జనరల్ డ్యూటీ-10.**

- **అర్హత:** ఎంబీబీఎస్, సంబంధిత విభాగంలో పీజీ/పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, మే 31 నాటికి జనరల్ డ్యూటీ పోస్టులకు 35 ఏళ్లు; మిగిలిన వాటికి 45 ఏళ్లు మించకూడదు. ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; పీహెచ్‌సీలకు పదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** దరఖాస్తును వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఆఫ్‌లైన్ (పోస్టు ద్వారా)లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500 (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు ఫీజు లేదు).
- **హార్డ్ కాపీలను పంపడానికి చివరితేదీ:** జూలై 10, 2019.
- **వెబ్‌సైట్:** https://hal-india.co.in

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో...
బ్యాంక్ పీవో, క్లరికల్ పరీక్షల మెటీరియల్
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

**2** ప్రపంచకప్ మ్యాచ్‌లో అర్ధ సెంచరీ చేయడంతోపాటు ఐదు వికెట్లు తీసిన రెండో స్పిన్నర్‌గా షకీబ్ అల్ హసన్ గుర్తింపు పొందాడు. 2011 ప్రపంచ కప్‌లో ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ (5/31; 50 నాటౌట్) ఈ ఘనత సాధించాడు.

**1** ఈ ప్రపంచకప్‌లో షకీబ్ ఆరు మ్యాచ్‌లు ఆడి 476 పరుగులు చేసి, 10 వికెట్లు తీశాడు. ఒకే ప్రపంచకప్‌లో 400 కంటే ఎక్కువ పరుగులు చేయడంతోపాటు పది వికెట్లు కూడా తీసిన తొలి ప్లేయర్‌గా షకీబ్ గుర్తింపు పొందాడు.


రామ్‌కుమార్


సాకేత్

# రామ్‌కుమార్ శుభారంభం

## పోరాడి ఓడిన సాకేత్ ● వింబుల్డన్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్

**లండన్:** ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు లభించాయి. పురుషుల సింగిల్స్ విభాగంలో రామ్‌కుమార్ రామనాథన్ శుభారంభం చేయగా... సాకేత్ మైనేని పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. సోమవారం మొదలైన ఈ టోర్నమెంట్‌లో తొలి రౌండ్ మ్యాచ్‌లో రామ్‌కుమార్ 6–3, 6–2తో లుకాస్ లాకో (స్లొవేకియా)పై గెలుపొందగా... ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ 4–6, 6–4, 5–7తో గిలెర్మో లోపెజ్ (స్పెయిన్) చేతిలో ఓడాడు. లాకోతో జరిగిన మ్యాచ్‌లో రామ్ తొమ్మిది ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. 24 విన్నర్లు కొట్టిన ఈ చెన్నై ప్లేయర్ కేవలం పది అనవసర తప్పిదాలు చేశాడు. లోపెజ్‌తో జరిగిన మ్యాచ్‌లో సాకేత్ 15 ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. 43 విన్నర్స్ కొట్టిన సాకేత్ 29 అనవసర తప్పిదాలు చేశాడు. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు.

## ప్రిక్వార్టర్స్‌లో ప్రజ్నేశ్



**న్యూఢిల్లీ:** అంటాల్యా ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. టర్కీలో సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 94వ ర్యాంకర్ ప్రజ్నేశ్ 6–0, 7–6 (8/6)తో యాంకో టిప్సరెవిచ్ (సెర్బియా)పై విజయం సాధించాడు. ఒకప్పుడు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఎనిమిదో స్థానంలో ఉన్న టిప్సరెవిచ్ తొలి సెట్‌లో ఒక్క గేమ్ కూడా గెలవలేకపోయాడు. 77 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రజ్నేశ్ ఎనిమిది ఏస్‌లు సంధించాడు.

## నయా నం.1 బార్టీ



**సిడ్నీ:** తాజాగా ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలిచి సంచలనం సృష్టించిన ఆస్ట్రేలియా క్రీడాకారిణి యాష్లే బార్టీ మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) ర్యాంకింగ్స్‌లోనూ నంబర్‌వన్ స్థానాన్ని సంపాదించి చరిత్ర సృష్టించింది. సోమవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో ఆమె అగ్రస్థానంలో నిలిచింది. 43 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియా తరపున ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్న రెండో మహిళగా ఆమె రికార్డులకెక్కింది. 1976లో ఆసీస్ ప్లేయర్ ఇవాన్ గూలగాంగ్ కాలే అగ్రస్థానంలో నిలిచింది.

## అదిరిన భారత బాక్సర్ల పంచ్

### బ్లాక్ ఫారెస్ట్ కప్‌లో ఏడు పతకాలు




**న్యూఢిల్లీ:** ఈ ఏడాది అంతర్జాతీయస్థాయిలో భారత బాక్సర్ల నిలకడైన ప్రదర్శన కొనసాగుతోంది. తాజాగా జర్మనీలో జరిగిన బ్లాక్ ఫారెస్ట్ కప్ టోర్నమెంట్‌లో భారత జూనియర్ మహిళా బాక్సర్లు పతకాల పంట పండించారు. మొత్తం ఏడు పతకాలు గెల్చుకొని టోర్నమెంట్‌లో ఉత్తమ జట్టు అవార్డును సొంతం చేసుకున్నారు. భారత్ నెగ్గిన ఏడు పతకాల్లో ఐదు స్వర్ణాలు, రెండు రజతాలు ఉన్నాయి. ఉక్రెయిన్, జర్మనీ, కజకిస్తాన్, లాత్వియా, హంగేరి, లిథువేనియా, మంగోలియా, గ్రీస్, పోలాండ్ దేశాలు కూడా పాల్గొన్న ఈ టోర్నీలో భారత్ తరపున 13 మంది బాక్సర్లు బరిలోకి దిగారు. భారత్ తరపున తమన్నా (48 కేజీలు), అంజు (50 కేజీలు), నేహా (54 కేజీలు), అంబేషోరి దేవి (57 కేజీలు), ప్రీతి దహియా (60 కేజీలు) స్వర్ణ పతకాలను సాధించారు. ఫైనల్లో ఓడిన తన్ను (52 కేజీలు), ఆశ్రేయ (63 కేజీలు) రజత పతకాలతో సరిపెట్టుకున్నారు.

# బంగ్లా పైపైకి...

భళారే బంగ్లా! షకీబ్ ఆల్‌రౌండ్ షోతో ఈ ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ మాజీ చాంపియన్లను మించిపోయింది. సఫారీ కంటే ఎన్నో రెట్లు ముందుంది. ఆడుతున్న పది జట్లలో సగం జట్లను కిందికి దించేసింది. టోర్నీ ఆరంభం నుంచి సెమీస్ రేసులో ఉన్న న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, భారత్, ఇంగ్లండ్ తర్వాతి స్థానం ఇప్పుడు బంగ్లాదేశ్‌దే కావడం విశేషం. పాయింట్ల పట్టికలో బంగ్లా తర్వాతే మాజీ చాంపియన్లు శ్రీలంక, పాక్, వెస్టిండీస్‌లు కొనసాగుతున్నాయి.

- షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అర్ధ సెంచరీ, ఐదు వికెట్లు
- రాణించిన ముష్ఫికర్
- గెలిచి నిలిచిన బంగ్లాదేశ్
- అఫ్గానిస్తాన్‌కు ఏడో ఓటమి

**సౌతాంప్టన్:** మెగా ఈవెంట్‌లో షకీబ్ అల్ హసన్ మళ్లీ చెలరేగాడు. బ్యాట్‌తో, బంతితో అఫ్గానిస్తాన్ పని పట్టాడు. దీంతో బంగ్లాదేశ్ 62 పరుగుల తేడాతో అఫ్గానిస్తాన్‌పై విజయం సాధించింది. టోర్నీలో మూడో విజయంతో మొర్తజా బృందం టాప్–5లోకి వచ్చి సెమీస్ రేసులో నిలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 262 పరుగులు చేసింది. ముష్ఫికర్ రహీమ్ (87 బంతుల్లో 83; 4 ఫోర్లు, 1 సిక్స్), షకీబ్ అల్ హసన్ (69 బంతుల్లో 51; 1 ఫోర్) రాణించారు. అఫ్గాన్ బౌలర్లలో ముజీబుర్ రహ్మాన్ 3, గుల్బదిన్ నైబ్ 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన అఫ్గానిస్తాన్ 47 ఓవర్లలో 200 పరుగుల వద్ద ఆలౌటైంది. సమీవుల్లా షిన్వారి (51 బంతుల్లో 49 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), గుల్బదిన్ నైబ్ (75 బంతుల్లో 47; 3 ఫోర్లు) అఫ్గాన్ పరువు నిలిపారు. అర్ధ సెంచరీతోపాటు స్పిన్‌తో తిప్పేసిన షకీబ్ (5/29)కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

**షకీబ్ మరో ఫిఫ్టీ...**

టాస్ నెగ్గిన అఫ్గానిస్తాన్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో ముందుగా బ్యాటింగ్ చేపట్టిన బంగ్లాకు ఓపెనర్లు లిటన్ దాస్ (16), తమీమ్ ఇక్బాల్ (53 బంతుల్లో 36; 4 ఫోర్లు) శుభారంభం ఇవ్వలేకపోయారు. జట్టు స్కోరు 23 పరుగుల వద్ద దాస్ ఔట్ కావడంతో తమీమ్‌కు సూపర్ ఫామ్‌లో ఉన్న షకీబ్ జతయ్యాడు. ఇద్దరు నిలదొక్కుకోవడంతో పరుగుల వేగం క్రమంగా పెరిగింది. ఈ దశలో తమీమ్‌ను నబీ క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో రెండో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తమీమ్ నిష్క్రమణతో క్రీజులోకి వచ్చిన ముష్ఫికర్ రహీమ్, షకీబ్‌తో కలిసి బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 21వ ఓవర్లో జట్టు స్కోరు వందకు చేరింది. ఇద్దరు సమన్వయంతో ఆడటంతో అఫ్గాన్ బౌలర్లకు కష్టాలు తప్పలేదు. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న షకీబ్ 66 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. ఈ టోర్నీలో అతనికి ఇది మూడో అర్ధసెంచరీ.

**మెరిసిన ముష్ఫికర్...**

అర్ధసెంచరీ కాగానే బంగ్లా జట్టు స్కోరు 143 పరుగుల వద్ద షకీబ్... ముజీబ్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. షకీబ్, ముష్ఫికర్ మూడో వికెట్‌కు 61 పరుగులు జతచేశారు. తర్వాత సౌమ్య సర్కార్ (3) ఎక్కువసేపు క్రీజులో నిలువలేదు. దీంతో మహ్మదుల్లా (38 బంతుల్లో 27; 2 ఫోర్లు) అండతో ముష్ఫికర్ 56 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. బౌండరీలు బాదక పోయిన పరుగులను మాత్రం వేగంగా జత చేశాడు. 41వ ఓవర్లో బంగ్లా 200 పరుగులు చేసింది. మహ్మదుల్లాను నైబ్ ఔట్ చేయడంతో ముష్ఫికర్‌కు మొసద్దిక్ హొస్సేన్ జతయ్యాడు. ఇద్దరు స్కోరు వేగం పెంచేందుకు శ్రమించారు. పోరాడే లక్ష్యాన్ని అందించి ఆఖరి ఓవర్లలో నిష్క్రమించారు.

**షకీబ్ మళ్లీ బంతితో...**

తన బ్యాటింగ్‌తో రెండు విలువైన భాగస్వామ్యాలు జోడించిన షకీబ్ అల్ హసన్ బంతితోనూ చెలరేగాడు. స్పిన్ బౌలింగ్‌తో అఫ్గాన్ ఆరంభానికి తూట్లు పొడిచాడు. లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ పది ఓవర్లదాకా వికెట్ చేజార్చుకోకుండా 48 పరుగులు చేసింది. ఓపెనర్లు గుల్బదిన్ నైబ్, రహ్మత్ షా క్రీజులో పాతుకుపోతున్న దశలో షకీబ్ దెబ్బతీశాడు. తొలి ఓవర్లోనే (ఇన్నింగ్స్ 11వ) రహ్మత్ షా (35 బంతుల్లో 24; 3 ఫోర్లు) వికెట్‌ను పడగొట్టాడు. తర్వాత వచ్చిన హష్మతుల్లా షాహిది (11) మొసద్దిక్ బౌలింగ్‌లో స్టంపౌటయ్యాడు. అస్గర్ (38 బంతుల్లో 20; 1 ఫోర్) అండతో కెప్టెన్ నైబ్ జట్టు స్కోరును వంద పరుగులు దాటించాడు. అర్ధసెంచరీ దిశగా సాగుతున్న నైబ్‌నూ, హార్డ్ హిట్టర్ నబీ (0)ని ఒకే ఓవర్లో షకీబ్ పెవిలియన్ చేర్చడంతో అఫ్గాన్ కష్టాల్లో పడింది. కాసేపటి తర్వాత అస్గర్‌ను షకీబే ఔట్ చేయడంతో 117 పరుగుల వద్ద ఐదో వికెట్‌ను కోల్పోయింది. స్వల్ప వ్యవధిలోనే ఇక్రమ్ రనౌట్ కావడంతో అఫ్గాన్ లక్ష్యానికి దూరమైంది. మిడిలార్డర్ బ్యాట్స్‌మన్ సమీవుల్లా ఆఖరి దాకా పోరాడాడు. అతనికి నజీబుల్లా జద్రాన్ (23) కాసేపు అండగా నిలిచినా షకీబ్ స్పిన్‌కు తలవంచాడు. సమీవుల్లా అజేయంగా నిలిచినా టెయిలెండర్లు రషీద్ ఖాన్ (2), దౌలత్ జద్రాన్ (0), ముజీబ్ (0)లను ఔట్ చేయడంతో అఫ్గాన్ 200 పరుగులకే ఆలౌటైంది.


షకీబ్, ముష్ఫికర్ సంబరం

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా |
|---|---|---|---|---|---|---|
| న్యూజిలాండ్ | 6 | 5 | 0 | 1 | 1.306 | 11 |
| ఆస్ట్రేలియా | 6 | 5 | 1 | 0 | 0.849 | 10 |
| భారత్ | 5 | 4 | 0 | 1 | 0.809 | 9 |
| ఇంగ్లండ్ | 6 | 4 | 2 | 0 | 1.457 | 8 |
| బంగ్లాదేశ్ | 7 | 3 | 3 | 1 | -0.133 | 7 |
| శ్రీలంక | 6 | 2 | 2 | 2 | -1.119 | 6 |
| పాకిస్తాన్ | 6 | 2 | 3 | 1 | -1.265 | 5 |
| వెస్టిండీస్ | 6 | 1 | 4 | 1 | 0.190 | 3 |
| దక్షిణాఫ్రికా | 7 | 1 | 5 | 1 | -0.324 | 3 |
| అఫ్గానిస్తాన్ | 7 | 0 | 7 | 0 | -1.634 | 0 |

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, ర–రద్దు, నె.ర.రే–నెట్ రన్‌రేట్, పా–పాయింట్లు

### స్కోరు వివరాలు

**బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** లిటన్ దాస్ (సి) హష్మతుల్లా (బి) ముజీబ్ 16; తమీమ్ (బి) నబీ 36; షకీబ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 51; ముష్ఫికర్ (సి) నబీ (బి) దౌలత్ 83; సౌమ్య సర్కార్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 3; మహ్మదుల్లా (సి) నబీ (బి) గుల్బదిన్ 27; మొసద్దిక్ (బి) గుల్బదిన్ 35; సైఫుద్దీన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 262.**
**వికెట్ల పతనం:** 1–23, 2–82, 3–143, 4–151, 5–207, 6–251, 7–262. **బౌలింగ్:** ముజీబ్ 10–0–39–3, దౌలత్ 9–0–64–1, నబీ 10–0–44–1, గుల్బదిన్ 10–1–56–2, రషీద్ ఖాన్ 10–0–52–0, రహ్మత్ షా 1–0–7–0.

**అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్:** గుల్బదిన్ నైబ్ (సి) లిటన్ దాస్ (బి) షకీబ్ 47; రహ్మత్ షా (సి) తమీమ్ (బి) షకీబ్ 24; హష్మతుల్లా (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మొసద్దిక్ 11; అస్గర్ అఫ్గాన్ (సి) సబ్ (షబ్బీర్ రహమాన్) (బి) షకీబ్ 20; నబీ (బి) షకీబ్ 0; సమీవుల్లా (నాటౌట్) 49; ఇక్రమ్ (రనౌట్) 11; నజీబుల్లా జద్రాన్ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) షకీబ్ 23; రషీద్ ఖాన్ (సి) మొర్తజా (బి) ముస్తఫిజుర్ 2; దౌలత్ జద్రాన్ (సి) ముష్ఫికర్ (బి) ముస్తఫిజుర్ 0; ముజీబ్ (బి) సైఫుద్దీన్ 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (47 ఓవర్లలో ఆలౌట్) 200.**
**వికెట్ల పతనం:** 1–49, 2–79, 3–104, 4–104, 5–117, 6–132, 7–188, 8–191, 9–195, 10–200. **బౌలింగ్:** మష్రఫె మొర్తజా 7–0–37–0, ముస్తఫిజుర్ 8–1–32–2, సైఫుద్దీన్ 8–0–33–1, షకీబ్ 10–1–29–5, మెహదీ హసన్ మిరాజ్ 8–0–37–0, మొసద్దిక్ 6–0–25–1.

# సమఉజ్జీల సమరం


మోర్గాన్

- నేడు ఆస్ట్రేలియాతో ఇంగ్లండ్ 'ఢీ'
- శ్రీలంకపై ఓటమితో డీలా పడ్డ ఆతిథ్య జట్టు
- సెమీస్ బెర్త్‌పై ఫించ్ బృందం దృష్టి

**మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం**

**లార్డ్స్:** క్రికెట్ మక్కాగా పిలవబడే లార్డ్స్ మైదానం సమఉజ్జీల సమరానికి వేదిక కానుంది. ప్రపంచ కప్‌లో భాగంగా నేడు డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు తలపడనుంది. ఇంగ్లండ్‌పై గెలిచి సెమీస్ బెర్త్‌ను సొంతం చేసుకోవాలని ఆసీస్.. శ్రీలంక చేతిలో ఎదురైన అనూహ్య పరాజయాన్ని మర్చిపోయి మళ్లీ విజయాల బాట పట్టాలని ఇంగ్లండ్ భావిస్తున్నాయి. 1992 తర్వాత ప్రపంచ కప్ వేదికపై ఆస్ట్రేలియాను ఇంగ్లండ్ ఇప్పటి వరకు ఓడించలేదు. గత రికార్డులతో సంబంధం లేకుండా ఈ మ్యాచ్‌లో పూర్తి విశ్వాసంతో బరిలోకి దిగి విజయం సాధించాలనే లక్ష్యంతో మోర్గాన్ బృందం ఉంది. ఏదేమైనా రెండు జట్లలో భారీ హిట్టర్లు ఉండటంతో నేటి మ్యాచ్ ప్రేక్షకులను కనువిందు చేయడం ఖాయం.

**ఓపెనర్ల బెంగ..**

ఇంగ్లండ్ స్టార్ ఓపెనర్ జేసన్ రాయ్ తొడ కండరాల గాయంతో దూరమైనప్పటి నుంచి ఇంగ్లండ్‌కు ఓపెనింగ్ బెంగ మొదలైంది. రాయ్ స్థానంలో వచ్చిన విన్స్ గత రెండు మ్యాచ్‌లలోనూ చెప్పుకోదగ్గ ప్రదర్శన ఇవ్వలేదు. అయితే సోమవారం చేసిన స్కానింగ్‌లో రాయ్ గాయం తగ్గిందని నిర్ధారణ అయింది. అదే విధంగా రాయ్ సోమవారం నెట్స్‌లో సాధన కూడా చేశాడు. ఆసీస్‌పై 47.43 సగటుతో 759 పరుగులు చేసిన ఈ ఓపెనర్‌కు మంచి రికార్డుంది. నేటి మ్యాచ్‌లో రాయ్ బరిలోకి దిగితే ఇంగ్లండ్ ఓపెనింగ్ కష్టాలు తీరినట్టే.

**గెలుపు తప్పనిసరి...**

శ్రీలంక చేతిలో ఓడిపోవడంతో టైటిల్ ఫేవరెట్‌గా బరిలో దిగిన ఇంగ్లండ్ సెమీఫైనల్ చేరే సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. శ్రీలంకపై బెన్ స్టోక్స్ ఒంటరి పోరాటం చేసినా ఇతర సభ్యుల నుంచి సహకారం లభించక పోవడంతో జట్టుకు విజయాన్ని అందించలేక పోయాడు. ప్రస్తుతం 8 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్న ఇంగ్లండ్ సెమీస్ చేరాలంటే మిగిలిన మూడు మ్యాచ్‌లలో కనీసం రెండింటిని గెలవాల్సిన పరిస్థితి. ఒక మ్యాచ్ గెలిచినా వెళ్తుంది కానీ అప్పుడు శ్రీలంక, బంగ్లాదేశ్‌ల ఫలితాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఈ ప్రపంచ నంబర్‌వన్ జట్టుకు ఏర్పడుతుంది. అయితే ఇంగ్లండ్ తమ తదుపరి మ్యాచ్‌లను పటిష్టమైన ఆస్ట్రేలియా, భారత్, న్యూజిలాండ్‌లతో ఆడాలి. ఇటువంటి పరిస్థితిల్లో నేడు జరిగే ఆస్ట్రేలియా చేతిలో ఓడితే ఇంగ్లండ్ పరిస్థితి క్లిష్టంగా మారుతుంది. అదే విధంగా స్లో వికెట్లపై తడబడుతుండటం మోర్గాన్ సేనకు ప్రతికూలాంశం.

**ముఖాముఖి రికార్డు**

ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఇప్పటివరకు 147 వన్డేలు జరిగాయి. ఇంగ్లండ్ 81 మ్యాచ్‌ల్లో ఓడిపోయి, 61 మ్యాచ్‌ల్లో గెలిచింది. రెండు మ్యాచ్‌లు 'టై'కాగా... మూడు మ్యాచ్‌ల్లో ఫలితం తేలలేదు. ప్రపంచకప్‌లో ఈ రెండు జట్లు ఏడుసార్లు తలపడ్డాయి. రెండుసార్లు ఇంగ్లండ్, ఐదుసార్లు ఆస్ట్రేలియా గెలిచాయి.

**ఆత్మవిశ్వాసంతో కంగారులు...**

మరోవైపు టోర్నీలో కేవలం భారత్ చేతిలో మాత్రమే ఓడిన ఆస్ట్రేలియా పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉంది. ఓటమి అనంతరం హ్యాట్రిక్ విజయాలను నమోదు చేసిన కంగారులు పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉన్నారు. వార్నర్, ఫించ్‌లు సూపర్ ఫామ్‌లో ఉండడం, స్మిత్, ఖాజాలు నిలకడగా రాణిస్తుండడం ఆ జట్టుకు కలిసొచ్చే అంశం. చివర్లో ఫినిష్ చేయడానికి మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, క్యారీలు ఉండనే ఉన్నారు. బంగ్లాదేశ్ మ్యాచ్‌లో 381 పరుగులు చేసినా కేవలం 48 పరుగులతో గెలవడంతో బౌలింగ్‌పై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఆసీస్‌కు ఏర్పడింది. మిచెల్ స్టార్క్ (15 వికెట్లు), కమిన్స్, కూల్టర్ నైల్ రాణిస్తున్నా లెగ్ స్పిన్నర్ జంపా మాత్రం భారీగా పరుగులిస్తుండటం ఆసీస్‌ను ఇబ్బంది పెట్టే అంశం. అతని స్థానంలో నాథన్ లయన్‌కి చాన్స్ దొరికే అవకాశం ఉంది.

**పిచ్, వాతావరణం**

బ్యాటింగ్, బౌలింగ్‌కు అనుకూలించే ఈ పిచ్‌పై గత మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 308 పరుగులు చేయగా, దక్షిణాఫ్రికా 259 పరుగులు చేసింది. స్పిన్నర్లు కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. లార్డ్స్‌లో మంగళవారం వేడి వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. చిరుజల్లులు కురిసినా మ్యాచ్‌కు వర్షం ఆటంకం కాకపోవచ్చు.

## ఇంగ్లండ్ నెట్స్‌లో అర్జున్ టెండూల్కర్


అర్జున్

ఆస్ట్రేలియాతో కీలక మ్యాచ్‌కు సన్నద్ధమవుతున్న ఇంగ్లండ్‌కు భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ తనవంతు సహాయం చేశాడు. సోమవారం జరిగిన నెట్ ప్రాక్టీస్ సెషన్స్‌లో అర్జున్ ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్‌కు బౌలింగ్ చేశాడు. ఎడంచేతి ఫాస్ట్ బౌలర్ అయిన అర్జున్ ఇంగ్లండ్ స్పిన్ సలహాదారుడు సక్లాయిన్ ముస్తాక్ పర్యవేక్షణలో బౌలింగ్ చేశాడు. ఇంగ్లండ్ జట్టుకు నెట్స్‌లో బౌలింగ్ చేయడం అర్జున్‌కు కొత్తేం కాదు. ఇది వరకు 2015 యాషెస్ సందర్భంగా కూడా అర్జున్ ఇంగ్లండ్‌కు నెట్స్‌లో బౌలింగ్ చేశాడు. ఇటీవల మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ)తరపున బరిలో దిగిన 19 ఏళ్ల అర్జున్.. సర్రే సెకండ్ ఎలెవన్‌తో జరిగిన మ్యాచ్‌లో తన బౌలింగ్‌తో అదరగొట్టాడు. 11 ఓవర్లు వేసి 2 వికెట్లు తీసుకున్నాడు.

### జట్లు (అంచనా)

**ఇంగ్లండ్:** మోర్గాన్ (కెప్టెన్), బెయిర్‌స్టో, విన్స్/జేసన్ రాయ్, జో రూట్, బెన్ స్టోక్స్, బట్లర్, మొయిన్ అలీ, క్రిస్ వోక్స్, ఆదిల్ రషీద్, ఆర్చర్, ప్లంకెట్/వుడ్.

**ఆస్ట్రేలియా:** ఫించ్ (కెప్టెన్), వార్నర్, ఖాజా, స్మిత్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, అలెక్స్ క్యారీ, కూల్టర్ నైల్, కమిన్స్, స్టార్క్, జంపా/నాథన్ లయన్.


ఫించ్

సాక్షి బిజినెస్

మంగళవారం
25-6-2019

WWW.SAKSHIBUSINESS.COM


## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 72 ▼ | 24 ▼ |
| 39,123 | 11,700 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,021 | ▼ 11 |
| డోజోన్స్ | 26,750 | ▲ 30 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,417 | ▲ 9 |
| డాక్స్ | 12,275 | ▼ 65 |
| షాంఘై | 3,008 | ▲ 6 |
| నికాయ్ | 21,286 | ▲ 27 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.80 | 70.44 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 87.20 | 90.34 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.78 | 80.72 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.62 | 66.08 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.40 | 49.55 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.53 | 52.31 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.77 | 19.48 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.19 | 19.70 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.46 | 10.82 |

# వివాదాల ‘విరాళ్’... గుడ్‌బై!

## ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ విరాళ్ ఆచార్య రాజీనామా

- ఆరు నెలల ముందుగానే బాధ్యతల నుంచి విరమణ
- వ్యక్తిగత కారణాలవల్లేనని స్పష్టీకరణ
- ఉర్జిత్‌పటేల్ తర్వాత అర్ధాంతరంగా వైదొలగిన ఆర్‌బీఐ అధికారి
- కేంద్రంతో విభేదాలే కారణమని విశ్లేషకుల వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్‌గా డాక్టర్ విరాళ్ ఆచార్య రాజీనామా చేశారు. తన మూడు సంవత్సరాల పదవీకాలం ఇంకో ఆరు నెలలు ఉండగానే ఆయన తన బాధ్యతలను విరమించారు. వ్యక్తిగత కారణాలే తన రాజీనామాకు కారణమని పేర్కొన్నారు. ఇదే కారణంగా చూపుతూ ఆర్‌బీఐ గవర్నర్‌గా రాజీనామా చేసిన ఉర్జిత్‌పటేల్ తర్వాత, బ్యాంకింగ్ రెగ్యులేటర్ ఉన్నత పదవికి రాజీనామా చేసిన వ్యక్తిగా ఆచార్య ఉండడం గమనార్హం. ప్రభుత్వంతో పొసగకే ఆయన రాజీనామా చేశారన్న పుకార్లు షికారు చేయడం మరో విశేషం. బాధ్యతలు పూర్తవడానికి దాదాపు 9 నెలల ముందే వ్యక్తిగత కారణాలతో అప్పటి ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ రాజీనామా చేసినప్పుడూ, ఇదే విధమైన విశ్లేషణలు రావడం గమనార్హం. కాగా, ఉర్జిత్ పటేల్ రాజీనామా నాటినుంచే విరాళ్ ఆచార్య కూడా అదే బాటన పయనిస్తారన్న వార్తలు కొనసాగాయి. 45 సంవత్సరాల విరాళ్ ఆచార్య, ఆర్‌బీఐ గవర్నర్లలో అతి చిన్నవారు. మోదీ ప్రభుత్వం రెండవ దఫా అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యున్నత స్థాయిలో జరిగిన తొలి రాజీనామా ఇది కావడం మరో విశేషం.

### ఆర్‌బీఐ ప్రకటన ఏమి చెప్పిందంటే..

ఆర్‌బీఐ సోమవారంనాడు విడుదల చేసిన ప్రకటనను చూస్తే, ‘‘అనివార్యమైన వ్యక్తిగత పర్యవసానాల వల్ల తాను జూలై 23 తర్వాత ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా కొనసాగలేనని కొద్ది వారాల క్రితం డాక్టర్ విరాళ్ ఆచార్య ఒక లేఖను సమర్పించారు’’ అని ఒక క్లుప్తమైన ప్రకటన వెలువడింది. డాక్టర్ ఆచార్య రాజీనామాతో నూతన నియామకం జరిగేంతవరకూ డిప్యూటీ గవర్నర్లుగా ఇక ముగ్గురు – ఎన్‌ఎస్ విశ్వనాథన్, బీపీ కనుంగో, ఎంకే జైన్‌లు ఉంటారు.

### కేంద్రం ఏరికోరి...

ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని క్యాబినెట్ కమిటీ విరాళ్ ఆచార్యను ఆర్‌బీఐ డిప్యూటీ గరవ్నర్‌గా 2016 డిసెంబర్‌లో నియమించింది. 2017 జనవరిలో ఆయన మూడేళ్ల తన బాధ్యతలను చేపట్టారు. అప్పట్లో ఆయన న్యూయార్క్ యూనివర్సిటీలో ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ఎకనమిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. పెద్ద నోట్ల రద్దు, డిపాజిట్లు, విత్‌డ్రాయెల్స్‌కు సంబంధించి నిబంధనలనూ తరచూ మార్చుతూ ఆర్‌బీఐ తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న సమయంలో ఆయన డిప్యూటీ గవర్నర్ బాధ్యతలను చేపట్టారు. ద్రవ్యఅంశాల విభాగాన్ని ఆయన ఆర్‌బీఐలో పర్యవేక్షించారు. రాజీనామా అనంతరం విరాళ్ ఆచార్య ఏమిచేస్తారన్న అంశంపై ఇంకా స్పష్టత రానున్నప్పటికీ, ఆయన తిరిగి ప్రొఫెసర్‌గానే వెళ్తారన్న అంచనాలు వెలువడుతున్నాయి.

### పాలసీపై విభేదాలు?

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా ఆయన గవర్నర్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల పరపతి సమీక్షా కమిటీ (ఎంపీసీ) సభ్యునిగా కూడా ఉన్నారు. జూన్‌లో ఆర్‌బీఐ పాలసీ సమీక్ష సందర్భంగా గవర్నర్ శక్తికాంత్‌దాస్ అభిప్రాయాలతో విరాళ్ ఆచార్య కొంత విభేదించినట్లు సంబంధిత మినిట్స్ చూస్తే అర్థమవుతుంది. ముఖ్యంగా ప్రభుత్వం ఆదాయ–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటుపై ఆయన తాజా పాలసీ సమీక్షలో ఆందోళన వెలిబుచ్చారు. గడచిన ఐదు బడ్జెట్‌లలో మూడుసార్లు ద్రవ్యలోటు కట్టుతప్పిన విషయాన్ని ప్రస్తావించారు. 2013 నుంచీ ఇటు కేంద్రం, అటు రాష్ట్రాల ద్రవ్యలోటు పరిస్థితి దిగజారుతూ వస్తున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

### రాకేష్ మోహన్ తరువాత...

‘ఫారిన్ ట్రైన్డ్’ ఎకనమిస్ట్‌గా రిజర్వ్ బ్యాంక్‌లో పనిచేసి బాధ్యత కాలం పూర్తికాకుండానే తప్పుకున్న రెండో డిప్యూటీ గవర్నర్ విరాళ్ ఆచార్య. ఇంతక్రితం 2009 మే నెలలో అప్పటి డిప్యూటీ గవర్నర్ రాకేష్ మోహన్ తన బాధ్యతలకు ముందుగానే రాజీనామా చేశారు. అప్పట్లో జూలై 23తో ఆయన పదవీకాలం పూర్తికావాల్సి ఉంది.

### జలాన్ కమిటీ నివేదిక నేపథ్యం...

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వద్ద ఉన్న రూ.9.6 లక్షల కోట్ల అదనపు నిధుల్లో కొంత మొత్తాన్ని కేంద్రానికి బదలాయించాలన్న విషయమై ఆర్‌బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నేతృత్వంలో ఏర్పాటయిన ఆరుగురు సభ్యుల కమిటీ తన నివేదికను మరో నెల రోజుల్లో సమర్పించనున్న నేపథ్యంలో విరాళ్ రాజీనామా మరో విశేషం. నిజానికి జూన్ చివరికల్లా కమిటీ నివేదిక సమర్పించాల్సి ఉన్నా, అది అసాధ్యమని వార్తలు వస్తున్నాయి. పలు అంశాలపై విభిన్న అభిప్రాయాలు ఉండడమే దీనికి కారణంగా తెలుస్తోంది.

### వివాదాల్లో...

స్వతంత్ర నిర్ణయాలు, ఆలోచనలు కలిగిన ఆర్థికవేత్తగా విరాళ్ ఆచార్య పేరుంది. ఇది ఆయనను పలు దఫాలు వివాదాల్లోకి నెట్టింది. పలు సందర్భాల్లో ఆయన ప్రత్యక్షంగా కేంద్రంపై, ఆర్థిక మంత్రిత్వ శాఖపై తన నిరసన గళం వినిపించారు. ప్రత్యేకించి సెంట్రల్ బ్యాంక్ స్వయం ప్రతిపత్తి పరిరక్షణకు సంబంధించి ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనం సృషించాయి. అందులో కొన్ని అంశాలు చూస్తే...



- గత ఏడాది అక్టోబర్‌లో ఆయన ఏడీ షరోఫ్ స్మారకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్ణయ రూపకల్పన దీర్ఘకాలం దృష్టితో కాకుండా, స్వల్పకాల ప్రయోజనాలు, రాజకీయ దురుద్దేశాలతో కూడుకుని ఉంటోందని పేర్కొన్నారు. పలు అంశాలపై ప్రభుత్వం–ఆర్‌బీఐ మధ్య ఉన్న విభేదాలను కూడా ఆయన ఈ ప్రసంగంలో పేర్కొన్నారు.
- మరో సందర్భంలో ఆయన మాట్లాడుతూ, ఆర్‌బీఐ స్వయం ప్రతిపత్తిని తక్కువచేస్తే, అది క్యాపిటల్ మార్కెట్లలో విశ్వాస సంక్షోభాన్ని తీసుకువస్తుందని అన్నారు. అలాగే సెంట్రల్‌బ్యాంక్ సమర్థతపైనా ఆయా అంశాల ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.
- మొండిబకాయిలకు సంబంధించి కొన్ని బ్యాంకులపై ప్రయోగించిన ‘దిద్దుబాటు చర్యల ప్రక్రియ’ (పీసీఏ)ను కూడా ఆయన పలు సందర్భాల్లో గట్టిగా సమర్థించారు.

# ‘నో బ్యాక్ డోర్’ డీల్‌కు రెడీ: హువావే

- ఇతర ఓఈఎంలు ముందుకు రావాలని పిలుపు
- భారత్‌లో మరిన్ని పెట్టుబడులకు సిద్ధమని ప్రకటన





**న్యూఢిల్లీ:** భారత ప్రభుత్వంతో ‘నో బ్యాక్ డోర్’ ఒప్పందానికి తాము సిద్ధంగా ఉన్నామని చైనాకు చెందిన టెలికం ఎక్విప్‌మెంట్ తయారీ దిగ్గజం హువావే ప్రకటించింది. అలాగే, ఇతర కంపెనీలు కూడా దీన్ని అనుసరించాలని సూచించింది. గూఢచర్యాన్ని నిరుత్సాహపరిచేందుకు ఈ ప్రతిపాదన చేసింది. అమెరికా ప్రభుత్వం హువావే హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సరఫరాలపై నిషేధం విధించిన నేపథ్యంలో మన దేశంలోనూ ఈ సంస్థ వ్యాపార కార్యకలాపాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. ‘‘నో బ్యాక్ డోర్ అనే ఒప్పందం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని భారత ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నాం. ఇతర ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులు (ఓఈఎం) సైతం ఈ తరహా ఒప్పందాన్ని ప్రభుత్వంతో, టెలికం ఆపరేటర్లతో చేసుకుంటే ప్రోత్సహిస్తాం’’ అని హువావే ఇండియా సీఈవో జేచెన్ తెలియజేశారు. టెక్నాలజీ ఉత్పత్తుల్లో బ్యాక్ డోర్ అంటే... ప్రభుత్వంతోనో లేదా మరో పక్షంతోనో కస్టమర్ల డేటాను అనధికారిక విధానంలో, హాని తలపెట్టే ఉద్దేశంతో పంచుకోవడంగా చెబుతారు. టెలికం ఆపరేటర్లు హానికారక సాఫ్ట్‌వేర్‌లు లేదా బగ్‌ల నుంచి రక్షణ కోసం సరిపై చేసిన ఎక్విప్‌మెంట్‌లు, పరికరాలనే వినియోగించాలని టెలికం శాఖ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. చట్టాన్ని ఉల్లంఘిస్తే భారీ జరిమానాలను కూడా ప్రతిపాదించింది. అమెరికా నిషేధం తమపై పెద్దగా ప్రభావం చూపలేదని, అమెరికా కాకుండా ఇతర దేశాల నుంచి విడిభాగాలను సమకూర్చుకోవడాన్ని ప్రారంభించామని తెలిపారు.

### స్టార్టప్‌లతో కలిసి పనిచేస్తాం..

2011లో విడుదల చేసిన భద్రతా నిబంధనలు కేవలం 4జీ నెట్‌వర్క్‌కు ఉద్దేశించినవని, వీటిని 5జీ నెట్‌వర్క్‌లకూ అప్‌గ్రేడ్ చేయాలని జేచెన్ సూచించారు. 5జీ సేవలపై పరీక్షలకు వొడాఫోన్ ఐడియాతో హువావే జట్టు కట్టగా, దీనికింకా ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంది. ‘‘భారత్‌లో కీలక పాత్ర పోషించాలనుకుంటున్నాం. భారత ప్రభుత్వం తప్పకుండా పరీక్షల కోసం స్పెక్ట్రమ్ కేటాయిస్తుందని భావిస్తున్నాం’’ అని చెప్పారు. భారత్‌లో ఇన్వెస్ట్ చేయడానికి హువావే సిద్ధంగా ఉందని జేచెన్ తెలిపారు. అలాగే, భారత స్టార్టప్‌లతో కలిసి ప్రపంచానికి కావాల్సిన ఉత్పత్తులను అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు.

## టెక్ మహీంద్రా హెచ్‌ఆర్ సేవల కోసం హ్యుమనాయిడ్



**న్యూఢిల్లీ:** ఐటీ సేవల కంపెనీ టెక్‌మహీంద్రా నోయిడాలోని తన ప్రత్యేక ఆర్థిక మండలి క్యాంపస్‌లో మానవ వనరుల సేవల కోసం రోబోను (హ్యుమనాయిడ్) ప్రవేశపెట్టింది. హైదరాబాద్‌లోని క్యాంపస్ కోసం గత నెలలోనే హెచ్‌ఆర్ హ్యుమనాయిడ్‌ను ఈ సంస్థ అందుబాటులోకి తీసుకురావడం గమనార్హం. రోజువారీ సాధారణ హెచ్‌ఆర్ పనుల్లో ఇది అక్కడి ఉద్యోగులకు సాయపడుతుంది. పేస్లిప్ అందించడం, పన్ను పత్రాలు ఇలాంటి పనులను చేసి పెడుతుంది. దీంతో హెచ్‌ఆర్ బృందం కంపెనీ ఉద్యోగుల అభివృద్ధికి సంబంధించి ఇతర ముఖ్యమైన పనులపై దృష్టి పెట్టేందుకు వీలు పడుతుందని కంపెనీ తెలిపింది.

## బ్యాంకులపై ఆన్‌లైన్ ఫిర్యాదులకు సీఎంఎస్



**ముంబై:** బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ సంస్థలకు వ్యతిరేకంగా ఫిర్యాదులు దాఖలు చేసుకునేందుకు వీలుగా ఆర్‌బీఐ తన వెబ్‌సైట్‌లో ‘కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్’ అనే ఒక అప్లికేషన్‌ను ప్రవేశపెట్టింది. కస్టమర్ల ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేందుకు వీలుగా దీన్ని తీసుకొచ్చింది. వాణిజ్య బ్యాంకులు, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీ విభాగంలో ఏ నియంత్రిత సంస్థకు వ్యతిరేకంగా అయినా కస్టమర్లు ఫిర్యాదులు దాఖలు చేయవచ్చని ఆర్‌బీఐ తెలిపింది. సంబంధిత ఫిర్యాదులను ఆయా అంబుడ్స్‌మన్/ప్రాంతీయ కార్యాలయాలకు పంపడం జరుగుతుందని పేర్కొంది. ఫిర్యాదుల స్థితిగతులను తెలుసుకునేందుకు ఐవీఆర్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టాలనుకుంటున్నట్టు కూడా తెలిపింది.

## లాజిస్టిక్స్ రంగంలో 1.49 లక్షల ఉద్యోగాలు: టీమ్‌లీజ్



**ముంబై:** ఈ ఏడాది ఏప్రిల్–సెప్టెంబర్ కాలంలో లాజిస్టిక్స్ (సరుకు రవాణా) రంగం 1.49 లక్షల కొత్త కొలువులు రానున్నాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ పేర్కొంది. ఈ రంగం ఉద్యోగాలను కల్పించడంలో 3 శాతం వృద్ధిని సాధించగలదని సర్వే సంస్థ తెలిపింది. 2018–19 ద్వితీయార్థం నాటికి 82.4 లక్షల ఉద్యోగులను కలిగిఉన్న ఈ రంగం.. చొచ్చుకుపోతున్న ఈ–కామర్స్ కంపెనీల జోరుతో మరిన్ని ఉద్యోగాలను కల్పించనుందని టీమ్‌లీజ్ సర్వీసెస్ పారిశ్రామిక, తయారీ, ఇంజనీరింగ్ హెడ్ సుదీప్ సేన్ అన్నారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఆన్‌లైన్ అమ్మకాల జోరు పెరుగుతున్నందున లాజిస్టిక్స్ రంగంలో నూతన ఉద్యోగాలు పెరగనున్నట్లు అంచనావేశారు.

# మేలో మారుతీ హవా

## టాప్-10 బెస్ట్ సెల్లింగ్ కార్లలో 8 మారుతీవే..




**న్యూఢిల్లీ:** దేశీ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) మే నెల విక్రయాల్లో దూసుకుపోయింది. ఇతర కంపెనీల అమ్మకాలు గణనీయంగా తగ్గిపోయినప్పటికీ.. పలు మారుతీ మోడళ్లు మాత్రం రికార్డు స్థాయి విక్రయాలను కొనసాగించాయి. భారత వాహన తయారీదార్ల సంఘం (సియామ్) తాజాగా వెల్లడించిన సమాచారం ప్రకారం.. గతనెల్లో నమోదైన టాప్–10 బెస్ట్ సెల్లింగ్ కార్ల జాబితాలో 8 మారుతీవే ఉన్నాయి. ఆ జాబితాను ఒకసారి పరిశీలిస్తే..

- ఎంఎస్ఐ పాపులర్ హ్యాచ్‌బ్యాక్ ‘స్విఫ్ట్’ గతనెల బెస్ట్ సెల్లింగ్ కార్ల జాబితాలో తొలిస్థానంలో నిలిచింది. ఈ మోడల్ అమ్మకాలు మేలో 17,039 యూనిట్లు కాగా, గతేడాది ఇదేకాలంలో 19,208 యూనిట్లతో నాల్గవ స్థానంలో ఉంది. 2018 మే నెలతో పోలిస్తే అమ్మకాలు తగ్గినప్పటికీ.. ప్రస్తుతం ఆటోమొబైల్ పరిశ్రమలో కొనసాగుతున్న మందగమనం నేపథ్యంలో ఈ మాత్రం అమ్మకాలు సాధించడమనేది రికార్డుగానే చెప్పుకోవాలి.
- ఈ ఏడాది ఫిబ్రవరిలో బెస్ట్ సెల్లింగ్ ప్యాసింజర్ వాహనంగా (పీవీ) అగ్రస్థానంలో నిలిచిన ‘ఆల్టో’.. గతనెల్లో రెండవ స్థానంలో నిలిచింది. మే నెల విక్రయాలు 16,394 యూనిట్లుగా నమోదుకాగా.. గతేడాది ఇదేకాలంలో 21,890 యూనిట్లు అమ్ముడుపోయాయి. అప్పుడు కూడా రెండవ స్థానంలోనే ఉన్నట్లు సియామ్ డేటా ద్వారా వెల్లడైంది.
- కాంపాక్ట్ సెడాన్ ‘డిజైర్’ 16,196 యూనిట్ల విక్రయాలతో మూడవ స్థానంలో నిలిచింది. గతేడాది 24,365 యూనిట్లతో మొదటిస్థానంలో ఉంది. ఏడాది ప్రాతిపదికన అగ్రస్థానం నుంచి మూడవ స్థానానికి పడిపోయింది.
- ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ ‘బాలెనో’ గతనెల బెస్ట్ సెల్లింగ్ కార్ల జాబితాలో నాల్గవ స్థానంలో ఉంది. మేలో మొత్తం అమ్మకాలు 15,176 యూనిట్లు కాగా, అంతకుముందు ఏడాది ఇదేకాలంలో 19,398 యూనిట్లతో మూడవస్థానంలో నిలిచింది.
- వ్యాగన్‌ఆర్ 14,561 యూనిట్లతో 5వ స్థానంలో ఉంది. గతేడాది ఇదేకాలంలో పాత మోడల్ 15,974 యూనిట్ల విక్రయాలను నమోదుచేసింది. ఎంఎస్ఐ యుటిలిటీ వ్యాన్ ‘ఈకో’ 11,739 యూనిట్లతో 6వ స్థానంలో నిలిచింది. ‘ఎర్టిగా’ 8,864 యూనిట్లతో 9వ స్థానంలోనూ.. విటారా బ్రెజా 8,781 యూనిట్ల అమ్మకాలతో 10వ స్థానంలో నిలిచాయి.
- టాప్–10 బెస్ట్ సెల్లింగ్ కార్లలో హ్యుందాయ్ 2 స్థానాలను దక్కించుకుంది. క్రెటా 9,054 యూనిట్లతో 7వ స్థానంలోనూ.. ఎలైట్ ఐ20 8,958 యూనిట్లతో 8వ స్థానంలోనూ నిలిచాయి. ఇక గతనెల ప్యాసింజర్ వాహనాల మొత్తం అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 20 శాతం క్షీణించాయి. ఏకంగా 18 ఏళ్ల కనిష్టానికి పడిపోయాయి. ఈఏడాది మే నెల అమ్మకాలు 2,39,347 యూనిట్లు కాగా, గతేడాది మే విక్రయాలు 3,01,238 యూనిట్లుగా నమోదైనట్లు సియామ్ వెల్లడించింది.

## ఇమామిలో 10 శాతం వాటా అమ్మకం

### రూ.1,230 కోట్లకు విక్రయించిన ప్రమోటర్లు




**న్యూఢిల్లీ:** ఇమామి కంపెనీ ప్రమోటర్లు ఆ కంపెనీలో మరో 10 శాతం వాటాను విక్రయించారు. ఈ వాటాను రూ.1,230 కోట్లకు సంస్థాగత ఇన్వెస్టర్లకు విక్రయించారని ఇమామి తెలియజేసింది. ఇమామి గ్రూప్ రుణభారం తగ్గించుకోవడానికి ఈ వాటా విక్రయం జరిగిందని పేర్కొంది. కాగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రమోటర్లు 10 శాతం వాటాను రూ.1,600 కోట్లకు విక్రయించారు. తాజా వాటా విక్రయం అనంతరం ఇమామిలో ప్రమోటర్ల వాటా 52.74 శాతానికి తగ్గుతుంది. ఈ వాటాను ప్రమోటర్లు కొనసాగిస్తారని, మరింత వాటా విక్రయం ఉండబోదని కంపెనీ స్పష్టం చేసింది.

**రుణ భారం తగ్గించడానికే...**

రుణ భారం తగ్గించుకోవడమే ప్రమోటర్ల ప్రాధాన్యతాంశమని ఇమామి గ్రూప్ డైరెక్టర్ ఆదిత్య అగర్వాల్ వెల్లడించారు. ఇమామి గ్రూప్ భవిష్యత్తు వృద్ధి కోసం అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు.

# ఆధార్ ప్రింట్ చేసినట్టు కాదు..!

- ‘ఎలక్ట్రిక్’కు మారడంపై టీవీఎస్, బజాజ్ ఆటో విమర్శలు
- పూర్తి సప్లయ్ చెయిన్‌ను ఏర్పాటు చేయాలని సూచన
- నీతి ఆయోగ్ ప్రతిపాదన పట్ల అభ్యంతరం



**న్యూఢిల్లీ:** త్రిచక్ర వాహనాలను 2023 నుంచి, ద్విచక్ర వాహనాలను 2025 నుంచి పూర్తిగా ఎలక్ట్రిక్ రూపంలోనే అనుమతించాలన్న నీతి ఆయోగ్ ప్రతిపాదనపై అగ్రశ్రేణి ఆటో కంపెనీలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఇదేమీ ఆధార్ కార్డును ప్రింట్ చేసింత ఈజీ కాదని టీవీఎస్, బజాజ్ ఆటో వ్యాఖ్యానించాయి. ఈ ప్రతిపాదనల వెనక తగినంత అధ్యయనం, సంప్రదింపులు లేవని పేర్కొన్నాయి. ‘‘ఇది ఆధార్ కార్డు కాదు. సాఫ్ట్‌వేర్, ప్రింట్ కార్డులు కాదు. మొత్తం సరఫరా చెయిన్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే ప్రస్తుత వ్యవస్థ నుంచి దానికి మళ్లాల్సి ఉంటుంది’’ అని టీవీఎస్ మోటార్ కంపెనీ చైర్మన్, ఎండీ వేణు శ్రీనివాసన్ పేర్కొన్నారు. తమ ప్రతిపాదనలపై రెండు వారాల్లో ఆటో మొబైల్ పరిశ్రమ స్పందించాలని నీతి ఆయోగ్ కోరిన నేపథ్యంలో వేణు శ్రీనివాసన్ ఈ వ్యాఖ్యలు చేయటం గమనార్హం.

**నాలుగు నెలల సమయం కోరాం...**

‘‘ఓ ప్రణాళికతో ముందుకు రావడానికి మాకు నాలుగు నెలల సమయం పడుతుందని తెలియజేశాం. ప్రణాళిక ఓ నగరంతో (అత్యధిక ద్విచక్ర వాహనాలు కలిగిన నగరం) మొదలవుతుంది. ఆ తర్వాత బదిలీ అన్నది కొంత కాలానికి జరుగుతుంది’’ అని వేణు శ్రీనివాసన్ తెలిపారు. 2 కోట్ల వాహనాలు, 15 బిలియన్ డాలర్ల అమ్మకాలు, 10 లక్షల మంది ఉపాధితో కూడిన ఈ రంగంలో ఒకేసారి పూర్తిగా మార్పు అన్నది సాధ్యం కాదని చెప్పారాయన. థర్మల్ (బొగ్గు ఆధారిత) విద్యుత్‌తో నడిచే బ్యాటరీలకు మళ్లడం కాలుష్యాన్ని తగ్గించదని స్పష్టంచేశారు. కాలుష్యంలో వాహనాల పాత్ర 20 శాతం అయితే, ఇందులో ద్విచక్ర వాహనాల నుంచి వెలువడే కాలుష్యం 20 శాతమేనని, అంటే కేవలం 4 శాతం కాలుష్యం గురించి ఇదంతా చేస్తున్నట్టుగా ఉందని అభిప్రాయపడ్డారు. దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమ పెద్ద ఎత్తున విదేశీ పెట్టుబడులను ఆకర్షించిందని, ఈ విషయంలో చాలా జాగ్రత్తగా డీల్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. కాగా పూర్తిగా 100 శాతం ఎలక్ట్రిక్ వాహనాలకు మళ్లడం అన్నది అవసరం లేదని బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్ చెప్పారు. కార్లు తదితర వాహనాలను వదిలేసి, కేవలం ద్వి, త్రిచక్ర వాహనాలనే లక్ష్యం చేసుకోవడాన్ని ఆయన తప్పుబట్టారు.

### తీవ్రంగా ఆందోళన చెందుతున్నాం: హీరో మోటోకార్ప్

150సీసీ సామర్థ్యం వరకు, ఇంటర్నల్ కంబస్టన్ ఇంజిన్లతో కూడిన ద్విచక్ర వాహనాలను పూర్తిగా నిషేధించాలన్న నీతి ఆయోగ్ విధానంతో తలెత్తబోయే పరిణామాలపై తాము తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్టు అగ్రగామి టూవీలర్ కంపెనీ హీరో మోటోకార్ప్ ప్రకటించింది. ఈ విధానంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించింది. 150సీసీ సామర్థ్యంలోపు ముఖ్యంగా 100సీసీ, 110సీసీ, 125సీసీ విభాగంలో విక్రయమయ్యే అత్యధిక వాహనాలు ఈ కంపెనీవే. భాగస్వాములు అందరి ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని కంపెనీ సూచించింది. ఎలక్ట్రిక్ వాహనాల అమలును బలవంతంగా రుద్దడానికి బదులు, మార్కెట్ పరిస్థితులు, కస్టమర్ల వైపు నుంచి ఆమోదం వంటి అంశాలతో ఎలక్ట్రిక్ వాహనాలకు మళ్లడం అనేది ఆధారపడి ఉండాలని సూచించింది. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ, దేశ జీడీపీలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ రంగంపై ప్రతిపాదిత నిషేధం తీవ్ర ప్రభావం చూపుతుందని హీరో మోటోకార్ప్ ఆందోళన వ్యక్తం చేసింది.




## 64 మెగాపిక్సెల్ కెమెరాతో స్మార్ట్‌ఫోన్

### రూపొందిస్తున్న రియల్‌మీ

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ రియల్‌మీ 64 మెగా పిక్సెల్ కెమెరాతో స్మార్ట్‌ఫోన్‌ను రూపొందిస్తోంది. శామ్‌సంగ్ జీడబ్ల్యూ1 సెన్సార్‌తో అభివృద్ధి చేసిన ఈ కెమెరాతో తీసిన చిత్రాన్ని కంపెనీ సీఈవో మాధవ్ సేథ్ ట్వీట్ చేశారు. మొదటి సారిగా ఈ స్మార్ట్‌ఫోన్‌ను భారత్‌లో విడుదల చేస్తారు. ప్రపంచంలో తొలిసారిగా 64 మెగా పిక్సెల్ కెమెరాను పొందుపరిచిన స్మార్ట్‌ఫోన్ ఇదే కావడం గమనార్హం. శామ్‌సంగ్ టెట్రా సెల్ టెక్నాలజీతో తయారైన ఈ కెమెరాతో తక్కువ వెలుతురులోనూ స్పష్టమైన చిత్రాలను తీయవచ్చు. వెనుకవైపు నాలుగు కెమెరాలు పొందుపరిచారు. కాగా, రియల్‌మీ జనవరి– మార్చి కాలంలో భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో 7.25 శాతం వాటా దక్కించుకుంది. డిసెంబర్ నాటికి 12–15 శాతం వాటాను లక్ష్యంగా చేసుకుంది.



# స్టార్టప్‌లకు మైక్రోసాఫ్ట్ దన్ను

## ఎమ్ 12 వెంచర్ ఫండ్ ద్వారా స్టార్టప్‌లకు కొత్త విలువ



**బెంగళూరు:** స్టార్టప్‌ల తర్వాతి దశ వృద్ధికి ఇతోధికంగా తోడ్పాడతామని టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. తమ ఎమ్12 అనే వెంచర్ ఫండ్ ద్వారా భారత్‌లో స్టార్టప్‌లకు కొత్త విలువ సృష్టిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ అనంత్ మహేశ్వరి పేర్కొన్నారు. స్టార్టప్‌లు అంతర్జాతీయ స్థాయికి ఎదగడానికి తగిన సాంకేతిక నైపుణ్యాన్ని అందిస్తున్నామని, ఆర్థిక వృద్ధికి చోదకశక్తిగా ఉపయోగపడేలా స్టార్టప్‌లకు చేయూతనిస్తున్నామని వివరించారు. స్టార్టప్‌లు విజయవంతమైన వ్యాపార సంస్థలుగా రూపొందడానికి 'మైక్రోసాఫ్ట్ ఫర్ స్టార్టప్స్' పేరిట తాము ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫామ్ తోడ్పాటునందిస్తున్నట్లు 'మైక్రోసాఫ్ట్ ఫర్ స్టార్టప్స్' కంట్రీ హెడ్ లతిక పాయ్ తెలియజేశారు. మైక్రోసాఫ్ట్ క్లౌడ్ మార్కెట్ ప్లేస్, ఎంటర్‌ప్రైజ్ సేల్స్ టీమ్, భారీ స్థాయిలో ఉన్న ఇతర భాగస్వామ్య సంస్థలు... ఈ అంశాలన్నీ స్టార్టప్‌లకు అంతర్జాతీయంగా వినియోగదారులు లభించేలా చూస్తాయని పేర్కొన్నారు. కేవలం ఏడాదిన్నర కాలంలోనే స్టార్టప్‌లకు 120 ఒప్పందాలు కుదిరేలా చూశామని తెలిపారు. 13 కోట్ల డాలర్ల డీల్స్ ప్రస్తుతం సంప్రతింపుల దశలో ఉన్నట్లు తెలియజేశారు.

# బడ్జెట్‌కు ముందు జాగ్రత్త

- రెండో రోజూ నష్టాలు
- అమెరికా– ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు
- హెచ్చు తగ్గుల్లో సెన్సెక్స్, నిఫ్టీలు
- 72 పాయింట్ల నష్టంతో 39,123కు సెన్సెక్స్
- 24 పాయింట్లు పతనమై 11,700కు నిఫ్టీ



అమెరికా– ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ప్రతికూల ప్రభావం చూపడంతో సోమవారం స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. ఇంట్రాడేలో డాలర్‌తో రూపాయి మారకం 23 పైసలు బలపడ్డా సెన్సెక్స్, నిఫ్టీలు నష్టపోయాయి. సెన్సెక్స్, నిఫ్టీలు పతనమవడం ఇది వరుసగా రెండో రోజు. ఈ రెండు సూచీలు సోమవారం నాటి ట్రేడింగ్‌లో తీవ్రమైన ఒడిదుడుకులకు గురయ్యాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 72 పాయింట్లు పతనమై, 39,123 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 24 పాయింట్లు నష్టపోయి 11,700 పాయింట్ల వద్ద ముగిశాయి.

**278 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్...**

అమెరికా– ఇరాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా ఇంధన, గ్యాస్ షేర్లు, అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఒప్పందం విషయమై అనిశ్చితి కారణంగా లోహ షేర్లు క్షీణించాయి. ఎలక్ట్రిక్ వాహనాల విషయమై రెండు వారాల్లో రోడ్‌మ్యాప్‌ను సమర్పించాలని నీతి ఆయోగ్ వాహన కంపెనీలను కోరిన నేపథ్యంలో వాహన షేర్లు పతనమయ్యాయి. షేర్ల విలువలు అధికంగా ఉన్న నేపథ్యంలో వచ్చే వారంలోనే బడ్జెట్ రానుండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటిస్తున్నారని నిపుణులంటున్నారు. సెన్సెక్స్ నష్టాల్లో ఆరంభమైనా, వెంటనే లాభాల్లోకి పుంజుకుంది. కొంత సేపటికే మళ్లీ నష్టాల్లోకి జారిపోయింది. లాభ, నష్టాల మధ్య దోబూచులాడింది. ఒక దశలో 106 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్, మరో దశలో 172 పాయింట్లు పతనమైంది. మొత్తం మీద రోజంతా 278 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది.

**బడ్జెట్‌పై ఇన్వెస్టర్ల దృష్టి...**

బడ్జెట్ ప్రతిపాదనలు, నైరుతి రుతుపవనాల విస్తరణ, జీ–20 సమావేశాలు.... ఇవన్నీ స్టాక్ మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని, ఈ అంశాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారిస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు. అమెరికాలో వచ్చే ఏడాది ఎన్నికలు జరుగుతుండటం, అక్కడి ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉండటం వంటి కారణాల వల్ల ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ దూకుడు తగ్గించారని శాంక్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ ఎనలిస్ట్ సునీల్ శర్మ వ్యాఖ్యానించారు. ఇది ఇన్వెస్టర్లకు ఊరటనిచ్చే విషయమేనని పేర్కొన్నారు.

### ముఖ్యాంశాలు...

- ఓఎన్‌జీసీ 3 శాతం నష్టంతో రూ.162 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే.
- లుపిన్ షేర్ 3 శాతం లాభంతో రూ.733 వద్ద ముగిసింది. ఈ కంపెనీ రేటింగ్‌ను అండర్‌పెర్ఫామ్ నుంచి అవుట్ పెర్ఫామ్‌కు అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ క్రెడిట్ సూసీ అప్‌గ్రేడ్ చేయడం, టార్గెట్ ధరను రూ.800 నుంచి రూ.860కు పెంచడం సానుకూల ప్రభావం చూపించింది.
- కేటరాక్ట్ సర్జరీలో ఉపయోగించే ఔషధానికి అమెరికా ఎఫ్‌డీఏ ఆమోదం లభించడంతో అలెంబిక్ ఫార్మా షేర్ 6 శాతం లాభంతో రూ.505 వద్ద ముగిసింది.
- కాక్స్ అండ్ కింగ్స్ కంపెనీ 20 శాతం లోయర్ సర్క్యూట్‌తో జీవిత కాల కనిష్ట స్థాయి, రూ.49ను తాకింది. ఒక నెల కాలంలో ఈ షేర్ 49 శాతం నష్టపోయింది. ఈ కంపెనీ బ్యాంక్ ఫెసిలిటీస్‌కు సంబంధించిన రేటింగ్‌ను కేర్ సంస్థ తగ్గించినప్పటి నుంచి ఈ షేర్ పతనమవుతూ వస్తోంది.
- దాదాపు 200కు పైగా షేర్లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. కేడిలా హెల్త్‌కేర్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇమామి, గ్లాక్సో స్మిత్‌లైన్ ఫార్మా, గ్లెన్‌మార్క్ ఫార్మా, హిందుస్తాన్ జింక్, టీవీఎస్ మోటార్ ఈ జాబితాలో ఉన్నాయి.

### కార్పొబ్రీఫ్

**ఆంధ్రాబ్యాంకు:** 2019- 20లో క్విప్, ఎఫ్‌పీవో, ప్రాధాన్యత లేని ఆస్తుల విక్రయం, ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్ లేదా ఇతర మార్గాల ద్వారా రూ.2,000 కోట్లు సమీకరించాలని బోర్డు నిర్ణయించింది.

### సోమవారం స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్‌ఈ | 3,355 |
| ఎన్‌ఎస్‌ఈ | 26,916 |
| ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్) | 8,03,655 |
| ఎఫ్‌ఐఐ | 207 |
| డీఐఐ | 984 |

### నిఫ్టీ 50

**టాప్ 10 గెయినర్స్** (రూపాయిల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| UPL | 938 | 5.38 |
| YESBANK | 111.4 | 1.64 |
| M&M | 636.7 | 1.47 |
| TCS | 2,277.00 | 1.21 |
| SBIN | 353.1 | 1.06 |
| ADANIPORTS | 406 | 1 |
| IBULHSGFIN | 617.7 | 0.93 |
| NTPC | 135.7 | 0.85 |
| COALINDIA | 256.1 | 0.73 |
| INDUSINDBK | 1,459.00 | 0.71 |

**టాప్ 10 లూజర్స్** (రూపాయిల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| JSWSTEEL | 258.1 | -3.39 |
| EICHERMOT | 19,075.00 | -3.27 |
| ONGC | 165.8 | -3.01 |
| TATASTEEL | 485.9 | -2.36 |
| BAJAJ-AUTO | 2,814.00 | -2.14 |
| ZEEL | 338.5 | -2.07 |
| VEDL | 169.05 | -1.94 |
| TECHM | 727 | -1.82 |
| BRITANNIA | 2,776.00 | -1.79 |
| DRREDDY | 2,506.10 | -1.78 |

# డీవీఆర్ షేర్లకు కొత్త నిబంధనలు!

**సెబీ కసరత్తు**



**న్యూఢిల్లీ:** డిఫరెన్షియల్ ఓటింగ్ రైట్స్(డీవీఆర్) షేర్లకు సంబంధించి కొత్త నిబంధనలను రూపొందించాలని మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ యోచిస్తోంది. కంపెనీపై తమ నియంత్రణను కోల్పోకుండానే డీవీఆర్ షేర్ల జారీ ద్వారా ప్రస్తుతం ప్రమోటర్లు నిధులు సమీకరించుకోవచ్చు. డీవీఆర్ షేర్లు ఈక్విటీ షేర్ల లాగానే ఉంటాయి. కానీ ఓటింగ్స్ రైట్స్ తక్కువగా ఉంటాయి. తమ కంపెనీ బలవంతపు టేకోవర్‌కు గురి కాకుండా ఉండటం కోసం సాధారణంగా ప్రమోటర్లు ఈ డీవీఆర్ షేర్లను జారీ చేస్తారు. అయితే ఓటింగ్ రైట్స్ అధికంగా ఉండే డీవీఆర్ షేర్లను జారీ చేయడానికి టెక్నాలజీ కంపెనీలకు అనుమతి ఇవ్వాలని సెబీ యోచిస్తోంది. రెగ్యులర్ ఈక్విటీ షేర్ల సంఖ్య భారీగా పెరిగినప్పటికీ, ఓటింగ్ రైట్స్ అధికంగా ఉండే డీవీఆర్ షేర్ల జారీ ద్వారా కంపెనీపై ప్రమోటర్లు తమ నియంత్రణను కోల్పోరు.

**టెక్నాలజీ కంపెనీలకు ప్రయోజనం...!**

ఈ కొత్త నిబంధనలు టెక్నాలజీ కంపెనీలకు ప్రయోజనకరమని నిపుణులంటున్నారు. సాధారణంగా టెక్నాలజీ కంపెనీల విజయం పూర్తిగా ప్రమోటర్లపైననే ఆధారపడి ఉంటుంది. కంపెనీకి కావలసిన నిధుల కోసం రుణాలు తీసుకోవడం కంటే షేర్ల జారీ ద్వారానే నిధుల సమీకరణకు ఈ ప్రమోటర్లు మొగ్గు చూపుతారు. ఇలాంటి సందర్భాల్లో కూడా ప్రమోటర్లకే నియంత్రణ ఉండేలా కొత్త నిబంధనలను సెబీ రూపొందిస్తోంది. ఈ నెల 27న(గురువారం) జరిగే సెబీ బోర్డ్ సమావేశంలో ఈ కొత్త నిబంధనలపై చర్చ జరగనున్నది. అనంతరం ఒక సంప్రదింపుల పత్రాన్ని రూపొందిస్తారు. దీనిపై అందరి అభిప్రాయాలను ఆహ్వానిస్తారు. ఈ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని తుది నిబంధనలను సెబీ అందుబాటులోకి తెస్తుంది.

# ఉద్దేశ పూర్వక ఎగవేతదారుల్లో 60 శాతం పెరుగుదల



న్యూఢిల్లీ: జాతీయ బ్యాంకుల్లో ఈ ఏడాది మార్చి నాటికి ఐదేళ్ల కాలంలో ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులు 60 శాతం పెరిగి 8,582 మంది ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపింది. 2014–15 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ సంఖ్య 5,349 మంది అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. చెల్లించే సామర్థ్యం ఉన్నప్పటికీ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించని వారిని/సంస్థలను ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులుగా బ్యాంకులు పరిగణిస్తాయి. ఇటువంటి వారికి తాజా రుణాలను బ్యాంకులు అందించకపోవడంతోపాటు కొత్త వ్యాపారాలు ప్రారంభించకుండా ఐదేళ్ల పాటు నిషేధం విధించడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

# కొత్త కస్టమర్లను చేరుకోవడమే లక్ష్యం

**ఐపీవో దీర్ఘకాలిక విధానంలో భాగం: ఫ్లిప్‌కార్ట్**



**న్యూఢిల్లీ:** వాల్‌మార్ట్‌కు చెందిన ఫ్లిప్‌కార్ట్ ప్రస్తుతం తమ దృష్టి అంతా 20–30 కోట్ల మంది భారతీయులను కొత్తగా ఈ –కామర్స్ వైపు తీసుకురావటంపైనే ఉందని స్పష్టంచేసింది. ఐపీవోకు రావడం అన్నది తమ ఆకాంక్ష అని, కంపెనీ దీర్ఘకాల వ్యూహంలో ఇది భాగమే అయినప్పటికీ ప్రస్తుతమైతే దీనికి కాలపరిమితి లేదని పేర్కొంది. 2022 నాటికి అమెరికా ఈక్విటీ మార్కెట్లోకి ఫ్లిప్‌కార్ట్ అడుగుపెట్టనుందన్న వార్తల నేపథ్యంలో కంపెనీ నుంచి ఈ ప్రకటన విడుదలైంది. భారత్‌లో భారీ అవకాశాలు ఉన్నాయని, ఇక్కడి మార్కెట్ విషయంలో తమ ప్రణాళికలకు కట్టుబడి ఉన్నట్టు ఫ్లిప్‌కార్ట్ స్పష్టం చేసింది.

**ఫ్లిప్‌కార్ట్‌లో బిన్నీ వాటా కొంత అమ్మకం**

బెంగళూరు: ఫ్లిప్‌కార్ట్ వ్యవస్థాపకుల్లో ఒకరైన బిన్నీ బన్సల్ కంపెనీలో తన వాటాల నుంచి 5.39 (0.33శాతం) లక్షల షేర్లను విక్రయించారు. వాల్‌మార్ట్‌కు చెందిన ఫిట్ హోల్డింగ్స్ ఎస్‌ఏఆర్‌ఎల్ ఈ వాటాలను కొనుగోలు చేసింది. ఈ వాటాల విలువ రూ.531 కోట్లు (76.4 మిలియన్ డాలర్లు). బన్సల్ తన వాటాల నుంచి 5,39,912 ఈక్విటీ షేర్లను వాల్‌మార్ట్ కంపెనీకి విక్రయించినట్టు నియంత్రణ సంస్థలకు ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. మరో వ్యవస్థాపకుడైన సచిన్ బన్సల్, వాల్‌మార్ట్ కొనుగోలు చేసిన సమయంలోనే తన వాటాలను పూర్తిగా విక్రయించి బయటకు వెళ్లిపోయిన విషయం తెలిసిందే. తాజా వాటాల అమ్మకం తర్వాత కూడా ఫ్లిప్‌కార్ట్‌లో బిన్నీ బన్సల్‌కు 3.52 శాతం మిగిలి ఉంటుందని అంచనా.

# గూగుల్ మ్యాప్స్ నుంచి 30 లక్షల నకిలీ బిజినెస్ ప్రొఫైల్స్ తొలగింపు



**న్యూఢిల్లీ:** గూగుల్ మ్యాప్స్ నుంచి 30 లక్షల నకిలీ బిజినెస్ ప్రొఫైల్స్‌ను గత ఏడాది గూగుల్ తొలగించింది. వీటిల్లో దాదాపు 90 శాతం బిజినెస్ ప్రొఫైల్స్‌ను, యూజర్లు చూడకముందే తొలగించామని గూగుల్ మ్యాప్స్ ప్రొడక్ట్ డైరెక్టర్ ఈథన్ రస్సెల్ ఒక బ్లాగ్‌స్పాట్‌లో తెలిపారు. ఒక వ్యాపార సంస్థ కాంటాక్ట్ వివరాలను, ఆ సంస్థకు చేరుకోవలసిన మార్గాల గురించి గూగుల్ మ్యాప్స్ ద్వారా యూజర్లు సమాచారం తెలుసుకోవడం తెలిసిందే. ఈ వివరాలన్నింటినీ ఉచితంగానే అందిస్తామని, అయితే కొందరు మోసగాళ్లు వ్యాపార సంస్థల నుంచి అక్రమంగా వసూళ్లు చేశారని రస్సెల్ వివరించారు. మరోవైపు నకిలీ సంస్థలను చూపించి, తమదే అసలైన సంస్థ అంటూ వినియోగదారులను మోసం చేయడానికి ప్రయత్నించేవాళ్లని పేర్కొన్నారు. వివిధ రకాల టెక్నిక్‌లను ఉపయోగించడం ద్వారా తమ విభాగాలు దుర్వినియోగం కాకుండా చూశామని వివరించారు. యూజర్ల ఫిర్యాదుతో రెండున్నర లక్షల నకిలీ బిజినెస్ ప్రొఫైల్స్‌ను తొలగించామని పేర్కొన్నారు. దుర్వినియోగం చేస్తున్నారన్న ఉద్దేశంతో లక్షన్నర మంది యూజర్ల అకౌంట్లను రద్దు చేశామని వివరించారు. గూగుల్ మ్యాప్స్‌లో 20 కోట్లకు పైగా ప్రదేశాలను జత చేశామని, ప్రతి నెలా ప్రజలను, వ్యాపారాలను 900 కోట్ల సార్లు అనుసంధానిస్తున్నామని పేర్కొన్నారు.

# ఏప్రిల్‌లో జియో, బీఎస్‌ఎన్‌ఎల్ జోరు...

**న్యూఢిల్లీ:** దేశీ టెలికం సబ్‌స్క్రైబర్ల సంఖ్య ఏప్రిల్ చివరినాటికి 118.37 కోట్లకు చేరింది. మార్చిలో ఈ సంఖ్య 118.35 కోట్లుగా ఉన్నట్లు టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) వెల్లడించింది. నెలవారీ వృద్ధి పరంగా 0.02 శాతం నమోదుకాగా, ఇందుకు ప్రధాన కారణం రిలయన్స్ జియో, ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్‌గా వెల్లడించింది. ఈ రెండు దిగ్గజ సంస్థలు కలిపి ఏప్రిల్‌లో 83.10 లక్షల కస్టమర్లను జోడించగా.. భారతి ఎయిర్‌టెల్, టాటా టెలిసర్వీసెస్, వొడాఫోన్ ఐడియా, ఎమ్‌టీఎన్‌ఎల్, రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) సంస్థలు వినియోగదారులను కోల్పోవడం వల్ల సబ్‌స్క్రైబర్ బేస్ తగ్గిందని తెలిపింది.

# జీనోమ్ వ్యాలీలో ఇండియన్ ఇమ్యునాలాజికల్స్ కొత్త కేంద్రం

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** వ్యాక్సిన్ల తయారీ సంస్థ ఇండియన్ ఇమ్యునాలాజికల్స్ (ఐఐఎల్) అత్యాధునిక స్టెరైల్ ఫిల్లింగ్ ఫెసిలిటీని ఏర్పాటు చేస్తోంది. హైదరాబాద్ సమీపంలోని జీనోమ్ వ్యాలీలో ఉన్న తమ తయారీ కేంద్రంలో దీనిని ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ తెలియజేసింది. దీనికి రూ.75 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది చివరికల్లా నిర్మాణం పూర్తవుతుందని తెలిపింది. కొత్త ఫెసిలిటీ ద్వారా యాంటీ రేబీస్ వ్యాక్సిన్ అయిన అభయ్‌రబ్ వంటి వ్యాక్సిన్ల తయారీ సామర్థ్యం పెరుగుతుందని సంస్థ ఎండీ కె.ఆనంద్ కుమార్ ఈ సందర్భంగా చెప్పారు. ఐఐఎల్‌కు తెలంగాణలో రెండు, తమిళనాడు, న్యూజిలాండ్‌లో ఒక్కో తయారీ కేంద్రం ఉన్నాయి. 50కి పైగా దేశాలకు వ్యాక్సిన్లను సరఫరా చేస్తోంది.

### బులియన్ రూ.లలో

| | |
|---|---|
| **ముంబై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,860 |
| బంగారం (22 క్యారెట్లు) | 33,200 |
| వెండి (కిలో) | 41,300 |
| **చెన్నై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,280 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,650 |
| వెండి (కిలో) | 41,300 |
| **హైదరాబాద్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,280 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,650 |
| వెండి (కిలో) | 41,300 |
| **ప్రొద్దుటూరు** | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,000 |
| బంగారం (22 క్యారెట్లు) | 31,480 |
| వెండి (కిలో) | 39,000 |
| **విశాఖపట్నం** | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,100 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,650 |
| వెండి (కిలో) | 39,500 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 35,300 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,650 |
| వెండి (కిలో) | 41,300 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

### ముడిచమురు... (బ్యారల్)

| | రాత్రి 11.30కు | శుక్రవారం ముగింపు |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 57.40 | $57.43 |
| బ్రెంట్ | 63.85 | $64.45 |

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 25-06-2019

| | |
|---|---|
| విశాఖ | 430–00 |
| చిత్తూరు | 463–00 |
| వరంగల్ | 418–00 |
| చెన్నై | 470–00 |
| ముంబై | 472–00 |
| విజయవాడ | 420–00 |
| నమక్కల్ | 455–00 |
| గోదావరి | 420–00 |
| **24-06-2019 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 415–00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.75 |
| బెంగళూరు | 445–00 |
| కోల్‌కత్త | 444–00 |
| ఢిల్లీ | 380–00 |

### ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ADANI PORT | 406 | 402 |
| ASIAN PAINT | 1376.15 | 1383 |
| AXIS BANK L | 762.85 | 771.05 |
| BAJAJ AUTO | 2816.9 | 2875.55 |
| BAJAJ FINSE | 8354.65 | 8392.45 |
| BAJAJ FINAN | 3545.35 | 3565.85 |

**A B C D**

| | | |
|---|---|---|
| 3M INDIA LI | 24260.85 | 24035.65 |
| 3M INDIA LI | 23779.1 | 23529.6 |
| 5PAISA CAPI | 203.4 | 206.8 |
| 63 MOONS TE | 115.7 | 116.7 |
| 8K MILES SO | 80.65 | 76.85 |
| AARTI DRUGS | 530 | 516.35 |
| AARTI INDUS | 1803.2 | 1764.4 |
| BAYER CROPS | 3360.4 | 3340.1 |
| BEML LIMITE | 823.7 | 830.45 |
| BERGER PAIN | 313.9 | 317.7 |
| BF INVESTME | 250.1 | 244.4 |
| BF UTILITIE | 178.2 | 179.9 |
| BHAGERIA IN | 249.4 | 250.1 |
| BHANSALI EN | 62.65 | 60.75 |
| BHARAT BIJL | 1064.35 | 1071.7 |
| BHARAT DYNA | 305.15 | 305.5 |
| BHARAT ELEC | 114.75 | 111.5 |
| DHUNSERI VE | 86.1 | 87 |
| DIC INDIA L | 322.5 | 326.3 |
| DILIP BUILD | 399.3 | 395.95 |
| DISHMAN CAR | 221.5 | 219.95 |
| DIXON TECHN | 2242.45 | 2214.7 |
| DOLLAR INDU | 240 | 240 |
| DR. LAL PAT | 1171.6 | 1162.3 |
| DRS DILIP R | 75.05 | 75.25 |
| DYNAMATIC T | 1366.6 | 1357.75 |
| DYNEMIC PRO | 122.05 | 119.35 |

| | | |
|---|---|---|
| GSS INFOTEC | 93.55 | 99.8 |
| GTPL HATHWA | 60.4 | 60.6 |
| GUFIC BIOSC | 67.4 | 69.3 |
| GUJ IND POW | 71.65 | 72.25 |
| GUJ NAR VAL | 240.25 | 244.15 |
| GUJ STATE F | 91.95 | 94.65 |
| GUJ. APOLLO | 128.15 | 128.05 |
| GUJARAT ALK | 500.5 | 502.4 |
| GUJARAT AMB | 165.1 | 165.65 |
| GUJARAT FLU | 994.65 | 997.35 |
| JBM AUTO LI | 226 | 229.4 |
| JET AIRWAYS | 73.15 | 72.6 |
| JINDAL DRIL | 102.3 | 98.6 |
| JINDAL POLY | 231.1 | 229.5 |
| JINDAL SAW | 81.95 | 81.15 |
| JINDAL STAI | 77.7 | 79.3 |
| JINDAL STEE | 140.2 | 146.5 |
| JINDAL WORL | 67.45 | 71 |
| JK CEMENT L | 1009.3 | 1010.4 |
| JK LAKSHMI | 339.45 | 341.05 |
| MANAPPURAM | 131.3 | 131.45 |
| MANGALAM CE | 252.85 | 238 |
| MARATHON NX | 91.05 | 90.2 |
| MARINE ELEC | 102.2 | 102.1 |
| MAS FINANCI | 595.55 | 598.95 |
| MASTEK LTD | 469.15 | 476.4 |
| MATRIMONY.C | 622.25 | 598.2 |
| MAX FINANCI | 419.15 | 420.5 |
| MAX INDIA L | 67.1 | 64.4 |
| MAYUR UNIQU | 269.4 | 272.8 |

| | | |
|---|---|---|
| PONNIE SUGA | 114.7 | 115.3 |
| POWER FIN C | 131.65 | 130.5 |
| POWER MECH | 968.45 | 948.75 |
| PPAP AUTOMO | 244.3 | 245.65 |
| PRABHAT DAI | 60 | 60.6 |
| PRAJ INDUST | 139.7 | 139.65 |
| PRAKASH IND | 65.35 | 66.75 |
| PRATAAP SNA | 843.2 | 864.5 |
| PRAXIS HOME | 99.6 | 97.3 |
| PRECISION C | 60.9 | 63 |
| SHARDA MOTO | 1343.3 | 1378.1 |
| SHEELA FOAM | 1305.8 | 1323.5 |
| SHEMAROO EN | 340.65 | 352.55 |
| SHILPA MEDI | 348.2 | 348.35 |
| SHIVA TEXYA | 134.65 | 142.75 |
| SHOPPERS ST | 479.55 | 478.85 |
| SHRE PUSH C | 119.25 | 116.95 |
| SHREE VASU | 123.9 | 123.3 |
| SHRENIK LIM | 81.65 | 84.15 |
| SHREYANS IN | 141 | 142.1 |
| THE HI-TECH | 240 | 242.95 |
| THE INDIA C | 95.4 | 95.65 |
| THE INDIAN | 154 | 150.8 |
| THE INVEST | 116.4 | 121.85 |
| THE PHOENIX | 650.8 | 657.3 |
| THE RAMCO C | 794.65 | 804.75 |
| THE RUBY MI | 217.4 | 216.7 |
| THE STATE T | 107.65 | 106.15 |
| THE TINPLAT | 124.95 | 124 |
| THEJO ENGIN | 510 | 513 |

# ప్రతి సోమవారం ‘గ్రూప్‌-2’ జాబితా

**ఇంటర్వ్యూ వివరాలను వెల్లడించిన టీఎస్‌పీఎస్సీ**

**సాక్షి, హైదరాబాద్‌:** జూలై 1 నుంచి నిర్వహించనున్న గ్రూప్‌–2 ఇంటర్వ్యూకు హాజరు కావాల్సిన అభ్యర్థుల జాబితాలను ప్రతి సోమవారం ప్రకటిస్తామని టీఎస్‌పీఎస్సీ తెలిపింది. జూలై 1 నుంచి 6 వరకు జరిగే ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల హాల్‌టికెట్‌ నంబర్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

**అభ్యర్థులకు మాత్రమే అనుమతి..**

గ్రూప్‌–2 ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ కొన్ని సూచనలు చేసింది. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం 12.30కి రిపోర్టు చేయాలని పేర్కొంది. అభ్యర్థులు ఒకరికి మాత్రమే ఆఫీసు లోపలికి అనుమతి ఉంటుందని, గైడ్‌ చేయడానికి ఆఫీస్‌ మొదటి అంతస్తులో హెల్ప్‌ డెస్క్‌ ఉంటుందని తెలిపింది. అభ్యర్థులకు ఇంటర్వ్యూ ప్రక్రియ ప్రారంభానికి ముందు బయోమెట్రిక్‌ అటెండెన్స్‌ ఉంటుందని పేర్కొంది. ఉదయం 9.30 తర్వాత, మధ్యాహ్నం 1 తర్వాత రిపోర్టు చేస్తే ఇంటర్వ్యూకు అనుమతించబోమని తెలిపింది. పీహెచ్‌ అభ్యర్థులు, బాలింతలు, గర్భిణీ స్త్రీలకు సూచించిన సమయం కంటే కొంచెం ముందుగా సెక్యూరిటీ నిబంధనలతో ఆఫీస్‌లోకి అనుమతి ఉంటుందని పేర్కొంది. ఇంటర్వ్యూకు వచ్చే వారు సర్టిఫికెట్‌ వెరిఫికేషన్‌కు హాజరైనప్పటి వివరాలు, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఏదైనా ఐడీ ప్రూఫ్‌ (ఆధార్, డ్రైవింగ్‌ లైసెన్స్, పాస్‌పోర్టు) వెంట తెచ్చుకోవాలని సూచించింది. అభ్యర్థులు మొబైల్, కాలిక్యులేటర్, పెన్‌డ్రైవ్స్, బ్లూటూత్, పర్సు, నోట్స్, పెన్నులు తదితర వస్తువులు తమ వెంట తీసుకురావద్దని.. వీటిలో ఏవి కనిపించినా సీజ్‌ చేస్తామని హెచ్చరించింది. టీఎస్‌పీఎస్సీ ఇంటర్వ్యూలపై వచ్చే పుకార్లను నమ్మవద్దని.. ఒకవేళ వాటిలో నిజం ఉందని అనిపిస్తే విజిలెన్స్‌ సెల్‌ మెయిల్‌ ఐడీ (vigilance@tspsc.gov.in)కి ఫిర్యాదు చేయవచ్చని అభ్యర్థులకు సూచించింది.

## ‘ఆర్టీసీ కార్మిక సమస్యలు పరిష్కరించండి’

**సాక్షి, హైదరాబాద్‌:** ఆర్టీసీలో పెండింగ్‌ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నేషనల్‌ మజ్దూర్‌ యూనియన్‌ చైర్మన్‌ ఎం.నాగేశ్వర రావు డిమాండ్‌ చేశారు. తక్షణమే వేతన సవరణ చేయాలని, కండక్టర్, డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. లేదంటే ఆర్టీసీలో సమ్మె అనివార్యమని సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.





# కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలి

**ధన్యవాద తీర్మానంపై చర్చలో టీఆర్‌ఎస్‌ ఎంపీ నామా**



**సాక్షి, న్యూఢిల్లీ:** కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ప్రకటించాలని కేంద్రాన్ని టీఆర్‌ఎస్‌ డిమాండ్‌ చేసింది. ఆ పార్టీ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర రావు సోమవారం లోక్‌సభలో ‘రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం’పై జరిగిన చర్చలో మాట్లాడారు. ‘తెలంగాణ ఏర్పడి కొద్దికాలమే అయినా రైతుల గురించి ఆలోచించి సీఎం కేసీఆర్‌ అనేక సాగునీటి ప్రాజెక్టులు ఆరంభించారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం మహారాష్ట్ర సీఎంని కలిసి ఇరు రాష్ట్రాల మధ్య సమస్యలను పరిష్కరించారు. ఈరోజు ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టును మూడేళ్లలో నిర్మించగలిగారు. దీనికి రూ.50 వేల కోట్లు ఖర్చు చేశారు. దీని వల్ల 45 లక్షల మంది రైతులకు సాగునీరు అందించగలుగుతున్నారు. వేలాది గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని మొదటి నుంచీ కోరుతున్నాం. సమాఖ్య వ్యవస్థను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రాలకు సహకారం అందించాలి. దాదాపు 600 మీటర్ల ఎత్తు వరకు గోదావరి నుంచి నీటిని ఎత్తిపోస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులకు కూడా చూపిస్తాం. అలాగే ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం అమల్లోకి వచ్చి ఐదేళ్లు గడిచినా అనేక నిబంధనలు అమలు కాకుండా ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెబుతున్నాం. కేంద్రం ప్రవేశపెట్టిన కిసాన్‌ సమ్మాన్‌ నిధి కంటే ముందే తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ.10 వేలు ఇస్తోంది. కేంద్రం మొత్తం భూమికి రూ.6 వేలు మాత్రమే ఇస్తోంది. ఇక రైతు బీమా కూడా రూ.5 లక్షల మేర అందుబాటులోకి తెచ్చాం. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ విద్యార్థుల కోసం వందలాది గురుకుల పాఠశాలలు అందుబాటులోకి తెచ్చాం. డీమానిటైజేషన్, జీఎస్టీ అంశాలకు మద్దతు ఇచ్చాం. అందువల్ల తెలంగాణ అభివృద్ధికి అన్ని విషయాల్లో కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వాలి. నదుల అనుసంధానం చేపట్టి తద్వారా కాళేశ్వరం ప్రాజెక్టుకు కూడా నిధులు అందజేయాలి. అలాగే తెలంగాణలో అగ్రశ్రేణిలో ఉన్న పౌల్ట్రీ రంగానికి మద్దతుగా నిలవాలి’అని ఆయన కోరారు.









# జూలై 16న శ్రీవారి ఆలయం మూత

**చంద్రగ్రహణం కారణంగా మూసివేత**

**తిరుమల:** చంద్ర గ్రహణం కారణంగా జూలై 16వ తేదీ రాత్రి 7.00 గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారుజామున 5.00 గంటల వరకు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయ తలుపులు మూసివేయనున్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని తిరుమల తిరుపతి దేవస్థానం కోరింది. జూలై 17వ తేదీ బుధవారం ఉదయాత్పూర్వం 1.31 నుంచి 4.29 గంటల వరకు చంద్ర గ్రహణం ఉంటుంది. గ్రహణ సమయానికి 6 గంటలకు ముందు ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. జూలై 17వ తేదీన ఉదయం 5.00 గంటలకు సుప్రభాతంతో ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహించనున్నారు. అయితే ఆ రోజు ఉదయం 11.00 గంటలకు సర్వదర్శనం ప్రారంభమవుతుంది.

**జూలై 16, 17వ తేదీల్లో ఆర్జిత సేవలు రద్దు...**

కోయిల్‌ ఆళ్వార్‌ తిరుమంజనంతోపాటు చంద్ర గ్రహణం కారణంగా జూలై 16, 17వ తేదీల్లో అష్టదళ పాద పద్మారాధన, వసంతోత్సవం, సహస్ర దీపాలంకార సేవలు రద్దయ్యాయి. అలాగే జూలై 17న ఆణివార ఆస్థానం కారణంగా కల్యాణోత్సవం, ఊంజల్‌ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్ర దీపాలంకార సేవలనూ టీటీడీ రద్దు చేసింది.

# 23,715 మంది తొలి రోజు రిజిస్ట్రేషన్‌

**ఇంజనీరింగ్‌ కౌన్సెలింగ్‌ ప్రారంభం**

**సాక్షి, హైదరాబాద్‌:** ఇంజనీరింగ్‌ ప్రవేశాల కౌన్సెలింగ్‌ సోమవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా మొదటి రోజు 23,715 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్‌ చేసుకొని, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ కోసం స్లాట్‌ బుక్‌ చేసుకున్నట్లు ప్రవేశాల కన్వీనర్‌ నవీన్‌ మిట్టల్‌ తెలిపారు. విద్యార్థులు వీలైనంత ముందుగా స్లాట్‌ బుక్‌ చేసుకొని సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ చేయించుకోవాలని, వారికి వెబ్‌ ఆప్షన్లకు ఎక్కువ సమయం ఉంటుందని పేర్కొన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వెబ్‌ ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 27 నుంచి ప్రారంభం అవుతుందని వెల్లడించారు.

**ఈసెట్‌లో..**

ఈసెట్‌ సర్టిఫికెట్ల వెరిఫి కేషన్‌ను సోమవారం 6,018 మంది విద్యార్థులు చేయించుకున్నట్లు నవీన్‌ మిట్టల్‌ తెలిపారు. 17,337 మంది ఫీజు చెల్లించి స్లాట్‌ బుక్‌ చేసుకున్నట్లు వివరించారు. ఈ నెల 25 వరకు విద్యార్థులు ఫీజు చెల్లించి స్లాట్‌ బుక్‌ చేసుకోవచ్చని, 26 వరకు వెరిఫికేషన్‌ చేయించుకోవచ్చని, 27లోగా వెబ్‌ ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు.




Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792

NEWS PAPERS
తెలుగు

GET IT ON
Google Play

***Size : below 8 mb***

